అపరాధ పరిశోధన

రూ.7.50 సెప్టెంబరు '88



Blank Page

సంపుటి: 48 ఫోన్ నెం
సంచిక : 2 64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-9-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

జులై '88 పోటీ ఫలితాలు

(1) జులై '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్ర బహుమతి పొందిన వ్యాఖ్య:

కన్నె గులాబీ వన్నెల నృత్యం!
ఎన్ని తరాలైనా పోరాటమే నిత్యం!!

పంపినవారు: శ్రీమతి ఆర్. జ్యోతి. W/o ఆర్. విశ్వేశ్వర రావు, టెలిఫోన్ ఎక్స్చేంజ్, ఏలూరు-534 001.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పోరాటానికి అంతా సిద్ధం!
పడటానికి ఎంత రాద్ధాంతం?

పంపినవారు: శ్రీ కె. వి. మధుసూదనరావు, 1-21-21, కొండయ్యపాలెం. కాకినాడ-533 003.

(గద్దె రంగారావు)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. సునీత పెళ్ళి—జొన్నలగడ్డ రామలక్ష్మి
22. బీజాక్షరాలు (సీరియల్)—వి.యస్.రావ్
50. పోయెటిక్ జస్టిస్—చవాన్ సుదర్శన్‌రావు
70. నకిలీ—వసుంధర
88. బ్రీఫ్ కేస్—విశ్వమోహిని
97. భాగస్థుడిని నమ్మకు—ప్రతాప రవిశంకర్
108. జంటహత్యలు—వాణిశ్రీ
116. ముఖపత్ర సుందరి—తిరుమలశ్రీ
126. నగరంలో నేరగాళ్ళు—(సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. త్రిమూర్తి దేవుడు—వసుంధర
41. రాకాశివేళ్లు—కె.వి.యస్.యన్. మూర్తి
124. బకాసుర వధ—వి.యస్. రావ్
174. రాక్షసపేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, కార్టూన్లు,

మరెన్నో ఆకర్షణలు!!!

20

సునీత పెళ్లి

జొన్నలగడ్డ రామలక్ష్మి

సునీతకు పాతికేళ్ళు. ఇంకా పెళ్ళి కాలేదు. బియ్యే ప్యాసయ్యింది. ఊరికే కూర్చోవడ మెందుకని ఉద్యోగానికి అప్లైచేస్తే ఓ ప్రయివేటు కంపెనీలో ప్రయివేటు సెక్రటరీగా ఉద్యోగం వచ్చింది. నెలకు వెయ్యిరూపాయిల జీతం. ఇప్పటికి రెండేళ్ళ నుంచి ఒక్కర్తీ ఉద్యోగం

చేస్తోంది—విడిగా వేరే ఊళ్ళో వుంది!

సునీత యిలా ఉద్యోగం చేయడం తల్లి కిష్టంలేదు. తండ్రి మాత్రం "ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా మగ పిల్లలతో సమానం. మంచి ఉద్యోగం. చేసుకోనీ" అన్నాడు.

సునీత వేరే గది తీసుకుని వుంటోంది. గది అద్దె రెండు వందల రూపాయలు. ఇంటి అద్దెతో కలిసి ఆమె నెల ఖర్చులు ఆరు—ఏడు వందల మధ్యన వుంటాయి. చేరి నప్పుడు వెయ్యే అయినా రెండేళ్ళలో ఆమె జీతం పదిహేను వందలై పోయింది. అందువల్ల సునీతకు డబ్బులు బాగా మిగుల్తున్నాయి.

ఉద్యోగం సునీతకు బాగా నచ్చింది. ఆమె బాస్ వయసు యాభై వుంటుంది. ఆమె నాయన ప్రేమగా "అమ్మాయ్" అని పిలుస్తాడు. ఆమెకు మర్యాదనిస్తాడు. ఆఫీసులో బాగా పనిచేసే వారందరికీ ఆయ నలాంటి మర్యాదనే యిస్తాడు. సునీత బాగా పనిచేయడం వల్ల ఆయనే కాదు, ఆఫీసులో తోటి ఉద్యోగులు కూడా గౌర విస్తారు.

అన్ని విధాలా తృప్తిగా వుంది సునీతకు. తల్లి మాత్రం ఉత్తరాల్లో సునీత పెళ్ళి గురించి బాధపడుతూంటుంది.

పెళ్ళంటే సునీతకు భయం!

సునీత యింట్లో తల్లిమాటకు తండ్రి ఏ మాత్రమూ విలువ నివ్వడు. చిన్నతనంలో అయితే తండ్రి తల్లిని కొట్టడం ఆమెకు తెలుసు.

తల్లి అంటే సునీత కెంతో యిష్టం. ఆమె తన జీవిత సర్వస్వాన్నీ కుటుంబంకోసం ధారపోసిందని సునీతకు తెలుసు.

కానీ ఆమె సాధించిన దేమిటి?

పదేళ్ళ వయసులో సునీత దొడ్లోంచి ఒక పెద్ద ఇటుకను తీసుకుని వచ్చి తల్లికి చూపించి, "ఈ సారి నాన్న నిన్ను కొడితే వెనుకనుంచీ నేను దీంతో ఆయన్ను కొడతాను" అంది.

తల్లి సంతోషించలేదు సరిగదా మండిపడింది. సునీతను తాను కొట్టినంత పనిచేసింది. సునీతను నోరెత్తనివ్వలేదు.

ఈ విషయం సునీత క్లాస్‌మేట్సుకు చెప్పుకుంది.

ఒకమ్మాయి దిగులుగా, "ఇంతేనే ఆడబ్రతుకు! భర్త హింసించినా కూడా భార్య వాణ్ణి ప్రేమించాలిట. అమ్మ నాకు చెప్పింది" అంది.

ఈ మాటలు సునీతపై ప్రభావం చూపించాయి.

మగాడు హింసిస్తే భరించడందాకా ఫరవాలేదు. హింసించినవాణ్ణి ప్రేమించడమా?

అది ఊహలో కూడా భరించడం కష్టం!

"నేను పెళ్ళి చేసుకోను" అనుకుంది పదేళ్ళ వయసులో.

ఆమెకు పన్నెండేళ్ళ వయసు వచ్చేసరి కింట్లో పెళ్ళి గురించి చర్చలు ప్రారంభమయ్యాయి.

"ఇప్పట్నుంచీ సంబంధాలు చూడండి!" అంటుంది తల్లి.

"అది గ్రాడ్యుయేటయ్యేదాకా దాని పెళ్ళి గురించి ఆలోచించను" అంటాడు తండ్రి.

అప్పుడు తండ్రి సునీతకు నచ్చాడు.

తన పెళ్ళి గురించి ఆలోచించనన్నాడు కాబట్టే తండ్రి ఆమెకు నచ్చాడు.

సునీత చిన్నతనం నుంచీ చుట్టుపక్కల సంసారాలను

గమనిస్తూండేది. ఏ యింట్లో చూసినా మగాడి చేతిలో ఆడది అవమానాలపాలవుతున్నట్లే వుండేది.

అయితే సునీత ఇంకో విషయం కూడా గమనించింది. సాధారణంగా ఆడవాళ్ళ ఆలోచనలు ఇరుకుగా, స్వార్థంతోనూ మూఢాచారాలతోనూ పనికిమాలిన సంప్రదాయాలతోనూ నిండి ఉంటున్నాయి. అందువల్లనే వాళ్ళకూ మగాళ్ళకూ గొడవలు వస్తున్నాయి. ఆడదాని క్షేమం కోరినప్పుడు కూడా మగాడు ఆడదాన్ని తిట్టవలసి వస్తోంది.

ఏది ఏమైనప్పటికీ సునీతకు మగాళ్ళంటే భయం పట్టుకుంది. ఆమె మనసులో, "నేను నా కాళ్ళమీద నిలబడే దాకా పెళ్ళి చేసుకోకూడదు. ఆధారమున్న ఆడదాన్ని మగాడేం చేయలేడు" అనుకుంది.

అయితే ఉద్యోగం చేస్తున్న ఆడవాళ్ళు కూడా మగాడికి అడుగులూ మడుగులూ వత్తుతున్నారు. అదామెకు నచ్చలేదు. తనూ అలాగే చేయాల్సొంటుందని ఆమె భయం.

అందుకే సునీతకు పెళ్ళంటే భయం పోవడం లేదు. ఇప్పుడామె సర్వస్వతంత్రంగానూ, ఎంతో సుఖంగానూ జీవిస్తోంది.

ఇంతవరకూ ఇదీ సునీత కథ. ఇప్పుడా కథ ఒక కొత్తమలుపు తిరుగనున్నదన్న విషయం సునీతకే తెలియదు.

2

అతడి పేరు రామానుజం.

లేకలేక పుట్టిన బిడ్డ కావడంవల్ల తలిదండ్రులతణ్ణి ఎంతో గారాబంగా పెంచారు. అందువల్ల చరువు రాలేదు.

అభిమానంకొద్దీ తలిదండ్రులతడ్ని ఏ తప్పు చేసినా

ఏమీ అనేవారు కాదు. ఫలితంగా అతడికి చెడు అలవాట్లు వచ్చాయి. వాటితోపాటే దుష్టులతో స్నేహమూ అయింది.

కొడుకు గురించిన బెంగతో తండ్రి అరవయ్యేళ్ళు నిండకుండానే చచ్చిపోయాడు. ఆయన మిగిల్చిన అంతో యింతో ఆస్తి తండ్రిపోయిన ఏడాదికే హారతికర్పూరంలా హరించుకుపోయింది.

కొడుకేమయిపోతాడో అన్న బెంగతో తల్లింకా బ్రతికుంది.

రామానుజానికి తల్లి అంటే అభిమానం.

ఆమె అతడి బుద్ధుల్నదుపు చేయదు. క్షేమాన్ని కోరుతుంది.

తన బుద్ధుల్నదుపుచేయాలని రామానుజమూ అనుకోవడం లేదు.

తన అవసరాల కోసం, తల్లిని పోషించడం కోసం అతడు దొంగతనాలు మొదలు పెట్టాడు.

ఒకొక్క మనిషికి ఒకోరకం సామర్థ్యముంటుంది.

దొంగతనాలు మొదలెట్టేవరకూ తనా వృత్తిలో రాణించగలనని రామానుజానికి తెలియదు.

అతడికి రోజులు సుఖంగానే గడిచిపోతున్నాయి. పట్టుబడని ఘరానా దొంగగా చెలామణి అవుతున్నాడతడు.

మనిషి తన తప్పును కప్పిపుచ్చుకునేటందుకే వేషాలు వేస్తాడు.

చాటుగా విలాసాలు మరిగే నాయకులు ఖద్దరు బట్టల ముసుగులో సింపుల్‌గా కనిపించా లనుకుంటారు.

దొంగతనాలు, దౌర్జన్యాలు చేసేవారు పాపభీతితో దాన ధర్మాలు చేస్తారు. పెద్దమనుషులుగా కనిపించాలనుకుంటారు.

రామానుజం దానధర్మాలు చేయలేదు కానీ పెద్దమని షిగా కనిపించడానికి ప్రయత్నించసాగాడు.

తండ్రి మిగిల్చిన యింట్లో ఓ వాటా అద్దెకిచ్చి మరో వాటాలో తనుంటున్నాడు. చుట్టుపక్కలవారికి చేతనయిన సాయం చేస్తున్నాడు. తాగుడు మానేశాడు. సిగరెట్లు తగ్గించాడు. జూద గృహాలకూ, వ్యభిచార గృహాలకూ వెళ్ళడమే లేదు. తల్లిని అపురూపంగా చూసుకుంటున్నాడు.

రామానుజం ఇదంతా చేస్తున్నది తన దొంగతనాలను కప్పిపుచ్చుకునే ముసుగుకోసం మాత్రమే। అయినప్పటికీ అతడుండే వీధిలో అందరూ అతణ్ని గౌరవిస్తున్నారు. ఆదర్శప్రాయంగా చెప్పుకుంటున్నారు.

ఈ జీవితం రామానుజానికి బాగుంది.

అతడి తల్లి కూడా ఈ మార్పు కెంతగానో సంతో షించి, "ఈ యింట్లో కోడలుపిల్ల వస్తే హాయిగా కన్ను మూస్తానురా" అనడం మొదలు పెట్టింది.

రామానుజాని కిప్పుడు పెళ్ళి చేసుకుని స్థిరపడాలని ఉంది. కానీ బంధు వర్గంలో అందరికీ అతడి గురించి తెలుసు. వాళ్ళెవరూ పిల్లనివ్వరు.

అతడు మంచివాడని నమ్మేవాళ్ళతడి బంధువులు కారు. వాళ్ళలో కొందరాడపిల్లలున్నప్పటికీ రామానుజం అడగ డానికి భయపడ్డాడు.

వాళ్ళందరూ అంతో యింతో ఉన్నవాళ్ళు. తమ పిల్ల లకు మంచి సంబంధాలు చేయాలని కలలు కంటున్న వాళ్ళు. కులం కలవకపోయినా రామానుజాన్ని వాళ్ళు వరుడిగా అంగీకరించవచ్చు. కానీ పిల్లనివ్వాలనేసరికి వాళ్ళతడి గురించి లోతుగా వాకబు చేస్తారు. అప్పుడు రామానుజం గతం బయటపడుతుంది. అదతడి కిష్టం

లేదు.

ఆ వీధిలో సుమారు పాతికిళ్ళున్నాయి. ఒక్క రామానుజం కుటుంబాన్ని మినహాయిస్తే మిగతావాళ్ళందరూ రెండేళ్ళు మించి వుండేవారు లేరు. ఆ యిళ్ళ యజమానులందరూ కూడా ఊళ్ళో వుండడం లేదు. తరచుగా ట్రాన్స్‌ఫర్లుండే బ్యాంకు, కాలేజి ఉద్యోగస్థుల కవి లీజ్ ప్లాట్స్‌గా ఉపయోగపడుతున్నాయి.

రామానుజం యింట్లో అద్దెకుంటున్న వారి కెవ్వరికీ కూడా అతడి కుటుంబ గాథ తెలియదు.

తనూ పెళ్ళి చేసుకుని నలుగురికిలా జీవించాలని రామానుజం అనుకోగానే అతడి పాత స్నేహితులు కొందరు, "ఏ చెడిన ఆడదాన్నో పెళ్ళి చేసుకుని ఆమె జీవితాన్ని పునరుద్ధరించు. పుణ్యము, పురుషార్థం రెండూ కలిసొస్తాయి" అన్నారు.

అది రామానుజాని కిష్టం లేదు.

తనూ అందరివంటివాడేనని అంతా అనుకుంటే చాలదు. తను కూడా నమ్మాలి!

తనో చెడిన ఆడదాన్ని పెళ్ళి చేసుకుంటే ఆమె తనకు జీవిత భాగస్వామి అవుతుంది. జీవితాంతం తన గతం తనే మర్చిపోలేడు. ఆమెను చూసినప్పుడల్లా తన అసహాయత గుర్తుకొస్తుంది.

"పతితను మహాత్ముడుద్ధరిస్తే అది విశేషం. పతితుడుద్ధరిస్తే అది అసహాయత. నా అసహాయతను నేను మర్చిపోవాలనుకుంటున్నాను. అందుకో మంచి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని నా కోరిక" అన్నాడత డో స్నేహితుడితో.

"అయితే ఓ పనిచేయి. ఓ మంచి పిల్లను చూసి

ఎన్నుకో. ఎలాగో ఆమెను వశపర్చుకో. మామూలుగా సాధ్యపడకపోతే బలవంతం చేయి నయానో, భయానో, బలవంతానో మగాడికి లొంగిన ఆడది ఏ మగాడు పెళ్ళి చేసుకుంటానన్నా ఒప్పుకుంటుంది. నువ్వే బలవంతంచేసి నువ్వే పెళ్ళి చేసుకుంటానంటే ఆమె అది వరంగానే భావిస్తుంది'' అన్నాడో స్నేహితుడు.

అప్పట్నించీ రామానుజం తనక్కానబడిన ప్రతి ఆడపిల్లనూ ఓ ప్రత్యేక దృష్టితో గమనిస్తున్నాడు.

నెల్లాళ్ళు తిరక్కుండానే అతడికి అన్నివిధాలా నచ్చిన అమ్మాయి సునీత!

3

ఆరోజు ఆదివారం కాదు కానీ సునీత ఆఫీసుకు సెలవు. అందుకని ఆమె ఉదయం ఏడింటికి నిద్రలేచింది.

సునీత ముందురోజే సెలవు గురించి చెప్పడంవల్ల పని మనిషి ఏడున్నరకు వచ్చింది.

పదయ్యేసరికి సునీత వంట, స్నానం పూర్తిచేసింది. పదిన్నరకు భోంచేసింది. తర్వాతేం చేయాలా అని ఆలోచిస్తూ, గూట్లోంచి ఓ నవల తీసింది.

అప్పుడు నవల పేజీల మధ్యనుంచి ఓ ఉత్తరం క్రింద పడింది.

సునీత ఆ ఉత్తరాన్ని తీసింది.

రెండ్రోజులయిందా ఉత్తరం వచ్చి!

ఉత్తరం చదివి నిర్లక్ష్యంగా నవల పేజీల మధ్యకి తోసేసిందామె. కానీ యిప్పుడామె కెందుకో మళ్ళీ ఆ ఉత్తరం చదవాలనిపించింది.

ఆ ఉతరం సునీత తల్లి రాసింది.

రాజారావనే యువకుడు అందంలో మన్మధుడు. ఆధ

ర్యాలకు రాముడు. రసికతలో శ్రీకృష్ణుడు. వినయంలో అతడికతడే సాటి. సునీత తండ్రి అతడికి సునీత ఫోటో చూపించాడు. పిల్ల అతడికి నచ్చింది. మిగతా విషయాలు తలిదండ్రులతో మాట్లాడమన్నాడు.

అతడు బ్యాంకులో ఆఫీసరు. ఈ సంబంధం కుదిరితే సునీత అంత అదృష్టవంతురాలుండదు.

భార్య ఉద్యోగం చేయడం అతడి కిష్టంలేదు. కానీ తన అభిప్రాయాలను భార్యపై రుద్దలేదు.

మేమిద్దరం ఒకసారి మాట్లాడుకుంటాం. నా అభిప్రాయాలామెకు చెప్పి ఆమె అభిప్రాయాలు నేను తెలుసుకుంటాను. తార్కికంగా చర్చించి అన్నింట్లోనూ ఏకాభిప్రాయానికి ప్రయత్నిస్తాం అని అతడు సునీత తండ్రికి చెప్పాడు. అందుక్కారణం సునీత తండ్రి కూతురి మనస్తత్వం గురించి అతడికి వివరించి చెప్పడం!

అతడు ప్రస్తుతం ఊళ్ళో లేడు. నెల్లాళ్ళ తర్వాత వస్తాడు. అప్పటికి సునీతకూడా అక్కడికి వస్తే ఇద్దరూ మాట్లాడుకుని ఒకరినొకరు అవగాహన చేసుకున్నాక అతడి తలిదండ్రులతో మాట్లాడాలని సునీత తండ్రి అనుకుంటున్నాడు.

ఇదీ ఆ ఉత్తరంలోని సారాంశం.

మామూలుగా ఏ ఆడపిల్లకైనా అలాంటి ఉత్తరం అరుదైన వరం! కానీ సునీత కది అలా అనిపించలేదు.

తలిదండ్రులు తనని భ్రమలో పడవేసి పెళ్ళిచేయాలనుకుంటున్నారని ఆమెకు తోచింది. కానీ ఎక్కడో ఏమూలనుంచో రాజారావనే యువకుడామెను పట్టి లాగుతున్నాడు. అందుక్కారణం వయసు కావచ్చు. సునీత మాత్రం తల్లి ఉత్తరం వ్రాసిన తీరనుకుంది.

ఇప్పుడా ఉత్తరం మరోసారి చదువగానే సునీతలో ఉత్సాహం రేగింది. రాజారావు రూపం ఆమె కళ్ళముందు మెదలసాగింది.

క్షణమాత్రంలో ఆమెకూ, రాజారావుకూ పెళ్ళై పోయింది.

అంతే!

రాజారావు చేతిలో కొరడాలు, కత్తులు, తుపాకీలు....

సునీతకు వళ్ళంతా వాతలు, మచ్చలు, గాయాలు....

సునీత భ్రమలోంచి యిలలోకి వచ్చింది. తల్లివ్రాసిన ఉత్తరం ఆమె గుప్పిట్లో నలిగింది.

సరిగ్గా అప్పుడే ఎవరో వీధితలుపు తట్టారు.

సునీత లేచివెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ఓ యువకుడు.

అతడు రామానుజం!

4

అతడెవరో ఆమెకు తెలియదు. కానీ అతడామెను చనువుగా పలకరించి, "మీపేరు సునీతకదూ!" అన్నాడు.

"ఊఁ" అంది సునీత యింకా యిబ్బందిగానే.

"లోపలకు రావచ్చా?" అన్నాడతడు.

సునీత పక్కకు తప్పుకుంది.

అతడు లోపలకు వచ్చాడు.

సునీత అతడికి కుర్చీ చూపించింది.

రామానుజం కుర్చీలో కూర్చున్నాడు.

సునీత మాత్రం అతడి కెదురుగా నిలబడే ఉంది.

రామానుజం క్షణంపాటు ఆమెను తేరిపార చూశాడు. ఆ క్షణంలో సునీత అతడికి అందాల బొమ్మలా కని

పించింది.

ఇద్దరూ కాసేపు మాట్లాడుకోలేదు.

అతడు తన్నే గమనిస్తున్నాడని గ్రహించి ఇబ్బందిపడి సునీత నెమ్మదిగా, "మీగురించి నాకేమీ తెలియదు" అంది.

"అంతా నేను చెబుతాను" అన్నాడు రామానుజం.

సునీత వింటూండగా అతడు తన కథ చెప్పాడు.

ఆ కథ విని భయపడింది. రామానుజం ప్రమాదకరమైన మనిషని ఆమెకు తోచింది.

"ఇంతకీ మీరిక్కడ కెందుకొచ్చారు?" అంది సునీత.

రామానుజం చటుక్కున కుర్చీలోంచి లేచి మెరుపు వేగంతో వీధితలుపులు వేశాడు. ఆ తర్వాత అదేవేగంతో సునీతను సమీపించి అరవకుండా ఆమె నోరునొక్కాడు.

సునీత అతడి చేతుల్లో విలవిలలాడింది.

"అరవనంటే నిన్నేమీ చేయను?" అన్నాడతను.

అరవనన్నట్లు తలూపిందామె.

రామానుజం ఆమెను వదిలిపెట్టి ఒక్కక్షణం పాటు తన జాగ్రత్తలో తనున్నాడు—ఆమె అరిస్తే తిరిగి నోరు నొక్కాలని!

సునీత అరవలేదు.

"గుడ్ గర్ల్!" అన్నాడతడు.

"నేరస్థులంటే నాకు చెప్పలేని భయం" అంది సునీత నెమ్మదిగా, భయంగా.

రామానుజం ఆమెవంక జాలిగా చూసి, "భయపడకు, నేరస్థులందరూ చెడ్డవాళ్ళు కారు" అన్నాడు.

"నువ్వెందు కొచ్చావిక్కడికి?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకోవాలను

కుంటున్నాను"

సునీత తెల్లబోయింది.

అతడు కాసేపామె వంకనే జవాబుకోసం ఎదురుచూసి, "నీ అభిప్రాయం చెప్పు" అన్నాడు.

సునీతకు రాజారావు గుర్తుకొచ్చాడు.

బ్యాంకులో ఆఫీసరు, తనంటే యిష్టపడుతున్నాడు. అతణ్ణే తను పెళ్ళిచేసుకుందు కిష్టపడలేదు. ఈ తిరుగుబోతును లైక్ చేయగలదా?

"నీ అభిప్రాయం చెప్పు"

"నాకు నువ్వంటే యిష్టంలేదు" అంది సునీత.

"ఎందుకని?"

"నీ చరిత్ర మంచిదికాదు"

"నా చరిత్ర నేను చెప్పాను కాబట్టే నీకు తెలిసింది"

"చెప్పినందుకు థాంక్స్!"

"నా ప్రేమకు ప్రతిఫలం థాంక్స్ మాత్రమేనా?"

సునీతకప్పుడు కాస్త ధైర్యం వచ్చింది, "నీవు నన్ను ప్రేమిస్తున్నావనుకుంటే అది నీ భ్రమ" అందామె.

"నా ప్రేమకు ఋజువులున్నాయి" అన్నాడతడు.

"ఏమిటవి?"

"నేను నిన్ను తొలిచూపులోనే ప్రేమించాను. ఆ తర్వాతనుంచి చూపు చూపుకూ నా ప్రేమ పెరిగిపోయింది. నిన్ను పెళ్ళిచేసుకోవాలని నిర్ణయానికి వచ్చాను. నువ్వు కాదనలేకుండా తిరుగులేని పథకం వేశాను" ఆగాడతడు.

సునీత ఏమిటదని అడక్కపోయినా అతడు చెప్పాడు.

అతడు చెప్పింది విని సునీత వణికిపోయింది. అంతవరకూ ఆమె నావహించిన ధైర్యం మటుమాయమయింది.

"ఇప్పుడిక్కడ నువ్వూ, నేనూ! తల్పుకుంటే నేను నిన్నేమైనా చేయగలను. నువ్వు నన్నెదిరించలేవు. నన్నాప లేవు" గర్వంగా అన్నాడు రామానుజం.

"ప్లీజ్, నన్నేమీ చేయకు" అంది సునీత.

రామానుజం నవ్వి, "నువ్వు ప్రతిమాలి నన్నాపలేవు. కానీ నాకు నీమీద ప్రేమ ఉంది. అదే నన్నాపుతోంది" అన్నాడు.

"అంటే?"

"నేను పెళ్ళికోసమే నిన్ను బలవంతం చేయాలనుకుంటున్నాను. కానీ అందువల్ల నీ మనసు గాయపడుతుంది. అది నేనోర్వలేను. అందుకే వేడుకుంటున్నాను. ఏ అఘాయిత్యం అవసరం లేకుండా మన పెళ్ళికొప్పుకో"

"ఒప్పుకోకపోతే?"

"బలవంతం తప్పదు"

"అప్పుడు మాత్రం నేనొప్పుకుంటానా? ఆత్మహత్య చేసుకుంటాను" అంది సునీత.

అతడొకసారి ఆమెనంక అదోలాచూసి, "నీకు కొంత గడువిస్తున్నాను. బాగా ఆలోచించుకో" అన్నాడు.

సునీత మాట్లాడలేదు.

రామానుజం తలుపులు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

5

జరిగింది కలో, నిజమో సునీతకు తెలియలేదు. ఆమె మామూలు మనిషి కావడానికి మూడురోజులు పట్టింది.

ఆరోజు ఆదివారం.

సునీత మేట్నీ సినిమాకు వెళ్ళి హోటల్లో టిఫిన్ చేసి

ఏడింటికల్లా ఇల్లు చేరుకుంది.

బాగా అలసటగా ఉందేమో ముందామె స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చి మంచంమీద పడుకుంది.

ఒక్కక్షణం కళ్ళు మూసుకుని కళ్ళు తెరిచేసరికి ఆమె ఎదుట ఓ యువకుడు నిలబడి ఉన్నాడు.

అతడు రామానుజం!

"నువ్వు అరవవని తెలుసు. అందుకే నేను నీ నోరు నొక్కడంలేదు" అన్నాడు రామానుజం గంభీరంగా.

"ఎలా వచ్చావు?" అంది సునీత.

"నీకంటే ముందే వచ్చి నీ యింట్లో ఉన్నాను."

"లోపలికెలా వచ్చావు?"

"నా ప్రేమ నీ యింటి తలుపులు తెరిచిపెట్టింది."

"అయితే వెంటనే వెళ్ళిపో."

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటానని మాటివ్వు. వెంటనే వెళ్ళిపోతాను" అన్నాడతడు.

"నేను మాటివ్వను."

"అయితే బలవంతం తప్పదు."

"అదీ నీవల్ల కాదు. అరిచి గోలచేస్తాను" అందామె.

రామానుజం నవ్వి, "నేను అన్నింటికీ తెగించినవాణ్ణి. నువ్వు నన్ను పోలీసుల కప్పగించినా నేను భయపడను. నువ్వు నాకులా తెగించినదానివి కాదు. ఆలోచించుకో!" అన్నాడు.

సునీత మాట్లాడలేదు.

"నీకు నేను హామీ యిస్తున్నాను. పెళ్ళయ్యాక నేను నువ్వు చెప్పినట్లు వింటాను. నీ మనసు నొప్పించే పను

లేమీ చేయను. నిన్ను సంతోషపెట్టడానికి నా జీవితం ధార పోస్తాను. అలాగని కాగితం రాసిమ్మంటే యిస్తాను."

"ఎన్ని చేసినా నీ గతచరిత్రను తుడిచి వేయగలవా?"

రామానుజం ముఖం పాలిపోయింది.

సునీత అతణ్ని దెబ్బతీయగలిగినందుకు సంతోషించింది. అందుకే వెంటనే, "నేను పునీతురాల్ని. నన్ను భార్యగాపొందే అర్హత నీకులేదు. నీకు తగ్గవాళ్ళను నువ్వు వెతుక్కో. వెళ్ళు" అంది. దెబ్బమీద దెబ్బ తీస్తే అతడు పారిపోతాడని ఆమె ఆశించింది.

కానీ రామానుజం ఆమె మాటలకు చలించలేదు, "నాక్కావలసింది నీ పవిత్రతకాదు. నువ్వు. మన పెళ్ళి జరగడానికి నీ పవిత్రతే అడ్డనుకుంటే ఆ అడ్డు తొలగిస్తాను" అన్నాడు.

సునీత శరీరంలో మళ్ళీ వణుకు ప్రారంభమైంది.

"అర్హత గురించి నువ్వు మాట్లాడితే నాకు చాలాకోపం వస్తుంది. వెనుకటికో అమ్మాయిలాగే నాతో మాట్లాడింది. అది నేనిచ్చిన డబ్బు చాలలేదని బెట్టుచేసి నా అర్హతను చిన్నబుచ్చి నాకంటే ఎక్కువడబ్బిచ్చిన మరొకడితో గడపబోయింది. నేను వాణ్ని చావదన్ని దాన్ని దగ్గిరగా తీసుకున్నాను. ఫలిత మేమిటో తెలుసా? పొమ్మొకడిది. సోకొకడిది!" అన్నాడు రామానుజం.

అతడి మాటలు వినగానే ఆతడెంత ప్రమాదకరమైన మనిషో అర్థమయింది. అతడినెలా వదిలించుకోవాలో ఆమె కర్థంకావడంలేదు.

ఆమె అతణ్ణి పొమ్మంటుంది. అతడామెను ప్రాధేయపడుతున్నాడు. అలా ఓగంటసేపు వాగ్వివాదం జరిగేక—

అతడామెను బలవంతంగా దగ్గిరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

అంతే!

సునీత కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

రామానుజం ఆ కన్నీళ్లు చూసి చలించిపోయి చటుక్కున ఆమెను వొదిలిపెట్టాడు.

"నన్నెందుకిలా వేధిస్తున్నావు?" అందామె ఏడుస్తూ.

రామానుజం నిట్టూర్చి, "లాభంలేదు. నా ప్రేమ నన్ను కట్టేస్తోంది. నేను నిన్నేమీ చేయలేను" అన్నాడు.

సునీత అతడివంక విచిత్రంగా చూసింది. అతడు తన్ను నిజంగా ప్రేమిస్తున్నాడన్న అనుమానం ఆమెలో ప్రవేశించింది.

అప్పుడా పరిస్థితిలో అతడు తన్నేంచేసినా అడుకోగల వాళ్ళు లేరు. తను గొడవచేస్తే అల్లరిపడేది తనే కానీ అతడికేం నష్టంలేదు.

ఏమిటి చేయడం?

అతణ్ణి తనూ ప్రేమించాలా?

రామానుజం అక్కణ్ణించి కదల్లేదు. ఆమె నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాడు.

అలా రాత్రి పదిగంటలయింది.

ఆమె అతడికి అవుననీ కాదనీ చెప్పడంలేదు.

అతడి సహనానికి అంతం ఉన్నట్లూలేదు.

రాత్రి పదిగంటలకెవరో ఆ యింటి తలుపు తట్టారు. సునీత కంగారుపడితే అతడు నెమ్మదిగా, "ఎవరో నాకు తెలుసు. నేనే వెళ్ళి తలుపు తీస్తాను" అంటూ తనే వెళ్ళి తలుపుతీసి మరో యువకుణ్ణి వెంటబెట్టుకుని వచ్చాడు.

సునీతకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

"ఇతడు నా స్నేహితుడు. నీకూ నాకూ పెళ్ళి కావ డానికి అడ్డువస్తున్నది నీ పవిత్రత. ఆ అడ్డు నేను తొల గించాలనుకున్నాను. సాధ్యపడలేదు. నా ప్రేమ నన్ను కట్టేస్తుందని నాకు అనుమానముంది. అందుకే వీణ్ణి సమ యంలో రమ్మన్నాను. నీ పవిత్రను వీడు తొలగిస్తాడు. అప్పుడు నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు రామానుజం గంభీరంగా.

సునీత ఆ యువకుణ్ణి చూసింది.

అతడి చూపుల్లో ఆకలి! అతడు తనవంక ఆహారాన్ని చూసినట్లు చూస్తున్నాడు.

సునీతకు అరవాలంటే గొంతు పెగలలేదు.

ఆ యువకుడామెను సమీపించి దగ్గరగా తీసుకున్నాడు.

సునీత పెనగులాడింది. అరవబోతే అతడామె గొంతు నొక్కాడు.

అప్పుడు సునీత రామానుజం వంక జాలిగా చూసింది.

ఆమె ఒక్క చూపు చాలు....రామానుజం తన స్నేహి తుడి బారినుంచి ఆమెను విడిపించాడు.

"ఇదేమిటి, నువ్వు రమ్మంటేనేగా వచ్చాను...ఇప్పు డిలా...." అంటూ ఉక్రోషపడ్డాడు రామానుజం స్నేహితుడు.

"ఆమెను నేను ప్రేమిస్తున్నాను. ఆమె పవిత్రను ప్రేమిస్తోంది. నా ప్రేమ నామె గౌరవించకపోయినా నే నామె ప్రేమను గౌరవిస్తాను. పద, పోదాం!" అన్నాడు రామానుజం.

* * *

ఆ తర్వాత వారం రోజుల్లోనే రామానుజం ఓ పతితను వివాహం చేసుకుని ఆ విషయం సునీత కుత్తరం ద్వారా తెలియబర్చి, "నా అర్హతకు తగ్గ యువతిని పెళ్ళి చేసుకోమన్న ప్రియురాలి మాటలను అక్షరాలా పాటించాను" అని వ్రాశాడు.

అప్పుడు సునీత కూడా ఇంటి కుత్తరం వ్రాసింది, రాజారావుతో వివాహానికి తను సుముఖంగానే ఉన్నానని!

ఆమెలోని మార్పుకు తలిదండ్రులేకాదు, చదువరులు కూడా ఆశ్చర్యపోవచ్చు? కానీ....

తొలిచూపు ప్రేమబలంతోనే ఓ పశుతుల్యుణ్ణి అసహాయస్థితిలో ఉండి కూడా శాసించగలనని గ్రహించేక సునీతకు మగాడంటే భయం పోయింది. కంటిక్కనిపించేదంతా నిజం కాదదీ, ఎంతటి బలవంతుణ్ణి, దుర్మార్గుణ్ణో కూడా స్త్రీ తన ప్రేమతో శాసించగలదన్న నిజన్నామె యిప్పుడు గ్రహించిందామె. □

అడ్రసు-?



మినీ సీరియల్

వి.యస్.రావ్

బిజినెస్ బాబు

(గత సంచిక తరువాయి)

"గురూ...."

సిగరెట్ ముట్టించిన పెంపో తటాలున కుర్చీలోంచి లేచాడు. టేబుల్ ముందునుంచి దూరంగా కదిలి మెల్లిగా అడుగులేశాడు. ఆగి, ఎదురుగావున్న తెల్లటి గోడని

చూస్తూ వుండిపోయాడు.

అతని తలమీద వేళ్ళాడుతూ, మెల్లిగా చెదురుతున్న సిగరెట్ పొగని చూస్తూ ఇన్ స్పెక్టర్ పృథ్వీరావ్ కుర్చీలో వెనక్కివాలాడు.

డిటెక్టివ్ టెంపో తటాలున వెనక్కి తిరిగాడు. పృథ్వీ రావ్ మొహంలోకి సూటిగా చూశాడు.

"పృథ్వీరావ్ ..."

"యస్?"

"అరెస్ట్ చేసిన ఒక వ్యక్తిని సెల్ లో వేశావ్. సెల్ తాళంచెవిని భద్రంగా నీ కస్టడీలోనే వుంచుకున్నావ్. మరుసటిరోజు, తెల్లారేసరికి ఆ ఖైదీ అయువుపట్టులో అయిన గాయంతో, లాకప్ లో మరణించాడు. అప్పుడు నీ కింద పనిచేసే వాళ్ళంతా ఏమనుకుంటారు?"

"ఏమనుకుంటారు? ఇన్ స్పెక్టర్ పృథ్వీరావ్ గారి దెబ్బకి రాత్రెప్పుడో అతను హరీ అన్నాడనుకుంటారు!" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

టెంపో నవ్వలేదు. "ఆ ఖైదీమీద వ్యక్తిగతంగా నీకు పగ వుందని తెలిశాక నీ శిష్యులు ఏమనుకుంటారు?"

"పాత పగ కారణంగా, అవకాశం చూసుకుని నేను అతన్ని అంతం చేశాననుకుంటారు!"

"ఎప్పుడో, ఎందుకో తను కాజేసివుంచుకున్న తాళం చెవితో నీ శిష్యుల్లో ఒకడు సెల్ తాళం తెరిచి ఖైదీని పైకి పంపేశాడు. అలా జరిగినప్పుడు, అదే జరిగినప్పుడు, పరిస్థితి ఎలా వుంటుంది?" టెంపో ప్రశ్నించాడు.

"దారుణంగా!" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"ఏదో కారణంతో, హంతకుడు కృత్తివాసరావు గుండె లోకి కత్తి దిగేశాడు. తన భార్యకు మాజీ ప్రియుడైన

వ్యక్తిని, ఇంజినీర్ రాజే చంపేశాడని అందరూ అనుకుంటారని అతను సహజంగా ఊహించాడనుకుందాం. అప్పుడు, ఏమిటవుతుంది?"

జవాబుగా పృథ్వీరావ్ నిట్టూర్చాడు.

"అతను ఊహించినట్టుగానే, అందరూ అలాగే ఊహించాలని అతను కోరుకున్నట్టుగానే మనం గుడ్డిగా, సహజంగా ఊహిస్తాం...."

"పాయింటే...."

"పృథ్వీరావ్, అలా ఊహించడంవరకూ, తెలివిగా వ్యవహరించిన హంతకుడు, తరువాత పొరపాటు చేశాడు!" టెంపో గంభీరంగా అన్నాడు.

పృథ్వీరావ్ అయోమయంగా చూశాడు. "గురూ.... ఇందాకటి నీ తర్కాన్నిబట్టీ వాడెవడో - హంతకుడు - చాలా తెలివిగా వ్యవహరించాడనుకున్నా. పొరపాటు...."

డిటెక్టివ్ టెంపో చకచకా నడిచి పృథ్వీరావ్ ఎదురుగా కుర్చీలో కూచున్నాడు. ఆరిపోయిన సిగరెట్‌ని యాష్ ట్రేలో పడేసి, కొత్తది వెలిగించాడు.

"పృథ్వీరావ్, అరటిపండు వొలిచి, అరచేతిలో పెడతాను; నువ్వూ, నేను - అందరూ అనుకుంటున్నట్టు గానే, ఇంజినీర్ రాజు తన భార్య మాజీ ప్రియుణ్ని చంపేశాడనుకుందాం. మామూలుగా ఆఫీసు మూసేశాక, తాళాలువేసి బంట్రోతు తాళంచెవుల్ని అతని ఇంట్లో అప్ప గిస్తాడు. అవునా?"

"ఆ."

"అంటే, ఆదివారం రాత్రి అదే తాళంచెవితో ఆఫీసు తెరిచి, అనుకున్న ఘనకార్యం అతను సాగించివుండొచ్చు. ఇంట్లో దాచిన స్పేర్‌కీని ఎందుకు ఉపయోగించాడు?"

ఔంపో ప్రశ్నించాడు.

"అదే అర్థం కావడంలేదు...."

"స్పేర్‌కీని ఉపయోగించాడనే అనుకున్నా కూడా, పని ముగించాక, ఆ తాళంచెవిని కృత్తివాసరావు టేబుల్ మీద అతను ఎందుకు వదిలేశాడు?"

"మరెవరో స్పేర్‌కీని కాజేసి, ఆఫీసుని హత్యాస్థలంగా వాడుకున్నారన్న అనుమానం కలిగించడానికా?" పృథ్వీ రావ్ ప్రశ్నించాడు.

ఔంపో చిరునవ్వు నవ్వాడు. "మన హంతకుడు చేసిన పొరపాటు అదే!"

"ఏది? స్పేర్‌కీ ఉపయోగించడమా? అక్కడే వదిలేయడమా?"

"వదిలేయడం. స్పేర్‌కీ మనకి అవుపించనంతకాలం, తన అధీనంలోవున్న, వాడుతున్న తాళంచెవిని ఉపయోగించి, బలమైన మోటివ్ కలిగిన ఇంజనీర్ రాజే హత్య చేశాడని మనం అనుకుంటూ వుండే అవకాశం వుండేది!" ఔంపో నవ్వుతూ అన్నాడు.

మెరుస్తున్న ఔంపో కళ్ళల్లోకి పృథ్వీరావ్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "ఇంతకి అసలువ్యక్తి ఎవరు?"

"హంతకుడు!" ఔంపో నవ్వాడు.

"ఎవరు?"

"ఇంజనీర్ రాజు దగ్గర స్పేర్‌కీ వుందనీ, దాన్ని అతను రజనికి ఇచ్చాడనీ తెలిసిన వ్యక్తి. కృత్తివాసరావు 'రాజు భార్యని ప్రేమించిన వ్యక్తి' అని తెలిసిన వ్యక్తి!"

"ఎవరు?" పృథ్వీరావ్ నిట్టూర్చి, ప్రశ్నించాడు.

"నువ్వు. నేను. ఇంకా నీకు తెలిసిన పేర్లన్నీ చెప్పుకో!"

"టెంపో...." పృథ్వీరావ్ నీరసంగా అన్నాడు.

పకపక నవ్వుతూ టెంపో పైకిలేచాడు. "పృథ్వీరావ్, బుర్ర చంద్రనిప్పుల్తో నిండిన కుంపటిలా వేడెక్కి పోయింది. వెళ్తాను. రెండు గంటలపాటు తలని షవర్ కింద పెట్టేస్తాను!"

పృథ్వీరావ్ మెల్లిగా లేచాడు. "గురూ....ఏం చేయమంటావు?"

టెంపో అతన్ని చిరునవ్వుతో చూశాడు. "ఇంటికెళ్ళు. శుభ్రంగా భోంచేయి. అర్ధాంగి చెప్పే కబుర్లు వింటూ, ఆదమరచి నిద్రపో!"

9

తలుపు తెరిచిన టెంపోకి టెలిఫోన్ మోత స్వాగతం పలికింది. షవర్ కింద నిలబడాలన్న కోరికని నిగ్రహించు కుంటూ టెంపో టేబుల్‌కి అనుకుని నిలబడి ప్రశ్నార్థకంగా టెలిఫోన్ని చూస్తూ వుండిపోయాడు. బాత్‌రూమ్‌కి వెళ్ళాలనుకుంటున్న తనని ఈ టెలిఫోన్‌కాల్ బజార్లోకి తరుముతుందా?

ఆలోచిస్తున్న టెంపో చెయ్యి మొండిగా మోగుతున్న టెలిఫోన్ రిసీవర్ని అందుకుంది.

"యస్?" అన్నాడతను.

"డిటెక్టివ్ టెంపోగారా?"

సన్నగా పలికిన స్త్రీ కంఠాన్ని పోల్చుకోడానికి ప్రయత్నిస్తూ టెంపో అన్నాడు: "యస్."

"టెంపోగారూ, మీరొక్కరేవున్నారా?" సన్నటి కంఠంతో ఆత్రుత ధ్వనించింది.

"చాలాకాలం క్రిందటే నేను ఏకాకి అయిపోయాను!" టెంపో నవ్వాడు.

అవతలి కంఠం నవ్వలేదు. "నా అర్థం అదికాదు. ఫోన్ దగ్గర మీరొక్కరే...."

"ఒకక్షణ! మీరెవరు?" టెంపో అడ్డు తగిలాడు.

"మిమ్మల్ని చూశాను. మీరు కృత్తివాసరావు మర్డర్ కేసు పరిశోధిస్తున్నారు....అవునా?"

"అవును. మీరెవరు?"

"ఇవాళ పొద్దుటే హత్య చేయబడిన కృత్తివాసరావు ఫోటోని పేపర్లో చూశాను. నిన్న రాత్రి మిమ్మల్ని చూశాను. అంచేత మీకో విషయం చెప్పాలనుకున్నాను." ఆమె ఆగింది.

టెంపో ఆశ్చర్యంతో క్షణకాలం మౌనంగా వుండిపోయాడు. రెండుసార్లు 'మీరెవరు?' అని తను అడిగిన ప్రశ్నని ఆమె పూర్తిగా నిర్లక్ష్యం చేసింది! ఎందుకు?

"ఏమిటో చెప్పండి." టెంపో మెల్లిగా అన్నాడు.

"ఇవాళ ఉదయం పేపర్లో ఫోటో చూడగానే నాకో విషయం గుర్తొచ్చింది. అది మీకు తెలిస్తే మంచిదనిపించి...."

"ఏమిటది?" టెంపో అడ్డుతగిలాడు.

"ఆ ఫోటోలోని వ్యక్తిని....కృత్తివాసరావుని శుక్రవారం రాత్రి పది దాటాక, నేను చూశాను...."

"ఎక్కడ?" టెంపో కుతూహలంగా ప్రశ్నించాడు.

"రజని ఇంటిముందు...."

టెంపో అదిరిపడ్డాడు. "మీ రెక్కడుంటున్నారు?"

"మిస్టర్ టెంపో, నా గురించి ఏమీ అడక్కండి. నేను....చెప్పను....కేసుల్లో ఇరుక్కుని పోలీసువాళ్ళ - చేతుల్లో బంతిలా అటూ ఇటూ ఎగురుతూ వుండడం నా కిష్టంలేదు. నా గురించి మీరు తెలుసుకునే ప్రయత్నం

చేస్తే ఫోను పెట్టేస్తాను।'' ఆమె చిన్నగా నవ్వింది.

టెంపో సాలోచనగా పెదవి కొరుక్కున్నాడు. "ఆల్ రైట్। మీరెవరో, ఎక్కడున్నారో, ఎందుకున్నారో నాకు అనవసరం। కృత్తివాసరావు మీకు తెలుసా?''

"తెలీదు. అతనిపేరూ, ఫోటో పేపర్లో ఉన్నాయిగా?''

"శుక్రవారం రాత్రి రజని ఇంటిముందు అతను ఏం చేస్తూంటే మీరు చూశారు?'' టెంపో అడిగాడు.

"కాంపౌండు లోపలికి వెళ్ళి. వీధివేపు తిరిగి అతను గేటు మూశాడు. అప్పుడు వీధిలైటు కాంతిలో చూశాను. అందుకే ఫోటో చూడగానే పోల్చుకోగలిగాను....''

"తరువాత అతనేం చేశాడు?''

"అప్పటికే ఆమె తలుపు తెరిచింది. అతను చకచకా లోపలికి వెళ్ళిపోయాడు. వెంటనే తలుపు మూసుకుంది.''

"ఆమె....ఆమె ఎవరు?''

"ఇంకెవరుంటారు? ఆమే; రజని।'' ఆమె నవ్వుతూ అంది.

"తరవాత?''

"తరవాత ఏం జరిగిందో నాకు తెలీదు. తెలుసుకోవాలనీ అనిపించలేదు. రోజూ మరో వ్యక్తి వచ్చేవాడు. మొన్న కొత్తవ్యక్తి వచ్చాడు. కొత్త రాజపోషకుడిని పట్టిందేమో అనుకున్నా।''

"ఐసీ....'' టెంపో సాలోచనగా అన్నాడు. "అయితే మీరు రజని ఎదురింట్లో వున్నారన్నమాట....''

ఆశ్చర్యంతో ఆమె ఊపిరి బిగబట్టడం టెంపోకి స్పష్టంగా వినిపించింది. మరుక్షణం ఆమె కంఠం ఆ ఆశ్చర్యాన్ని ఇంకా స్పష్టంగా టెంపో చెవిలోకి చేరవేసింది. "టెంపోగారూ....మీకెలా తెలుసు?''

"ఆమె ఇంటికి వెనకవైపు ఇంట్లో వుంటే మీరు చూసిందంతా చూసివుండలేరుగా!" టెంపో నవ్వుతూ అన్నాడు.

ఆమె నిట్టూర్పు అతని చెవిలో బుసకొట్టింది. "మిస్టర్ టెంపో, ఈ ఇన్ఫర్మేషన్ మీకు ఉపయోగపడుతుందేమో అని చెప్పాను. నన్ను ఇవతలికి లాగకండి! ప్లీస్...."

"మీరిచ్చిన ఇన్ఫర్మేషన్ నాకు ఉపయోగపడుతుంది. ధైర్యంగా చొరవగా ప్రవర్తించిన మీ సివిక్ సెన్స్ని మెచ్చుకుంటున్నాను...."

"నేను మీకు ఫోన్ చేసిన సంగతి బైటికి పొక్కితే, ఇంటా బయటా నేను ఇబ్బందుల్లో పడతాను. నాలోని సివిక్ సెన్స్ చచ్చిపోతుంది! మిస్టర్ టెంపో....మీరు...."

"మీరెవరో నాకు ఫోన్ చేయలేదుగా?"

"నిజంగా!" ఆమె కంఠంలో రిలీఫ్ టెంపోకి నవ్వు తెప్పించింది.

"మీమీదా, నామీదా వొట్టు!"

"ఓహ్....థాంక్యూ! ఇది మీకు ఉపయోగపడుతుందా!"

"తరువాత చెప్తాను. మీపేరు!" టెంపో మెల్లిగా అన్నాడు.

జవాబుగా అతని చెవిలో 'క్లిక్' అంది....

*   *   *

"కమాన్ ఇన్! నూరేళ్ళు! అనుకుంటుంటే వచ్చేశావ్!" పృథ్వీరావ్ ఉషారుగా అన్నాడు.

"ఎప్పట్నుంచీ అనుకుంటున్నావ్?" టెంపో నవ్వుతూ అన్నాడు.

"తెల్లారగట్ల నుంచీ!"

"తెల్లారగట్లనుంచీ అనుకుంటున్నావ్. నేను రాకపోతే మళ్ళీ తెల్లారేదాకా అనుకుంటూనే వుంటావ్!

అంటే, నేను ఎప్పుడు నీముందు ప్రత్యక్షమైనా నాకు నూరేళ్ళ అన్నమాట!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"నిస్సందేహంగా!"

టెంపో నవ్వుతూ కుర్చీలో చతికిలబడ్డాడు.

"అలసిపోయినట్టున్నావ్?" ప్రథ్వీరావ్ టెంపో నుదురుమీది చెమటను చూస్తూ అన్నాడు.

"పూర్తిగా. రజని ఇంటికెళ్ళి మాట్లాడాను; అలసిపోయాను!"

ప్వథ్వీరావ్ కుర్చీలో ముందుకి జరిగి, టేబుల్‌మీద చేతుల్ని ఆనుకున్నాడు. "ఏమిటి కథ?"

"పృథ్వీరావ్, కథ చాలా సాగింది...."

"ఊకొట్టడానికి తయారుగా వున్నా!"

"రెండుకప్పుల టీతాగి, మూడో సిగరెట్టు కాలుస్తూ చెప్తాను!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ బెల్‌నొక్కాడు....

టీతాగి, సిగరెట్ ముట్టించిన టెంపోవైపు పృథ్వీరావ్ ఆత్రుతగా చూశాడు.

"శుక్రవారం రాత్రి పదిగంటల ప్రాంతంలో కృత్తివాసరావు రజని ఇంటికెళ్ళాడు...."

"వాట్!" పృథ్వీరావ్ అరిచాడు. "రజని చెప్పిందా?"

"రజని....అతను తనింటికి రానేరాడంది. ఇంకా చెప్పాలంటే తనకి తెలీదంది. ఇంకా ఇంకా చెప్పాలంటే తను గురువారం, శుక్రవారం ఛీఫ్ ఇంజనీర్‌తో కలిసి కాళహస్తి క్యాంప్‌లో వున్నానంది...."

"వాట్? అయితే, నీ కెట్లా తెలుసు?" పృథ్వీరావ్ అడ్డు తగిలాడు.

"అది మనకి అనవసరం. రజని...."

"గురూ, మరో ఆడదాని మొగుణ్ణి తన మంచానికి కట్టేసుకున్న రజనిలాంటి ఆడది అనుమానించకుండా అబద్ధమాడుతుంది! లెట్స్ నాట్ బిలీవ్ హర్!"

టెంపో బరువుగా నిట్టూర్చాడు, "రజని నిజమే చెప్తోంది. ఛీఫ్ ఇంజనీర్ ఆమెని తన కూడా క్యాంప్‌కి తీసికెళ్ళినట్టు చెప్పాడు."

"ఇద్దరూ కూడబలుక్కుంటే అలా చెప్పడం కష్టమేం కాదు!" పృధ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

టెంపో అతన్ని సూటిగా చూశాడు. "ఆ అనుమానం నాకు రాలేదని నువ్వెందుకనుకుంటున్నావ్ పృధ్వీరావ్?"

"యూ మీన్...."

"కాళహస్తికి ఇద్దరూ వెళ్ళారు. ఆ రెండ్రోజులూ అక్కడే బంగళాలో వున్నారు. ఇన్‌స్పెక్టర్ లింగయ్యని కాంటాక్టుచేసి అంతా కనుక్కున్నా."

"ఐసీ...." పృధ్వీరావ్ సాలోచనగా అన్నాడు. "అయితే, కృత్తివాసరావు రజని ఇంటికి వెళ్ళినట్టేగా?"

"అదే ఆలోచిస్తున్నా. రజని లేకపోతే కృత్తివాసరావు ఆమె ఇంటికి ఎందుకు వెళ్ళివుండకూడదు? అని ఆలోచిస్తున్నా ..."

"గురూ! అసలు అతను వెళ్ళాడని నీకెలా తెలిసింది?" పృధ్వీరావ్ ప్రశ్నించాడు.

"అది ముఖ్యం కాదు...."

"అదే ముఖ్యం అని నా కనిపిస్తోంది!" పృధ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"ఎవరో, ఏదో కారణంతో ఆరాత్రి అతను అక్కడి కెళ్ళినట్టు నీకు చెప్పారనిపిస్తోంది!" పృధ్వీరావ్ మళ్ళీ తనే అన్నాడు.

"ఏమిటా కారణం?" టెంపో సిగరెట్ పీకని యాష్ ట్రేలో పడేస్తూ అడిగాడు. అపరిచితస్త్రీ అన్న మాటలు అతని చెవుల్లో సన్నగా ప్రతిధ్వనిస్తున్నాయి.

"రజని యింటికెళ్ళి తాళాన్ని కాజేసిన వ్యక్తి, తన మీదికి అనుమానం రాకుండా వుండటానికీ, పరిశోధనలో తను బయటపడకుండా వుంటానికీ, అలా చెప్పి వుండవచ్చు. ఆఫీసు తాళం తెరవడం కోసం కృత్తివాసరావే తాళంచెవిని దొంగిలించాడని మనల్ని నమ్మించడానికి అలా చెప్పివుండొచ్చు."

టెంపో అతన్ని చిరునవ్వుతో చూస్తూ పైకి లేచాడు. సిగరెట్ వెలిగించి పచార్లు ప్రారంభించాడు.

"టెంపో...."

టెంపో ఆగి, ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇంతకీ ఈ పుకారు నీ చెవిని వేసిందెవరు?" పృథీరావ్ ప్రశ్నించాడు.

టెంపో అర్థంకానట్టు కళ్ళు చిట్లించాడు. ఆలోచనల గ్రాఫులావున్న అతని నుదుర్ని చూస్తూ ఇన్‌స్పెక్టర్ పృథీరావ్ మళ్ళీ అన్నాడు:

"రజని ఇల్లు ... కృత్తివాసరావు ....నీకెలా తెలిసింది?"

"వేకువజాములో కలగన్నాను!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ నిట్టూర్చాడు. "ఇన్‌ఫార్మర్‌ని దాచిపెడుతున్నావ్! యూ ఆర్ ప్రొటెక్టింగ్ ది ఇన్‌ఫార్మర్!"

"అఫ్‌కోర్స్!"

"ఎవర్నుంచీ?"

"పోలీసుల్నుంచీ!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"టెంపో...."

"పృథ్వీరావ్, నీ సంగతే తీసుకో. విషయం చెప్పినప్పట్నుంచీ 'ఎవరు చెప్పారెవరు చెప్పా'రనడం తప్పా మరో ముక్క పలకడంలేదు. ప్రారంభంలోనే సోర్స్‌ని అనుమానించావ్! ఏదో సమాచారం అందించిన వ్యక్తుల్ని కేసుకి ప్రత్యక్షంగా ముడిపెట్టి నంజుకు తినేస్తారు గనకే డీసెంట్‌గా వుండే వ్యక్తులు కళ్ళారా చూసిన నేరాన్ని లోపలే సమాధి చేసేస్తారు!"

"టెంపో! ఇది...."

"ఇది 'సోషియల్ అపతీ' పెరగడానికి ఒక కారణం!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ పెదాలు బిగబట్టి అదోలా చూశాడు. టెంపో నవ్వుతూ మళ్ళీ పచార్లు ప్రారంభించాడు. పృథ్వీ టేబుల్ అంచుమీద మృదంగం వాయించడం ప్రారంభించాడు.

మధ్యలో, పచార్లు ఆపేసి టెంపో గిరుక్కున పృథ్వీరావ్‌వైపు తిరిగి తీక్షణంగా చూశాడు. పృథ్వీరావ్ మృదంగానికి ముక్తాయింపు ఇచ్చాడు. అప్రయత్నంగా.

"పృథ్వీరావ్...." టెంపో కంఠం గంభీరంగా వుంది. అప్రయత్నంగా పృథ్వీరావ్ చెవులు రిక్కించాడు.

"నాకు తెలిసినంతవరకూ అతను గేటు ముందున్నప్పుడే ఆమె వరండాలోకి వెళ్ళిపోయి తలుపుతెరిచి లోపల దూరింది. తరవాత అతను లోపలికెళ్ళాడు. తలుపు మూసుకుంది. వెల్తుర్లోవున్న అతను బాగా కనిపించాడు. చీకట్లో, వరండాలో వున్న ఆమె బాగా కనిపించ లేదు.... అంచేత...."

"ఎవరికి?" పృథ్వీరావ్ అసంకల్పితంగా అడ్డుతగి

లాడు.

టెంపో నవ్వుతూ చూశాడు. "నాకే!"

పృథ్వీరావ్ నిస్సహాయంగా నిట్టూర్చాడు. "ఆల్ రైట్...."

"ఆల్ ఈజ్ నాట్ రైట్, పృథ్వీరావ్. సమ్‌థింగ్ ఈజ్ రాంగ్!" టెంపో గంభీరంగా అన్నాడు.

పృథ్వీరావ్ గుబురు కనుబొమలు గమ్మత్తుగా కదిలి, కొత్త ఆకారంతో ప్రశ్నార్థకాన్ని తయారుచేశాయి.

"అంటే....చీకట్లో శుభ్రంగా కనిపించని 'ఆమె' 'ఆమె' కాకపోవచ్చుగా?" టెంపో ప్రశ్నించాడు.

"ఆమె.... ఎవరు గురూ?"

"ఆమె రజని కాకపోవచ్చుగా?"

"అయితే....అంటే...."

"'ఆమె ఎవరు?' అని ప్రశ్నించు పృథ్వీరావ్!" టెంపో తీక్షణంగా అన్నాడు.

"టెంపో, రజని ఆరోజు ఊళ్ళోలేదు. కృత్తివాస రావుతో బాటు రజని ఇంట్లోకి వెళ్ళిన 'ఆమె' ఎవరు?" పృథ్వీరావ్ ప్రశ్నించాడు.

"తెలీదు!"

పృథ్వీరావ్ బరువుగా నిట్టూరుస్తూ కుర్చీ వెనక్కి వాలి పోయాడు.

"టెంపో, తల రంగులరాట్నంలా తిరుగుతోంది. ఇంకాస్సేపట్లో ఆ రంగుల రాట్నాన్ని నా కడుపులోకి దించేలా వున్నావ్! కాసేపు అంతా మరిచిపో. కూచో. వేడివేడి కాఫీ తెప్పిస్తాను!"

టెంపో మౌనంగా సిగరెట్ వెలిగించాడు. వెనక్కి తిరిగి కిటికీవేపు నడిచాడు. సిగరెట్‌ని పెదాలమధ్య ఇరి

కించి, రెండు చేతుల్తో కిటికీ కమ్ముల్ని బిగించి పట్టు కున్నాడు. అతని వేళ్ళు బిగుసుకున్నాయి. మెదడులో ఏర్పడి, బిగుసుకుపోతున్న ఏదో ముడిని వొదులుచేసి విప్పే ప్రయత్నంచేస్తూ టెంపో కళ్ళుమూసుకున్నాడు. పృథ్వీరావ్ మళ్ళీ ప్రారంభించిన మృదంగం అతని చెవుల్ని తాకడంలేదు.

నిమిషం తరవాత టెంపో కిటికీ కమ్ముల్ని వదిలేసి గిరుక్కున వెనక్కి తిరిగాడు. పృథ్వీరావ్‌ని తదేకంగా చూశాడు.

"పృథ్వీ, ఎవరో స్త్రీ కృత్తివాసరావుతో రజని ఇంటికి వెళ్ళిందనుకుందాం ..."

"అభ్యంతరం లేదు!"

"అంటే అతనితో పరిచయం వున్న స్త్రీ, రజని ఇల్లు తెలిసిన స్త్రీ అతన్ని అక్కడికి తీసుకెళ్ళింది."

"అతనే ఆమెను తీసికెళ్ళి వుండొచ్చుగా?" పృథ్వీరావ్ అడ్డుతగిలాడు.

"ఆమె ముందు వెళ్ళింది. తాళం తెరిచింది. అతను ఆటో వెనక వెళ్ళాడు. అతను తీసికెళ్ళి వుంటే అతనే ముందు వెళ్ళివుండే వాడు; చొరవగా...."

"అంటే...."

"అంటే సహజంగా తీసుకెళ్ళే వ్యక్తి, తీసుకెళ్ళబడే వ్యక్తిని లీడ్ చేస్తాడు .. చేస్తుంది!"

"ఓకే. ఆమే అతన్ని తీసుకెళ్ళింది. తరవాత?" పృథ్వీ రావ్ కళ్ళు చిట్లిస్తూ అన్నాడు.

"తరువాత....ఇప్పుడు ఆమె ఎవరో మనం కని పెట్టాలి!" టెంపో నవ్వుతూ అన్నాడు. "పృథ్వీరావ్, ఇంజినీరు ఆఫీసులో ఆడవాళ్ళు ఇంకా ఎవరున్నారు?"

"నందనవనంలో కల్పవృక్షంలాగా రజని ఒక్కత్తే!" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

టెంపో అతనివైపు అడుగులు వేస్తూ ప్రశ్నించాడు. "అయితే, అంత రాత్రివేళ అతన్ని మరో ఇంటికి చొరవగా ధైర్యంగా తీసుకెళ్ళగలిగే స్త్రీ ఎవరు?"

"ఎవరు?" పృథ్వీరావ్ ఎదురుప్రశ్నించాడు. "అతను ఒంటరి పక్షి!"

డిటెక్టివ్ టెంపో తటాలున ఆగాడు. ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్‌ని తదేకంగా చూశాడు. పాదాల్ని ఎడంగా జరిపాడు. పెదాలమధ్య నుంచి సిగరెట్‌ని ఇవతలికి తీశాడు. హఠాత్తుగా అతని కళ్ళు వజ్రాల్లా మెరిశాయి.

"కృత్తివాసరావుతో వెళ్ళగలిగే స్త్రీ వుంది. అతను అంత ఒంటరి పక్షి కాదు!" టెంపో కంఠంలో ఉద్రేకం ఖంగుతుంది.

"ఎవరు?"

"సుధ!"

పృథ్వీరావ్ ఉలిక్కిపడి ఎగిరి నించున్నాడు. "గుడ్ గాడ్!"

"పృథ్వీరావ్, ఇంజనీర్ భార్య సుధ, ఒకప్పుడు తను ప్రేమించిన కృత్తివాసరావుని తన భర్త 'ప్రేమ పంజరానికి' తీసుకెళ్ళింది!" టెంపో గంభీరంగా అన్నాడు. "చూసిన కళ్ళు సుధని రజనిగా అనుకున్నాయి. రాత్రి సమయం, దాదాపు ఒకే ఎత్తులో వున్న ఆకారాలూ, వెంట మరో మగాడూ—ఇవన్నీ ఆ కళ్ళకి ఆమెని రజనిగా చూపించాయి."

ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ ఆదరా బాదరా టెంపో ముందుకి నడిచాడు. నిలబడి అతన్ని ఉద్రేకంతో చూశాడు

"ఎందుకు?"

"ఎందుకు? ఎందుకు?" టెంపో గొణుక్కున్నట్లు అన్నాడు.

"మంచం కోసమా?" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

టెంపో నవ్వలేదు. "మంచం సుధ ఇంట్లో వుంది. మంచం కృత్తివాసరావు అద్దెకొంపలో వుంది. ఇంకా మంచం చాలా లాడ్జిల్లో వుంది! మంచంకోసం సుధ అంత రిస్క్ తీసుకోవాల్సిన అవసరం లేదు...."

"మరెందుకు తీసుకుంటుంది?"

"ఆ ప్రశ్నకి తగిన సమాధానం దొరికితే, మనల్ని చిత్రవధ చేస్తున్న రహస్యాన్ని తెరిచే కీ దొరికినట్టే ..."

పృథ్వీరావ్ బుర్ర ఆడిస్తూ మెల్లిగా వెనక్కి తిరిగాడు. మరుక్షణం టెంపో కంఠం అతన్ని కొరడాలా తాకింది:

"పృథ్వీరావ్, వెనక్కి తిరుగు!"

పృథ్వీరావ్ వెనక్కి తిరిగాడు. టెంపో అతని కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు.

"నోరుజారి ఒకమాట అన్నాను: రహస్యాన్ని తెరిచే కీ ... పృథ్వీరావ్, సుధ 'కీ' కోసం కృత్తివాసరావుని ఆ ఇంటికి తీసుకెళ్ళింది!" టెంపో కంఠం విజయ ఢంకాలా మారుమ్రోగింది.

"గుడ్ హెవెన్స్! పృథ్వీరావ్ ఉద్రేకంతో అరిచాడు. అయితే క్షణంలో అతని మొహాన్ని అనుమానం తెర కప్పేసింది.

"టెంపో ...ఏ తాళంచెవి?"

"ఛీఫ్ ఇంజినీర్ చాలా నెలల్రకితం రజనికి ఇచ్చిన ఆఫీసు తాళంచెవి!"

"ఆ తాళంచెవి రజని ఇంట్లో వున్నట్టు సుధకి ఎలా

తెలుసు?" పృథ్వీరావ్ సందేహిస్తూ అన్నాడు.

"ఆమెకి ఎలా తెలుసో నాకు తెలీదు ..."

"ఆల్‌రైట్! ఆ తాళంచెవికోసం ఆమె రజని ఇంటికి వెళ్ళాలంటే, రజని ఇంటి తాళంచెవి ఆమె చేతిలో వుండాలి! ఔంపో....ఇందాకటి తర్కమంతా కేవలం మన ఊహాగానమా?" పృథ్వీరావ్ నీరసంగా అన్నాడు.

"రజని ఇంటి తాళంచెవి సుధ దగ్గర లేదని నువ్వు ఎందుకనుకుంటున్నావ్ పృథ్వీరావ్?" ఔంపో పృథ్వీరావ్ సందేహాన్ని నిర్లక్ష్యం చేస్తూ అన్నాడు.

"ఎలా వుంటుంది?"

"పృథ్వీరావ్, నీకు శిరీషతో పెళ్ళయింది. నీ ఆఫీసుకి కొత్తగా, నీ చేతిలోని లాఠీలా చురుకైన అమ్మాయి స్టెనోగా వచ్చింది. నిన్ను తన అందంతో ఖైదుచేసింది. మీ ఇద్దరికోసం నువ్వొక 'ప్రేమపంజరం' అద్దెకి తీసుకున్నావ్. దానికి సహజంగా ఒక తాళం, దానికి ఇంకా సహజంగా రెండు తాళంచెవులూ వుంటాయి. ఒకటి నీ స్టెనో దగ్గరా, రెండోది-సహజంగా నీ దగ్గరా వుంటాయి! అవునా?"

పృథ్వీరావ్ బుర్ర ఆవేశంతో ముందుకీ వెనక్కీ ఊగింది. "చెప్పు."

"నువ్వు నీ స్టెనోని తీసుకుని క్యాంప్ వెళ్ళావు. ప్రేమపంజరం తాళంచెవిని మొలతాడికి కట్టుకెళ్ళకుండా ఇంట్లోనే జాగర్త చేశావు. ఎన్నో నెలలుగా నువ్వాడుతున్న నాటకాన్ని చూస్తున్న శిరీష్‌కి ఆ తాళంచెవి గురించి తెలీకుండా వుంటుందనుకుంటావా?" ఔంపో నవ్వుతూ ప్రశ్నించాడు.

"....అనుకోవడానికి అంతగా వీలులేదు."

"సో, తన భర్త ఇంట్లో వుంచిన రజని ఇంటి తాళాన్ని తీసుకుని సుధ కృత్తివాసరావుని ఆ ఇంటికి తీసుకెళ్ళింది."

"ఎందుకు?"

"ఇందాకే చెప్పుకున్నాం: ఆఫీసు తాళంచెవి తీసుకోడానికి!" జెంపో నవ్వుతూ అన్నాడు.

"అది కాదు; ఆఫీసు తాళంచెవి దేనికి?"

"కృత్తివాసరావుకి ఇవ్వడానికి...."

"ఎందుకు?" పృధ్వీరావ్ ప్రశ్న టపాకాయలా పేలింది.

"ఆఫీసు తెరవడానికి."

"ఎందుకు?" పృధ్వీరావ్ కంఠం బిగ్గరగా ధ్వనించింది.

జెంపో నిట్టూర్చాడు.

"పృధ్వీరావ్. ఈ ప్రశ్నతో నువ్వు నన్ను ఓడించేశావ్...." అంటూ జెంపో మెల్లిగా నడిచి కుర్చీలో కూలబడ్డాడు. పృధ్వీరావ్ అతని ఎదురుగా కూచున్నాడు.

"గురూ....అంతా అగమ్యగోచరంగా వుంది...."

"నీ ప్రశ్నకి సమాధానం దొరికితే మనకి గమ్యం గోచరిస్తుంది!" జెంపో సిగరెట్ వెలిగించి, అన్నాడు. పృధ్వీరావ్ తల పంకించాడు.

"పృధ్వీరావ్, మన ప్రశ్నకి సమాధానం చెప్పగల వ్యక్తుల్లో ఒక్కరే ఉన్నారు...."

"ఎవరు?"

"సుధ...."

"యస్! లెట్స్‌గో?" పృధ్వీరావ్ పయికి లేస్తూ అన్నాడు.

టెంపో పయికి లేవలేదు. రిస్టువాచీ చూసుకుని పృథ్వీరావ్ వయిపు చూపుల్ని తిప్పాడు. "పృథ్వీ, ఇందాకా వేడివేడి రాఫీ ప్రామిస్ చేశావ్. తెప్పించు. తాగేసి నే నొక్కణ్ణీ వెళతాను. పోలీసుల్ని చూస్తే మనుషులు భయపడతారు. సుధని భయపెట్టడం నా కిష్టం లేదు."

పృథ్వీరావ్ బెల్ నొక్కాడు....

10

కాలింగ్ బెల్ నొక్కి డిటెక్టివ్ టెంపో భుజాన్ని గోడకి ఆనించి విశ్రాంతిగా నిలబడ్డాడు. తలుపు వెనుక అడుగులు చప్పుడు చేయలేదు. గొళ్ళెం చప్పుడవలేదు. అయితే తలుపు మెల్లిగా తెరుచుకుంది. టెంపో గోడనుంచి గుమ్మం ముందుకి జరిగి, ప్రశ్నార్థకంగా చూస్తున్న రెండు పెద్ద పెద్ద కళ్ళల్లోకి చిరునవ్వుతో చూశాడు.

ఆమె అప్రయత్నంగా చిరునవ్వు నవ్వింది. "ఆయన లేరు "

టెంపో కొంచెం ముందుకి జరిగాడు. ఆమె కొంచెం వెనక్కి జరిగింది. టెంపో చిన్నగా నవ్వాడు.

"మీ 'ఆయన' ఇందాకా అటువైపు గదిలో కిటికీ ముందు హాయిగా కూచుని డిబొనైర్ పత్రికని ఏకాగ్రతతో చూస్తున్నారు. ఎవర్నుంచో ఆయనకి టెలిఫోన్ కాల్ వచ్చింది. వెంటనే ఆదరాబాదరా జీపులో దూసుకెళ్ళారు."

"మీకు ఎలా తెలుసు?" సుధ ప్రశ్న టెంపోకి అడ్డు తగిలింది.

"ఆ టెలిఫోన్ కాల్‌ని నేనే ఏర్పాటు చేశాను...." టెంపో చిరునవ్వు నవ్వాడు.

సుధ కనుబొమలు నాగుపాము పిల్లల్లా కదిలాయి. ఆమె నుదురుమీద చిన్నగా ముడతపడింది. ఎర్రటి పెద

పులు కదిలాయి.

"మీతో నేను ఒంటరిగా మాట్లాడాలి. ఆ మాటల్ని మీ 'ఆయన' వినడం నా కిష్టం లేదు; మీరూ ఇష్టపడరు" సుధ కళ్ళతో కనుబొమలతో, నుదురుతో అడుగుతున్న ప్రశ్నకి టెంపో నోటితో సమాధానం చెప్పాడు.

"టెంపోగారూ....ఏ విషయం?" సుధ కంఠం చిన్నగా వణికింది.

"విషయాలు వీధిలోంచే చెప్పనా?" టెంపో నవ్వుతూ అన్నాడు.

సుధ అంతవరకూ పట్టుకున్న తలుపుని వదిలేసి, వెనక్కి కదిలింది. టెంపో లోపలికి జరిగాడు. మోచేత్తో తలుపుని బలంగా తోసి. వీపుని తలుపుకి అనించాడు. జేబు లోంచి తీసిన సిగరెట్‌ని పెదాల మధ్య ఇరికించాడు. అతని కళ్ళు హాలు మధ్యకి నడుస్తున్న సుధమీదే కేంద్రీకరించబడ్డాయి.

ఎత్తు తక్కువగా వున్న రాళ్ళమీద ఒద్దికగా, మెల్లిగా ప్రవహిస్తున్న సెలయేరులా దుస్తుల అడుగునుంచీ ఆమె అందం కదులుతోంది. తన నడక, వొంపుల కదలిక ఇతర్ల దృష్టిని ఆకర్షించకూడదన్న సుధ ప్రయత్నం అడుగడుగునా అవుపిస్తోంది. బేలూరు గుడిగోడమీద అమరశిల్పి జక్కన్న ఉలి నిలిపిన అపురూప శిల్పాన్ని చూస్తున్న యాత్రికుడిలా టెంపో ఆమెని చూస్తూ వుండి పోయాడు. సుధ అందం సాధారణమైంది కాదు; హృద యాలకి గిలిగింతలు పెట్టే సౌందర్యం అది.

సోఫాల దగ్గిర ఆగిన సుధ మెల్లిగా గుమ్మం వయిపు తిరిగింది. ఇంకా తలుపుకే అతుక్కున్న టెంపోని ఆశ్చ ర్యంగా చూసింది. కిటికీలోంచి దూసుకొస్తున్న వెయ్యి

కిరణాల సూర్యకాంతి ఆమె వెనకనుంచీ, ఆమె అందాన్ని వెయ్యింతలు పెంచుతోంది.

టెంపో అగ్గిపుల్ల గీశాడు. సిగరెట్ కొసని మంటలో గుచ్చాడు. మెల్లిగా కదిలాడు. అతనిలో ఆలోచనలు చెల రేగుతున్నాయి. సౌందర్యరాశిని ఇంట్లో పెట్టుకున్న భర్త, ఆమెని నిర్లక్ష్యం చేసి రజని వెంట ఎందుకు పడ్డాడు? రజని అందమైందే. అయితే సుధ అందంతో పోల్చ దగిన అందం కాదది. అందంగా, మర్యాదగా కదులుతూ ఇసుక తీరాన్ని తాకే సున్నితమైన ఆల సుధ. ఉప్పెనగా ఎగురుతూ దూసుకొచ్చే అల రజని. ఉప్పెనలాంటి అందంలో తల మునకలయి, ఉక్కిరిబిక్కిరయిపోడం మనిషికి ఇష్టమా?

"కూచోండి ...."

సుధ కంఠం టెంపో ఆలోచనల్ని చెరిచింది. అప్ర యత్నంగా కూచొని ఆమె వయిపు నవ్వుతూ చూశాడు టెంపో. సుధ నిలబడే వుంది.

"కూచోండి!"

"ఫరవాలేదు ...." సుధ మెల్లిగా అంది.

టెంపో చూపులు ముందున్న టీపాయ్ మీద వాలాయి. స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్లేటులో రెండు రసగుల్లాలూ స్పూనూ ఉన్నాయి.

"టెంపోగారూ ....రసగుల్లా తినండి" అందామె.

టెంపో ఆమె వయిపు చూశాడు. "తినడానికి రాలేదు; వినడానికి వచ్చాను."

సుధ పెదవులు కదల్లేదు. కళ్ళు టెంపోని ప్రశ్నిస్తు న్నాయి. ఇంకా నిలబడే వున్న సుధని టెంపో చిరు నవ్వుతో చూశాడు. కాసేపట్లో ఆమె కూచుంటుందని

అతనికి తెలుసు.

"సుధగారూ, శుక్రవారం రాత్రి మీరు కృత్తివాస రావుని రజని ఇంటికి తీసుకెళ్ళారు. ఎందుకు?"

ఉపోద్ఘాతంలాంటిది లేని ఔంపో ప్రశ్న ఆమెని చెంప పెట్టులా తాకింది. ఆమె మొహంలో, కళ్ళల్లో ప్రత్యక్ష మైన ఆందోళననీ ఆశ్చర్యాన్నీ వర్ణించాలంటే తను డిటెక్టివ్ వృత్తి మానేసి కవిగా తయారుకావాలనిపిం చింది ఔంపోకి.

సుధ చెయ్యి గాలిలో తీగలా కదులుతూ సోఫా అంచుని పట్టుకుంది. అప్రయత్నంగా ఆమె సోఫాలో కూచుంది. ఆమె వెంటనే సమాధానం చెప్పలేదని ఔంపోకి తెలుసు.

"మీరు అక్కడికి....మంచం కోసం వెళ్ళారని క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అనుకుంటున్నాడు."

సుధ ఉక్కిరిబిక్కిరవుతూ చూసింది. కొత్త కంగారు ఆమె కళ్ళల్లోకి ప్రవేశించింది. ఉన్నట్టుండి ఉబికిన నీటి పొరలు ఆ కంగారుని ముంచేశాయి. తను నోరు జారి నందుకు ఔంపో హృదయపూర్వకంగా గిచారించాడు.

"అయితే నేను అలా అనుకోవడం లేదు. మీరు తాళంచెవి కోసం అతన్ని తీసుకుని అక్కడికి వెళ్ళారు" ఔంపో వోదార్పుగా అన్నాడు.

సుధ నిట్టూర్చింది. ఆరిపోయిన పెదవుల్ని నాలుకతో తడువుకుంది.

"భయపడకండి. మాట్లాడండి. భయపడినంతకాలం మీరు బాధపడుతూనే వుంటారు!" ఔంపో నవ్వుతూ అన్నాడు.

"... మీకు ఎలా తెలుసు?" సుధ కంఠం వణికింది.

"ఇలాంటివి నాకు తెలుస్తూనే వుంటాయి!" ఔంపో

నవ్వుతూ అన్నాడు. "మీరు అబద్ధాలాడరనీ నాకు తెలుసు. నిజం చెప్పడానికి భయపడతారనీ నాకు తెలుసు!"

సుధ అసంకల్పితంగా అరచేత్తో నుదుర్ని తుడుచుకుంది. మెల్లిగా పెదవులు కదిలాయి.

"ఇదంతా ....మీరు...బైటపెడతారా?"

"బైటపడ్డాకే ఇదంతా నా చెవిని పడింది!" టెంపో చిన్నగా నవ్వాడు.

సుధ మొహంలో నీరసం ఎక్కువైంది. టెంపో సోఫాలో ముందుకి వాలాడు. ఆమె మొహంలోకి తదేకంగా చూశాడు. ఆమె చెప్పలేనిదంతా తనే చెప్పేసి, ఒకటి రెండు ప్రశ్నలకి సమాధానాలు ఆమె ద్వారా చెప్పించడం మంచిదనిపిస్తోందతనికి.

"సుధగారూ. మిమ్మల్ని అవమానించడానికీ, బాధపెట్టడానికీ నేను రాలేదు. నా పరిశోధనలో వెల్లడైన విషయాలు మీకు చెప్తాను: మీరూ, కృత్తివాసరావూ ప్రేమించుకున్నారు. మీరు మరో వ్యక్తికి భార్య అయ్యారు. కృత్తివాసరావు బ్రహ్మచారిగా వుండిపోయాడు...." టెంపో ఆగి, కొత్త సిగరెట్ వెలిగించాడు.

సుధ మొహంలో వివిధ రకాల భావాలు కలగాపులగంగా అవుపిస్తున్నాయి. చెమటతో కరిగిన కుంకం గీతలా సాగుతోంది. ఆమె కళ్ళల్లో వర్ణనాతీతమైన బాధ అద్దం బిళ్ళల్లో ప్రతిబింబంలా అవుపిస్తోంది.

"కృత్తివాసరావుకీ మీకూ మధ్య గతంలో పెరిగిన ప్రేమ గురించి మీ భర్తకి ఎలాగో తెలిసింది. మీ కోసమే అతను ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకు వచ్చాడని, సహజంగా - మీ భర్త ఊహించుకునీ ఉంటాడు. ఈ

కారణంగానో, రజనిలోని ఆకర్షణ మూలంగానో మీ భర్త మీకు దూరంగా. రజనికి దగ్గరగా జరిగాడు ”

“ఇదంతా....మీ కెవరు చెప్పారు?” వణం తప్పి ధ్వనిస్తున్న సుధకంఠం టెంపోని అడ్డుకుంది.

“రజని. ఆమెకి మీ భర్త చెప్పాడు. అయినా అదంతా నాకు అంతగా అవసరంలేదు. నాకు కావాల్సింది ఒక్కటే; కృత్తివాసరావుకి మీరు ఆఫీసు తాళంచెవులు ఎందుకి ఇచ్చారు?”

సుధ, సినిమాలోని దుర్యోధనుడి సభలో ద్రౌపది వేషంలో అభినేత్రి సావిత్రిలా దయనీయంగా టెంపోని చూసింది.

“కృత్తివాసరావు .... కావాలన్నాడు....” అప్రయత్నంగా సుధ పెదవులు కదిలాయి.

“ఎందుకు?”

“కృత్తివాసరావు చెప్పలేదు ...” సుధ మెల్లిగా అంది.

టెంపో ఆమె కళ్ళల్లోకి వెతుకుతూ చూశాడు. అతను వెతుకుతున్న నటన ఆ కళ్ళల్లోలేదు. విచారం తప్ప మరో భావం ఇప్పుడామె కళ్ళల్లోలేదు.

“మీరు అడగలేదా?” టెంపో ప్రశ్నించాడు.

సుధ నిట్టూర్చింది“....అడిగాను. తనకి ఆఫీసులో అతి ముఖ్యమైన పనివుందనీ. ఆ విషయం ఇతర్లకి తెలీకూడదనీ అతనన్నాడు ఆ విషయం గురించి ప్రశ్నించకుండా తనకి సహాయం చేయమన్నాడు. ఆఫీసులోంచీ తనేమీ దొంగిలించబోవడంలేదనీ, అఫీసుకి ఏ నష్టమూ కలగదనీ నవ్వుతూ అన్నాడు....”

“తరవాత?” ఆగిన సుధని టెంపో ప్రశ్నించాడు.

“ఆఫీసు తాళాలు ఇస్తే తనకి నేనెంతో సహాయం

చేసిన దాన్నవుతానన్నాడు...."

"అంతేనా?"

సుధ మళ్ళీ నిట్టూర్చింది. "కృత్తివాసరావు జీవితంలో నన్ను సహాయం కోరింది అదే! నేను ప్రశ్నించలేక పోయాను....ఆఫీసు తాళంచెవులు అలా ఇవ్వడం తప్పు కావొచ్చు. కానీ అతనూ ఆఫీసులో పనిచేసే వ్యక్తే అని సర్ది చెప్పుకున్నాను. అతని చిన్న కోరికను తిరస్కరించ లేక పోయాను...." సుధ కంఠం వణికింది.

"ఆల్‌రైట్. జవాను మీ ఇంటికి చేర్చే తాళం చెవిని మీరు ఎందుకివ్వలేదు?" టెంపో ప్రశ్నించాడు.

"దాన్నే ఇవ్వాలని ప్రయత్నించాను. అయితే అది ఇంట్లో లేదు. ఎంత వెతికినా దొరకలేదు...."

"తరవాత!"

"ఆ మాటే అతనికి చెప్పాను. కాసేపు తటపటా యించి, రజని ఇంట్లో వుంటుందనీ, దాన్ని తీసి ఇవ్వమనీ కృత్తివాసరావు అన్నాడు...."

టెంపో కనుబొమలు పైకి లేచాయి. "రజనీ, మీ భర్తా - వీళ్ళగురించి అతనికి తెలుసా?"

"తెలీకపోతే స్పేర్‌కీ గురించి కృత్తివాసరావు నన్నెం దుకు అడుగుతాడు? వాళ్ళిద్దరి గురించి నాకు తెలుసు. అయితే, వాళ్ళు ఆఫీసును....ఆఫీసు తాళంచెవిని ఉపయో గించుకుంటున్న విషయం నాకు తెలీదు..."

"రైట్. సుధగారూ, అంతవరకూ బాగానేవుంది. అయితే, రజని ఇంటి తాళంచెవి మీకెక్కడిది?" టెంపో ప్రశ్నించాడు.

సుధ ఒకసారి టెంపో మొహంలోకి చూసి, కళ్ళు దించుకుంది.

"ఆయన రజని ఇంటికి వెళ్తారనీ, చెరో తాళంచెవి ఉంచుకున్నారనీ నాకు....తెలుసు. బీరువాలో, ఎప్పుడూ ఉపయోగించని పెళ్ళికోటు జేబులో దాన్ని ఉంచుకుంటారు."

జెంపో తలపంకించాడు. "సో, ఆ తాళంచెవి తీసుకుని, వెళ్ళి మీరు రజని ఇంటితలుపు తెరిచి, ఆమె బెడ్ రూమ్‌లో ఆమె హాండ్ బాగ్‌లోవున్న ఆఫీసు స్పేర్ కీని తీసి అతని కిచ్చారు...."

సుధ బరువుగా తల పంకించింది. జెంపో ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు. "మిసెస్ సుధా, రజని ఇంటి తాళంచెవి ఇచ్చి, అతన్నే వెళ్ళి తీసుకొమ్మని మీరు చెప్పి ఉండొచ్చు. అలా చేయకుండా మీరే స్వయంగా వెళ్ళే సాహసం చేశారు! దేనికి?"

సుధ అతన్ని దీనంగా చూసింది. "ఆ మాటే అతనితో అన్నాను. కానీ....తనొక్కడే వెళ్తే ఇరుగు పొరుగువాళ్ళె వళ్ళైనా చూస్తే దొంగ అనుకుని గొడవచేస్తారనీ, నేనూ వెళ్తే చీకట్లో ఎవరేనా నన్ను చూసినా, రజని అనుకుని సరిపెట్టుకునే అవకాశం వుందనీ అతను అన్నాడు.... నేనూ....ఆమే....దాదాపుగా ఒకే పొడవుతో వున్నామని కూడా కృత్తి....అన్నాడు....అంచేత.... భయంకలిగినా, అతని మాటని కాదనలేక పోయాను...."

అర్థమైనట్టు జెంపో తలపంకించాడు. కృత్తివాసరావు కరెక్టుగా, చక్కగా ఊహించాడు. అతను అనుకున్నట్టే, వాళ్ళని చూసిన స్త్రీ సుధని చూసి రజని అని సరిపెట్టు కుంది!

"తాళంచెవి తీసుకున్నాక ఏంచేశారు?" జెంపో ప్రశ్నించాడు.

సుధ కళ్ళు చిట్లిస్తూ చూసింది...."వెంటనే వచ్చేశాం.

నన్ను ఇంటిదగ్గర దిగబెట్టి, అతను వెళ్ళిపోయాడు. తాళంచెవిని నేను యథాస్థానంలో పెట్టేశాను ..."

"సుధగారూ....ఆఫీసుకి ఆ తాళంచెవిని ఉపయోగించి-వెళ్ళడం మూలాన కృత్తివాసరావు దుర్మరణం చెందాడు!"

తటాలున సుధ కళ్ళల్లోంచి నీటి బిందువులు కిందికి దొర్లాయి. అసంకల్పితంగా మొహం పక్కకి తిప్పి అరచేత్తో బుగ్గల్ని తుడుచుకుందామె. టెంపో అబలలకు ప్రతిరూపంలా తనముందు కూచున్న సుధని సానుభూతితో చూశాడు. ఆమె తల మెల్లిగా పైకిలేచింది.

"నేను చేసిన సహాయం కృత్తివాసరావు ప్రాణం తీస్తుందని ఊహించలేకపోయాను...." సుధ కంఠం దుఃఖంతో, పశ్చాత్తాపంతో బొంగురుగా ధ్వనించింది "టెంపోగారూ....అతనికి నా హృదయాన్ని ఇచ్చాను.... ఒకప్పుడు. దానివల్ల కృత్తికి బ్రహ్మచర్యం, ఒంటరి జీవితం లభించాయి....ఇప్పుడు అతను అడిగిన ఆఫీసు తాళంచెవి ఇచ్చాను....అతను .. శవంలా మిగిలాడు...."

సుధ కంఠంలోని వ్యథ టెంపో హృదయాన్ని ముల్లులా గుచ్చింది. జాలితో ఆమె మొహంలోకి చూశాడతను. "అయామ్ సారీ మిమ్మల్ని ఏడిపిస్తున్నాను."

"మీరు బాధపడకండి. కొంతమంది కన్నీళ్ళు కార్చడానికే పుడతారు!" సుధ సన్నటి కంఠంతో అంది.

టెంపో తల ఊగించాడు.

"టెంపోగారూ అతన్ని....అతన్ని ఎవరు....హత్య చేశారు?"

టెంపో ఆమెని మళ్ళీ జాలిగా చూశాడు. "ఇంకా తెలీలేదు."

"ఎందుకు ఆ దారుణం జరిగిందో తెలుసుకున్నారా?"

సుధ ప్రశ్నించింది.

"ఎందుకు చేశారో తెలిస్తే ఎవరు చేశారో కనుక్కోవచ్చు. ఎవరు చేశారో తెలిస్తే ఎందుకు చేశారో వాళ్ళే చెప్తారు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

సుధ తల మెల్లిగా కదిలించింది. టెంపో లేచి నిలబడి, సిగరెట్ వెలిగించాడు. కొద్దిగా తల వాల్చుకుని కూచున్న సుధని క్షణకాలం తదేకంగా చూశాడు.

"సుధగారూ, కృత్తివాసరావు మిమ్మల్ని ప్రేమించాడు. ఈ ఊరికి చేరుకున్నాడు. అతనిమీద కసితో, ద్వేషంతో మీ భర్త అతన్ని హత్యచేయించి వుండవచ్చుగా?" టెంపో ఉన్నట్టుండి ప్రశ్నించాడు.

సుధ అదిరిపడి తలెత్తి, అయోమయంగా టెంపోని చూసింది. (సశేషం)

కేడీ బామ్మర్ది!



పోయెటిక్ జస్టిస్

—చవాన్ సుదర్శనరావు



కర్నూలు రైల్వే స్టేషను రద్దీగా వుంది.

సికిందరాబాదుకు వెళ్ళే రైలు బయలుదేరడానికి సిద్ధముగా వుంది. నా వెంట వస్తున్న ఇందిరాదేవిని అతి కష్టం మీద కంపార్టుమెంటులో ఎక్కించాను.

నేనుకూడా ఆ కంపార్టుమెంటులో ఎక్కడానికి ప్రయ

త్నించాను. కాని వాకిలివద్ద గోడ కట్టినట్టుగా ప్రయాణీకుల గుంపు. ఈలోగా ఇంజను కూత కూసింది. ఇక ఆ కంపార్టుమెంటులో ఎక్కడం అసాధ్యమని తలచి ప్రక్కనున్న ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కక తప్పలేదు.

ఆ కంపార్టుమెంటులో కూర్చున్న మీదట ఇందిరాదేవిని గురించి ఆలోచింపసాగాను. ఆమె నా పేషంటు. భర్త చనిపోయి పదేళ్ళయింది. భర్త వీలునామా ప్రకారం ఆస్తిలో సగం ఆమెకు, మిగత సగం కొడుకు వాసుదేవ్‌కు సంక్రమించింది.

ఆమె వాటాకు వచ్చిన ఆస్తి విలువ అయిదు లక్షలకు పైగా వుంటుంది. కాని ఏమి ప్రయోజనం! తల్లికి కొడుకుకు ఒక విషయంలో తగాదా వచ్చి తన తల్లిమీద కోపంతో ఆ కొడుకు ఇల్లు వదలిపెట్టి మిలటరీలో చేరాడు.

ఇందిరాదేవి ఆరోగ్యం అంతంత మాత్రమే. ఎప్పుడు ఏదో ఒక రోగంతో బాధపడుతూ వుంటుంది. కొన్నాళ్ళుగా ఆమె ఉదర సంబంధమైన జబ్బుతో బాధపడుతోంది. ఇందుకు తోడుగా ఆమెకు మధుమేహం వ్యాధికూడ వుంది. అందుచేత ఎల్లకాలం ఆమెకు డాక్టరు సంరక్షణ అవసరం.

ఆమె భర్త బ్రతికివున్న కాలంనుండి నేను ఆమెకు వైద్యం చేస్తూ వచ్చాను. ఒక్క వైద్యమే కాదు ఎదిగి వచ్చిన కొడుకు ఆమెను వదలిపెట్టి పోవడంవల్ల ఆమె ఆస్తిపాస్తుల వ్యవహారాలలో సలహాలు ఇచ్చి ఆ సంబంధమైన పనులుకూడ చేసిపెట్టేవాడిని.

రోజూ నేను ఇచ్చిన మాత్రలు, టానిక్కులు తీసుకొంటున్నా కొంతకాలంగా ఆమెకు నలతగా ఉందని చెప్పడంవల్ల హైదరాబాదులోవున్న స్పెషలిస్టుకు చూపించ

దానికి ఈ ప్రయాణం. ఆమెకు ఏ క్షణంలో ఏ రోగం ముదురుతుందో అన్న భయంతో నన్నుకూడ వెంట రమ్మంది.

రైలు మూడు స్టేషన్లు దాటిన తర్వాత ప్రక్క కంపార్టు మెంటులో రద్దీ తగ్గింది. వెంటనే నేను ప్రక్క కంపార్టు మెంటులోనికి మారిపోయాను.

"మీ ఒంట్లో ఎలావుంది?" ఇందిరాదేవిని ప్రశ్నించాను.

"కడుపులో వికారంగా వుంది. ఒళ్ళంతా నీరసంగా వుంది డాక్టర్."

"ఈ క్యాప్సూల్స్ వేసుకొని పడుకోండి. తగ్గిపోతుంది" అంటూ నావద్దవున్న మెడికల్ కిట్ నుండి రెండు క్యాప్సూల్స్ తీసి ఇచ్చాను. తర్వాత ప్రక్కనున్న ప్రయాణీకులకు ఆమె పరిస్థితి వివరించి చెప్పి సీటు ఖాళీ చేయించి ఆమెను పడుకోబెట్టాను.

రైలు కాచీగూడా స్టేషనులో ఆగగానే ఆమెను లేపడానికి ప్రయత్నించాను. కాని ఆమెకు మెలకువ రాలేదు. నాడి పరీక్షించగా మెల్లగా కొట్టుకొంటూ వుంది. ఆమె అపస్మారక దశలో వుండటంవల్ల పోర్టర్ల సహాయంతో ఆమెను టాక్సీదాక తీసికెళ్ళి రఘువీర్ హాస్పిటల్‌కు వెళ్ళి అందులో చేర్పించాను.

అప్పటికి ఉదయం ఆరుగంటలు అయినందువల్ల నైట్ డ్యూటీ చేసిన జ్యూనియర్ డాక్టర్ ఆమెను పరీక్షించాడు. ఆ డాక్టరు పేరు ప్రకాష్ అని నాకు అప్పుడు తెలిసింది.

డాక్టర్ ప్రకాష్ కేస్‌షీటు వ్రాస్తూ పేషంటు పేరు అడ్రసు అడిగాడు. పేషంటు పేరు విమలాదేవి అని ఆమె అడ్రసు నా కేర్ ఆఫ్ అడ్రసు అని చెప్పి కర్నూలులో

నా డిస్పెంసరీ అడ్రసు ఇచ్చాను. ఇందిరాదేవికి పెళ్ళికాక పూర్వం వున్న పేరు విమలాదేవి: వధూవరుల నామ నక్షత్రాల బలాలు కుదరకపోవడం వల్ల పెళ్ళప్పుడు ఆమె పేరు ఇందిరాదేవిగా మార్చారు. మార్చినప్పటికి ఆమె భర్త ఆమెను 'విమలా' అన్న పేరుతోనే పిలిచేవాడు. నేను ఆ కుటుంబానికి సన్నిహితుడను కాబట్టి ఆమెను కొన్ని సార్లు ఇందిరాదేవి అని మరికొన్నిసార్లు విమలాదేవి అని పిలిచేవాడిని. అందువల్ల డాక్టరు ప్రకాష్ పేషంటు పేరు అడిగినప్పుడు విమలాదేవి అని చెప్పాను.

"మీ ఉద్దేశ్యంలో ఆమె స్పృహ తప్పిపోవడానికి కారణం ఏమిటి?" డాక్టర్ ప్రకాష్ నన్ను ప్రశ్నించాడు, నేనుకూడ డాక్టరునని తెలియడం మూలాన.

"డయాబెటిక్ కోమా వల్ల ఆమె అపస్మారక దశలో వుందని నా అనుమానం. కాని మీ సీనియర్ డాక్టరును పిలిపించి పరీక్ష చేయించండి" అన్నాను నేను.

"ఫోనుచేసి పిలిపించినా సీనియర్ డాక్టర్లు తొమ్మిదింటికి గాని రారు. అప్పటిదాకా పేషంటుకు ఎలాంటి ట్రీట్ మెంట్ ఇవ్వకుండా ఎలా వుంచగలం? డయాబెటిక్ కోమాకు ట్రీట్‌మెంట్ ఇచ్చేదా?"

"మీ ఇష్టం డాక్టర్" అన్నాను నేను.

డాక్టర్ ప్రకాష్ ఇందిరాదేవికి ట్రీట్‌మెంట్ ఇవ్వడం ప్రారంభించాడు. కాని ఏమాత్రం మెరుగుదల కనబడక పోగా, క్షణక్షణానికి ఆమె పరిస్థితి దిగజారిపోయింది. తొమ్మిదిగంటలకు ఆమె అంత్యశ్వాస విడిచింది.

నేను ఇక అక్కడ ఉండటం అనవసరమనితోచి వెళ్ళి పోతుండగా ఆ హాస్పిటల్ సీనియర్ డాక్టరు సదానందం వార్డులో ప్రవేశించి నన్నుచూచి ప్రశ్నించాడు.

"హలో డాక్టర్ గోపాల్. ఎప్పుడొచ్చారు? మా హాస్పిటల్‌లో ఎవరైనా పేషంటును చేర్పించారా?"

"పేషంటును తెచ్చి చేర్పించడం, ఆమె అకస్మాత్తుగా చనిపోవడం కూడ జరిగింది" అన్నాను నేను.

"ఏమిటి జబ్బు?"

"ఆమె డయాబిటిక్ కోమాలో వుండి చనిపోయిందని నా అభిప్రాయం."

"ఆమె శవాన్ని ఎప్పుడు తీసికెళ్తారు? ఈలోగా డాక్టరు ప్రకాష్‌తో సంప్రదించి డెత్ సర్టిఫికెట్ కూడ తయారు చేయిస్తాను."

"ఆమె శవాన్ని ఆమె స్వంత ఊరు కర్నూలుకు తీసికెళ్ళడం అనవసరం. అక్కడ ఆమెకు ఎవరు బంధువులు లేరు. ఉన్న ఒక్క కొడుకు మిలిటరీలో వున్నాడు. ఇక్కడే హైదరాబాదులో ఆమె బంధువు ఒకడు వున్నాడు. వెళ్ళి అతనికి చెప్పి దహన సంస్కారాలు ఇక్కడే చేయించమని చెబుతాను" అంటూ నేను హాస్పిటల్ నుండి బయటకు వచ్చాను.

మర్నాడు డాక్టర్ సదానందం నుండి నా డిస్పెంసరీ అడ్రసుకు ఒక టెలిగ్రాం వచ్చింది. మృతురాలి శవాన్ని బంధువులు వచ్చి తీసికెళ్ళలేదని, వెంటనే శవాన్ని తీసికెళ్ళే ఏర్పాటు చేయమని ఆ టెలిగ్రాములోని విశేషం.

ఆ టెలిగ్రాముకు సమాధానంగా విజయవాడలోవున్న మృతురాలి తమ్ముడు రాజారావుకు ఆమె మరణం గురించి తెలియజేస్తూ టెలిగ్రాము ఇచ్చానని, అతడు ఆ టెలిగ్రాము అందగానే హైదరాబాదుకు వచ్చి శవాన్ని తీసికెళతాడని మరుసటి దినం ఉత్తరం వ్రాసి పోస్టు చేశాను.

రెండు రోజుల తదనంతరం కొన్ని సంగతులు

వ్రాయాలని డైరీ తీశాను. అందులో నుండి రెండు చెక్కులు జారి క్రిందపడ్డాయి. అందులో ఒక చెక్కు ఇరవై వేలకు. ఒక ప్లాటు కొనుగోలు కొసం అడ్వాన్సు చెల్లించడానికి డబ్బు తెచ్చియివ్వమని ఇందిరాదేవి నా పేర ఆ చెక్కు ఇచ్చింది. మరొక చెక్కు అయిదువేలకు. ఆ చెక్కు మార్చి మునిసిపాలిటికి చెల్లించవలసిన ప్రాపర్టీ టాక్సు బకాయిలు చెల్లించమని చెప్పింది. ఆ చెక్కులు హైదరాబాదు ప్రయాణానికి ఒక రోజు ముందు నేను వ్రాయగా ఆమె సంతకం చేసింది. ఆ రోజు నాకు తీరిక లేకపోవడంతో బ్యాంకుకు వెళ్ళలేకపోయాను. హైదరాబాదు నుండి తిరిగి వచ్చిన తర్వాత బ్యాంకు నుండి డబ్బు తీద్దురుగాని అని ఇందిరాదేవి చెప్పడంవల్ల ఆ చెక్కులు నా వద్ద వుండిపోయాయి.

ఆ చెక్కులు చూడగానే నా మస్తిష్కంలో కొన్ని ఆలోచనలు మెదిలాయి. బ్యాంకు నిబంధనల ప్రకారం చెక్కులో సంతకం చేసిన వ్యక్తి చనిపోయిన తర్వాత ఆ చెక్కులు మార్చుకొనడానికి వీలులేదు. కాని ఇందిరాదేవి మరణం గురించి హైదరాబాదు డాక్టర్లకు నాకూ తప్ప ఇతరులకు తెలియదు. ఆ డాక్టర్లకు కూడ మృతురాలు విమలాదేవి అని తెలుసుగాని ఇందిరాదేవి అని తెలియదు. అందువల్ల చెక్కులు మార్చుకొనడంలో ఎలాంటి ఇబ్బంది వుండదని భావించాను.

వెంటనే బ్యాంకుకు వెళ్ళి ఆ రెండు చెక్కులు కవుంటరులో ఇచ్చాను. ఎలాంటి అనుమానం లేకుండా చెక్కులు మారి డబ్బు చేతికి వచ్చింది.

రెండు రోజుల తర్వాత ఒక సబ్ యిన్స్పెక్టర్ నా వద్దకు వచ్చాడు. మృతురాలి చెక్కులు మార్చిన కార

ణంగా అతడు వచ్చాడేమో అన్న అనుమానంతో కంగారు పడ్డాను.

"డాక్టర్‌గారూ, మా స్టేషనుకు హైదరాబాద్ పోలీసుల నుండి ఫోను వచ్చింది. మీరు ఆరు రోజుల క్రితం విమాలాదేవి అన్న స్త్రీని రఘువీర్ హాస్పిటల్లో చేర్పించారట. ఆమె చనిపోయిన తర్వాత ఆ శవాన్ని ఎవరు తీసుకెళ్ళకపోవడంతో హాస్పిటల్‌వాళ్ళు పోలీసులకు తెలియజేయగా పోలీసులు ఆ శవాన్ని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు తరలించి మార్చురీలో ఉంచారట. మార్చురీలో ఉన్న శవాలను కొన్నాళ్ళలో ఎవరు తీసికెళ్ళకపోతే అనాథ ప్రేతాల క్రింద జమకట్టి ఆ హాస్పిటల్‌కు సంబంధించిన మెడికల్ కాలేజికి అప్పజెప్పుతారు. మెడికల్ కాలేజి స్టూడెంట్స్ ఆ శవాన్ని డిసెక్షన్ చేయడానికి ఉపయోగించుకొంటారు. మీరు విమలాదేవిని రఘువీర్ హాస్పిటల్లో చేర్చినప్పుడు మీ కేర్ ఆఫ్ అడ్రసు ఇవ్వడం వల్ల ఆమె శవాన్ని మీరు తీసికెళ్తారేమో తెలుసుకొమ్మని హైదరాబాదు పోలీసులు ఫోను చేశారు" అన్నాడు వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్.

"విమలాదేవి ఎవరో నాకు తెలియదండి! ఆ రాత్రి నేను ప్రయాణం చేసిన కంపార్టుమెంటులో ఒక స్త్రీ స్పృహ తప్పి పడివుండటం చూశాను. ఆమె పేరు విమలాదేవి అని ఆ బోగీలో వున్నవాళ్ళు ఎవరో చెప్పారు. రైలు కాచీగూడా చేరినా ఆమెకు స్పృహ రాలేదు. ఆమె సంగతి యెవరు పట్టించుకోకుండా రైలు దిగి వెళుతుంటే స్పృహ తప్పిన రోగిని వదిలిపెట్టి పోవటానికి డాక్టరుగా నా మనసొప్పలేదు. వెంటనే తీసికెళ్ళి ఆ హాస్పిటల్‌లో

చేర్చాను. ఆమె చిరునామా తెలియనందున నా కేర్ ఆఫ్ అడ్రసు ఇవ్వవలసి వచ్చింది'' అన్నాను నేను.

"మరయితే ఆ శవాన్ని మెడికల్ కాలేజివాళ్ళకు అప్ప జెప్పడానికి మీకు అభ్యంతరంలేదా?''

"అనాథ ప్రేతం అయినప్పుడు నా అభ్యంతరం ఏముం టుందండీ?''

ఆ సబ్ యిన్‌స్పెక్టరు వెళ్ళిపోగానే దీర్ఘంగా నిట్టూర్పు విడిచాను. తీగలాగితే డొంక కదులుతుందన్న సామెత నాకు తెలుసు. అందుచేత విమలాదేవి నా పేషంటు అని, ఆమె వెంట నేను హైదరాబాదు వెళ్ళానని చెప్పదలచుకో లేదు. ఆ సంగతి చెబితే నా గురించి ఆరాలు తీసి ఆమె ఇచ్చిన చెక్కులను ఆమె మరణానంతరం మార్చుకొని డబ్బు స్వంతం చేసుకొన్నానని కూడ తెలుసుకోగలరు. మరొక అడుగు ముందుకు వేసి ఆ డబ్బుకోసమే ఆమెకు మందో మాకో పెట్టి హత్య చేశానని కూడ ఆరోపించగల ఘటికులు ఈ పోలీసువాళ్ళు.

పదహేను రోజుల తర్వాత నేను హైదరాబాదుకు వెళ్ళ వలసిన అవసరం కల్గింది. పని ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణానికి బస్‌డిపో చేరుకొన్నాను.

"హలో డాక్టర్ గోపాల్'' అన్న శబ్దం విని తిరిగి చూచాను.

ఎదురుగా డాక్టర్ సదానందం.

"హైదరాబాదుకు ఎప్పుడు వచ్చారు?'' అని ప్రశ్నిం చాడు.

"ఉదయం వచ్చాను. పని ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యాను. మీరు కూడ ఎక్కడికో ప్రయాణ మయ్యారే'' అన్నాను అతని చేతిలోని సూట్ కేస్ చూస్తూ.

"గుంటూరు వెళ్ళాలి. రేపు అక్కడ మా బంధువుల ఇంట్లో పెళ్ళి. అసగజం మరిచాను. విమలాదేవి శవం తీసికెళ్ళడానికి ఎవరు రాలేదేమిటి?"

"విమలాదేవి తమ్ముడు వచ్చి తీసికెళ్తాడనుకొన్నాను. అతడు రాలేదా?"

"ఎవరూ రాలేదు. అందుచేత శవం సంగతి పోలీసులకు తెలియజేశాము. పోలీసులు ఆ శవాన్ని గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీకి మార్చారు. వారంరోజులు చూచి ఆ శవాన్ని మెడికల్ కాలేజి స్టూడెంట్సుకు డిసెక్షన్ కోసం ఇచ్చివేశారు హాస్పిటల్ అధికారులు. డిసెక్షన్ జరుగవలసిన రోజు శవాన్ని మార్చురీ నుండి డిసెక్షన్ హాలుకు తీసికెళుతుండగా మార్చురీ అటెండరు ఆ శవం గొంతుమీద కొన్ని గీట్లువుండటం గమనించి వెంటనే ఆ సంగతి ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసరుతో చెప్పాడట. ఆ ప్రొఫెసర్ వెంటనే ఫోనుచేసి పోలీసులకు తెలియజేశాడట. పోలీసులకు అనుమానం పుట్టి ఆ శవాన్ని పోస్ట్‌మార్టమ్ ఎగ్గామినేషన్ చేయించారట. ఆ ఎగ్జామినేషన్‌లో తేలిన సంగతి ఏమిటో తెలుసా? పోలీసులు అనుమానించినట్లు ఆ గీట్లు ఆమె బ్రతికివున్నప్పుడు తగిలినవికావట. చనిపోయిన తర్వాత అయిన గాయాలట. బహుశా ఆ శవాన్ని ట్రక్కులో మా హాస్పిటల్‌నుండి తీసికెళ్ళినప్పుడు ఏవైనా వాడిమొన వున్న వస్తువులు గీసుకొని పోవడం వల్ల ఆ గాయాలు అయివుండవచ్చునని నా అంచనా. పోస్ట్‌మార్టమ్ ఎగ్జామినేషన్‌లో ఆమెకు విషప్రయోగం జరిగిన సూచనలు ఏవీ లేవని కూడ తెలిసిందట."

"అలాగా!"

"మరొక సంగతి కూడ తెలిసిందట. మీరు దయా

గ్నోయిజ్ చేసినట్టు ఆమె డయాబెటిక్ కోమా వచ్చి చనిపోలేదట."

నేను ఆశ్చర్యం ప్రకటించడం గమనించాడు డాక్టర్ సదానందం.

"ఎంతటి డాక్టరయినా ఒక్కొక్కసారి పొరపాటు పడు తుంటాడు. అందు గురించి బాధపడవలసిన అవసరం లేదు" అన్నాడు నన్ను సముదాయించినట్లుగా.

నేను కర్నూలుకు తిరిగి వచ్చిన తర్వాత దీర్ఘంగా ఆలోచించాను. ఇందిరాదేవి మరణం గురించి కర్నూలులో ఎవరికి తెలియదు. ఆమె మరణాన్ని నేను నా స్వప్రయోజ నానికి ఉపయోగించడం ఏమంత కష్టంకాదు. ఆమె ఆస్తి పాస్తుల వివరాలు, వివిధ బ్యాంకుల్లో ఆమె పేర నిలువ వున్న డబ్బు వివరాలు నాకు క్షుణ్ణంగా తెలుసు. ఆమె వ్రాతను, సంతకాన్ని అనుకరించగల నేర్పు నాకుంది. ముందు ఆలోచనగా, ఇందిరాదేవిని హాస్పిటల్‌లో చేర్చక ముందు ఆమె బొడ్డులో దోపుకొన్న ఇంటి తాళంచేతుల గుత్తిని తీసి దాచుకొనడంవల్ల ఆ ఇంట్లోవున్న బ్యాంకు చెక్కు పుస్తకాలను నా వశం చేసుకోవచ్చు.

కాని ఇందులో ఒక చిక్కువుంది. ఇందిరాదేవికి కర్నూలులో బంధువర్గంలేదని డాక్టర్ సదానందంతో చెప్పినా, నిజానికి కర్నూలులో ఆమె భర్త తాలూకూ బంధువులు ఉన్నారు. ఇందిరాదేవి కనబడక పోవడంవల్ల వాళ్ళకు అనుమానం రావచ్చు. అప్పుడు ఆమెను గురించి ఆరాలు తీయవచ్చు. ఆమె చనిపోయిందని తెలియక పోయినా అంతర్ధానమయిందని తెలిసిపోతుంది. అప్పుడు నేను రూపొందించుకొన్న పథకానికి అవరోధం కలుగ వచ్చు. ఆలోచించగా ఒక ప్రణాళిక నా మనస్సులో

రూపొందింది.

కొన్నాళ్ళ తర్వాత ఇందిరాదేవి వ్రాసినట్లుగా ఆమె భర్త బంధువర్గానికి జాబులు రాసాగాయి. తాను తీర్థ యాత్రలకు వెళ్ళిందని, ఆ పుణ్యక్షేత్రాలలో ప్రశాంతంగా కనీసం కొన్ని నెలలు గడపాలని తనకు కోరికగావుందని, తన గురించి కంగారు పడవలసిన అవసరం లేదని ఆ జాబులో వ్రాయబడింది.

ఇందిరాదేవి ఇండ్లలో అద్దెకు వుంటున్న వాళ్ళకు కూడ ఆమె వ్రాసినట్లుగా ఉత్తరాలు వచ్చాయి. నెలనెలా అద్దెను డాక్టరు గోపాల్‌కు చెల్లించమని, అతడు ఆ డబ్బును తనకు పంపగలడని ఆ ఉత్తరాల సారాంశం.

నాకు కూడ అప్పుడప్పుడు ఆమె వ్రాసినట్లుగా కొన్ని ఉత్తరాలు వచ్చాయి. ఆ ఉత్తరాలలో తాను పుణ్య క్షేత్రాలలో పూజలు చేయించాలని, చనిపోయిన తన భర్తపేర దానాలు చేయాలని అందుకోసం పెద్ద మొత్తాలలో డబ్బు అవసరమని, తాను పంపిన చెక్కులను బ్యాంకులో మార్చి తాను కనబరచిన అడ్రసుకు డబ్బు తీసుకొని రమ్మని ఆ జాబులలో ఆదేశాలు వుండేవి. బ్యాంకు అధికారులకుగాని ఇతరులకుగాని ఏ మాత్రం అనుమానం వచ్చినా చూపడానికి ఆ జాబులు పనికి వస్తాయని వాటిని వ్రాసి నా అడ్రసుకు నేనే పోస్టు చేయించాను.

ఇందిరాదేవి కర్నూలులో ఉన్నప్పుడు కూడ మా కంపౌండరు ద్వారా నెల నెలా అద్దెలు వసూలు చేయించేవాడిని కాబట్టి ఆ ఉత్తరాలు ముట్టిన అద్దెవాళ్ళు ఎలాంటి సందేహం లేకుండా మా కంపౌండరుకు అద్దె చెల్లించేవాళ్ళు.

ఇంతకు పూర్వం కూడ ఇందిరాదేవి తాలూకు చెక్కులు

మార్చడానికి బ్యాంకుకు నేనే వెళ్ళేవాడిని కాబట్టి ఇచ్చిన చెక్కులు సులభంగా మారిపోయేవి.

నా కార్యాలు నిరాఘాటంగా సాగిపోతుండగా ఇందిరా దేవి కుమారుడు వాసుదేవ్ కర్నూలుకు వచ్చాడు. అంతటితో నా దుర్దశ ప్రారంభమయింది. తన తల్లి జాడ తెలియకపోవడంతో నా వద్దకు వచ్చి ఆమెను గురించి ప్రశ్నించాడు వాసుదేవ్. నేను చెప్పిన సమాధానాలతో తృప్తిపడకుండా నా కార్యకలాపాల గురించి ఆరాలు తీసి నా మీద ఉన్నత పోలీసు అధికారులకు పిటిషన్ పంపేడు. అలాంటి అర్జీల గురించి అధికారులు పట్టించుకోరు అన్న ధీమాతో వున్నాను.

కాని ఒకరోజు ఒక పోలీసు ఆఫీసరు వచ్చి ఇందిరా దేవి గురించి నన్ను ప్రశ్నించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇందిరాదేవి నా వెంట హైదరాబాదుకు వెళ్ళిన సంగతి ఆమె బంధువుల ద్వారా తనకు తెలిసిందని చెప్పడంవల్ల మేము హైదరాబాదుకు వెళ్ళడం, రైల్లో ఆమె స్పృహ తప్పడం, ఆమెను రఘువీర్ హాస్పిటల్లో చేర్పించడం, అక్కడ ఆమె మరణించడం గురించి ఆ ఆఫీసరుకు చెప్పక తప్పలేదు. చెక్కుల్లో ఇందిరాదేవి సంతకాలను ఎవరు ఫోర్జరీ చేశారని, ఆమె వ్రాసినట్లుగా ఉత్తరాలు ఎవరు వ్రాశారని ప్రశ్నించగా నాకు తెలియదని చెప్పేను. నా మాటలను అతడు నమ్మినట్లు కనబడలేదు. అతనికి డబ్బు ఆశ చూపించి గండం దాటాలని ప్రయత్నించాను.

కాని ఆ ఆఫీసరు ఏ ప్రలోభాలకు లొంగకుండా కేసు ఇన్వెస్టిగేట్ చేసి నాకు విరుద్ధంగా వున్న సాక్ష్యాలు సేకరించి నన్ను అరెస్టుచేసి కోర్టులో ఛార్జిషీటు దాఖ

చేశాడు.

ఆ ఛార్జిషీటులో—

నేను ఇందిరాదేవికి విషం ఇచ్చి, నామీద ఎవరికి అనుమానం రాకూడదని చికిత్స చేయించాలన్న మిషతో ఆమెను రఘువీర్ హాస్పిటల్‌కు తీసికెళ్ళానని, తీసుకెళ్ళినా ఆమె స్పృహ తప్పడానికి అసలు కారణం కనిపెట్టడానికి అవకాశం ఇవ్వకుండా హాస్పిటల్ జ్యూనియర్ డాక్టరుతో పేషంటు డయాబెటిక్ కోమాలో వుందని చెప్పి బుద్ధిపూర్వకంగా తప్పుదారి పట్టించి తప్పు వైద్యం చేయించి తద్వారా నేను చేసిన విషప్రయోగానికి వైద్యం జరుగకుండా చేసి ఆమె మరణానికి కారణభూతుడ నయ్యానని నామీద చేయబడిన మొదటి ఆరోపణ.

ఇందిరాదేవి నేను ఇచ్చిన విషంవల్ల హాస్పిటల్లో చనిపోతుందని తెలిసి ఒక పథకం ప్రకారం ఆమె డబ్బును దోచుకొనడానికి వీలుగా ఆమె మరణం గుప్తంగా వుంచాలని హాస్పిటల్ రికార్డులో అందరికి తెలిసిన ఇందిరాదేవి అన్న పేరు వ్రాయించక ఇతరులకు తెలియని విమలాదేవి అన్న పేరు వ్రాయించానని నామీద వచ్చిన రెండవ ఆరోపణ.

శవం తీసికెళ్ళమని డాక్టరు సదానందం టెలిగ్రాము ఇవ్వగా అందుకు సమాధానం వెంటనే టెలిగ్రాము ద్వారా ఇవ్వక సావకాశంగా మరుసటిరోజు మామూలు ఉత్తరం ద్వారా తెలిపానని, ఇందిరాదేవికి తమ్ముడే లేనందువల్ల లేని తమ్ముడిని సృష్టించి, అతడు వచ్చి శవాన్ని తీసికెళ్తాడని అబద్ధాలు వ్రాసి తద్వారా ఇందిరాదేవి శవం రఘువీర్ హాస్పిటల్లో కొన్నాళ్ళపాటు కదలించకుండా వుంచేలాగ చేశానని, తర్వాత ఎవరికైనా అనుమానం వచ్చి శవాన్ని

పోస్టుమార్టమ్ చేయించినా కొన్నిరోజులు గడచిపోవడం వల్ల నేను ఇచ్చిన విషం తాలూకు ఛాయలు కనబడకుండా పోతాయి అన్న ఆలోచనతో పై కనబరచిన విధానం అనుసరించానని నామీద వచ్చిన మూడవ ఆరోపణ.

నేను ఇందిరాదేవికి విషం ఇచ్చి చంపడంవల్లనే నా గుట్టు బయట పడకూడదని ఆమె మరణానంతరం వచ్చి వాకబుచేసిన సబ్ యిన్స్పెక్టరుకు ఇందిరాదేవికి మారు పేరైన విమలాదేవి సైతం ఎవరో తెలియదని చెప్పానని నామీద వచ్చిన మరొక ఆరోపణ.

ఇందుబట్టి ఇందిరాదేవి డబ్బును హస్తగతం చేసుకోవాలన్న దురుద్దేశ్యంతో నేను ఆమెకు వైద్యనిపుణులు సైతం కనిపెట్టలేని వనమూలికలకు సంబంధమైన విషాన్ని ఎదో ఒక రూపంగా ఆమెకు రఘువీర్ హాస్పిటల్లో చేర్పించడానికి పూర్వం ఇచ్చానని, ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం లేకున్నా పై కనబరచిన కారణాలబట్టి నేనే హత్య చేసినట్లుగా నిరూపణ అవుతుందని నామీద హత్యారోపణ చేయబడింది.

నేను ఇందిరాదేవి వ్రాసినట్లుగా జాబులు వ్రాసి ఇండ్ల అద్దెలు వసూలు చేసుకొన్నానని ఆమె సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకుల నుండి డబ్బు తెచ్చుకొని నా స్వంతం చేసుకొన్నానని అందువల్ల నేను ఫోర్జరీ నేరం క్రిమినల్ మిస్ అప్రోప్రియేషన్ నేరంకూడ చేశానని నామీద ఆరోపణ చేయబడింది.

ఈ నేరారోపణలను నిరూపించడానికి సెషన్సుకోర్టులో ప్రాసిక్యూషన్ వారు పలువురు సాక్షులను ప్రవేశపెట్టి సాక్ష్యం చెప్పించారు.

సాక్ష్యం ముగిసిన తర్వాత ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటరు నామీద కేసు రుజువు అయిందని వాదించగా, నా తరఫున నా అడ్వకేటు ప్రాసిక్యూషన్ వాదంలో బలంలేదని, నామీద కేసు రుజువు కాలేదని వాదించాడు.

మరుసటి వాయిదా నాడు జడ్జిగారు తీర్పు చెబుతూ ప్రాసిక్యూషన్ సాక్షులు చెప్పిన సాక్ష్యంబట్టి నేను ఈ హత్యచేసి వుండవచ్చునన్న అనుమానం కలుగుతుందని, కాని కేవలం అనుమానంమీద ఆధారపడి నన్ను శిక్షించ డానికి వీలులేదని, నేను మృతురాలికి విషప్రయోగం చేసి నట్లు ప్రత్యక్ష సాక్ష్యం లేనందువల్లను, పోస్టుమార్టమ్ జరిపిన డాక్టరు సాక్ష్యంబట్టి మృతురాలికి విషప్రయోగం జరిగినట్లు స్పష్టంగా రుజువు కానందువల్లను నాపై వచ్చిన హత్యానేరాన్ని కొట్టివేశారు. కాని నేను ఇందిరాదేవి మరణాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకొని ఫోర్జరీ మరియు క్రిమినల్ మిస్ అప్రోప్రియేషన్ నేరాల ద్వారా అక్రమంగా డబ్బు కైవశము చేసుకొన్న సంగతి రుజువు అయిందని చెబుతూ నాకు పది సంవత్సరాలు శిక్ష విధిం చారు.

హత్యానేరం నామీద రుజువుకాదని, ఇతర నేరాలకు శిక్ష తప్పదని నేను ముందే ఊహించాను. కాబట్టి ఆ తీర్పు నాలో ఎలాంటి సంచలనం పుట్టించలేదు.

నాకు బేడీలు వేసి జైలుకు తీసికెళుతుండగా నా అడ్వకేటు నా వద్దకు వచ్చాడు.

"ఈ తీర్పుపై అప్పీలు దాఖలు చేయదలచుకొన్నారా?" అని ప్రశ్నించాడు.

"ప్రయోజనం ఉంటుందంటారా?" నేను అడిగేను.

"చెప్పడం కష్టం. మీ అదృష్టం బాగుంది ఏదో ఒక లాపాయింటుమీద అప్పీలు గెలువవచ్చు. లేదా శిక్ష తగ్గ వచ్చు. అప్పీలు దాఖలుచేస్తే అది పరిష్కారం అయ్యేదాక శిక్షను నిలుపుదలచేసి మిమ్ముల్ని జామీనుమీద వదలిపెట్టే అవకాశం వుంది."

"అయితే అప్పీలు దాఖలు చేసే ఏర్పాట్లు చేయండి" అన్నాను.

హైకోర్టులో నా తరఫున అప్పీలు దాఖలు చేయ బడింది. కోర్టు నన్ను జామీను మీద విడుదల చేసింది.

హైదరాబాదు సెంట్రల్ జైలునుండి విడుదల అయిన నేను కర్నూలుకు తిరిగి వచ్చాను. నన్ను సంఘ బహిష్క రణ చేయబడ్డ వ్యక్తిలాగ అందరు నిరసనగా చూడటంతో నా జీవితం దుర్భరంగా తయారయింది.

ఇది ఇలా వుండగా నేను మరొక ఇబ్బందికి గురి అయ్యాను. కొన్నేళ్ళుగా నా ఇంట్లోవుంటూ నాకు వండి పెట్టి నా ఇంటి పనులు చూచుకొంటున్న నౌకరు రంగన్న నాకు శిక్ష పడటంతో నా ఇల్లు వదలిపెట్టి ఎక్కడికో వెళ్ళి పోయాడు. భార్య చనిపోవడంవల్లను, ఉన్న ఒక్కకొడుకు ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్ళడం వల్లను, కొన్ని సంవత్సరాలుగా ఒంటరి జీవితం గడుపుతున్నాను. అందువల్ల వంటావార్పులకు, ఇంటిపనులకు నౌకరు లేకుండా ఒక్కరోజు గడపడం కూడ కష్టం. నేను వంట మనిషి అన్వేషణలో వుండగా ఒకడు వచ్చి తాను ఒక ఆఫీసరు ఇంట్లో వంటవాడిగా పనిచేశానని, ఆ ఆఫీసరుకు బదిలీ రావడంవల్ల తాను ఖాళీగా వున్నానని, నా ఇంట్లో వున్న వంటవాడు వెళ్ళిపోయినట్లు తెలిసి ఆ ఉద్యోగం

కోసం వచ్చానని చెప్పేడు. నాకు వెంటనే వంటమనిషి అవసరం వున్నందువల్ల అతన్ని పనిలో చేరిపొమ్మన్నాను.

వంటవాడు రాములన్న శుభ్రంగా వుంచి వంటపనులు చక్కగా చేస్తున్నందువల్ల అలాంటి నౌకరు దొరికినందుకు సంతోషించాను. కొన్నాళ్ళు గడచిపోయాయి.

రాత్రి భోజనానంతరం నిద్రపోదామని మంచంమీద పడుకోగానే కడుపులో బాధగా అనిపించింది. మసాలాలు దట్టించి చేసిన మాంసం వేపుడు తినడంవల్ల కడుపునొప్పి వచ్చిందనుకొని నొప్పి తగ్గడానికి రెండు మాత్రలు వేసుకొని మళ్ళీ పడుకొన్నాను. నొప్పి తగ్గకపోగా మరింత అధికం అయింది.

"రాములన్నా, ఎక్కడున్నావురా? ప్రక్కవీధిలో వున్న డాక్టరు రాఘవేంద్రరావుకు ఫోనుచేసి వెంటనే రమ్మని చెప్పు" అని కేకవేశాను.

"రాములన్న లేడు. వాని పాత్ర ముగిసినందువల్ల రంగం నుండి విష్క్రమించాడు."

గంభీర స్థాయిలో ఆ మాటలు వినపడగానే ఆవైపు తిరిగి చూచాను. ఎదురుగా నిలుచున్న ఇందిరాదేవి కుమారుడు వాసుదేవ్‌ను చూడగానే నాలో తత్తరపాటుపుట్టింది.

"రాములన్న ఎక్కడికివెళ్ళాడు? ఇది నాటకమా, రంగం నుండి పాత్ర నిష్క్రమించడానికి? నీవు ఏమి మాట్లాడుతున్నావో నాకు బోధపడటంలేదు. నీవు ఎందుకొచ్చావు ఇక్కడికి?" అన్నాను వాసుదేవ్‌వైపు కోపంగా చూస్తూ.

"అవును. ఇది నాటకమే. రాములన్న ఈ నాటకంలో ఒక పాత్రధారి. వాడు ఎవరనుకొన్నావు? వంటవాడుగా నీ ఇంట్లో ప్రవేశించిన నా మనిషి. కొన్నాళ్ళపాటు నమ్మకంగా పనిచేసి సమయంచూచి నీ భోజనంలో నేను ఇచ్చిన

చూర్ణాన్ని కలిపి వడ్డించమని చెప్పేను. తనకు అప్పగించిన పని ముగిసిందని వాడు వచ్చి చెప్పగా నీ మరణాన్ని కళ్లారా చూద్దామని వచ్చాను. ఇప్పుడు నా మాటలకు అర్థం బోధ పడిందా?" అన్నాడు వాసుదేవ్ విషపూరితంగా నవ్వుతూ.

"నాకు విషప్రయోగం జరిగిందా? వెంటనే పోలీసులకు ఫోనుచేసి నిన్నూ ఆ రాములన్నను అరెస్టు చేయిస్తాను" ఉద్రేకంగా అంటూ లేవడానికి ప్రయత్నించాను.

కాని శక్తి కోల్పోయి నిస్సత్తువగా వుండటం మూలాన మంచం నుండి లేవలేకపోయాను. పరిస్థితి అర్థం కాగానే నాలో ప్రాణభీతి పుట్టింది. ఇరుగుపొరుగు వారిని ఆకర్షించి వాళ్ళద్వారా వైద్యసహాయం పొందాలన్న ప్రయత్నంగా గట్టిగా కేకవేయడానికి పూనుకొన్నాను. కాని శబ్దం నా గొంతుదాటి రాలేదు. నాకు ఇచ్చిన విషం అప్పుడే పని చేయడం మొదలుపెట్టిందని నాకు తెలిసిపోయింది. అస హాయంగా నేను వాసుదేవ్ వైపు చూస్తూ వుండిపోయాను.

"నీకు ఇచ్చిన విషం నీ నాడీమండలం మీద ప్రభావం చూపడంతో నీ అవయవాలు చచ్చుపడిపోయాయి. అందు వల్ల నీవు పోలీసులకు ఫోను చేయలేకపోయావు; ఇరుగు పొరుగుల సహాయం కోసం కేక వేయలేకపోయావు. ఇక కొన్ని నిమిషాలలో నీకు స్పృహతప్పిపోతుంది, ఆమీదట కొన్ని గంటలలో నీ మరణం తప్పదు" అన్నాడు వాసు దేవ్ వికటంగా నవ్వుతూ.

ఒక డాక్టరుగా నాకు నా పరిస్థితి స్పష్టం అయింది. క్షణ క్షణానికి నేను చావుకు దగ్గర అవుతున్నాను. తక్షణమే వైద్య సహాయం అందకపోతే నేను చనిపోవడం తథ్యం. ఆఖరి ప్రయత్నంగా నా ప్రాణాలు కాపాడమని ప్రాధేయ పడినట్లుగా నా శక్తినంతా కూడదీసుకొని చేతులెత్తి నమ

స్కారం చేశాను.

నన్ను, నా నమస్కారాన్ని ఖాతరు చేయకుండా వాసు దేవ్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు:

"హైదరాబాదు ప్రయాణానికి కొద్దిరోజుల క్రితం నీవు శ్రీశైలం వెళ్ళినట్లు నాకు ఇటీవల తెలిసింది. నాకు అనుమానంవచ్చి కొన్నాళ్ళక్రితం నేనుకూడ శ్రీశైలంవెళ్ళాను. చుట్టుపట్ల వున్న కోయగూడెములకు వెళ్ళి వాకబు చేయగా నీవు ఒక కోయదొర వద్ద కొన్ని విషపూరితములైన మొక్కలను తెచ్చుకొన్నావని తెలిసింది. ఆ మొక్కలను ఎండబెట్టి వాటి ఆకులను చూర్ణంచేసి ఆహారంలోకాని, పానీయంలోకాని కలిపి ఇస్తే అది పుచ్చుకొన్న వ్యక్తి కొన్ని గంటలలో చనిపోతాడు. నీవు ఆ ఆకుల చూర్ణాన్ని మా తల్లికి ఏదో ఒక రూపంలో హైదరాబాదు ప్రయాణమప్పుడు ఇచ్చావు. ఆ విషానికి త్వరలో శరీరంలో కలిసిపోయే గుణం వుండబట్టి, ఆ విషపు లక్షణాలు ఏమిటో వైద్య నిపుణులకు సైతం తెలియకపోవడంబట్టి చనిపోయిన కొన్నిరోజుల తదనంతరం మా తల్లి శవాన్ని పోస్టుమార్టం పరీక్షచేసినా విషపుసూచనలను డాక్టర్లు కనిపెట్టలేకపోయారు. అందువల్ల నీవు మా తల్లిని హత్యచేసినా న్యాయస్థానంలో శిక్ష తప్పించుకోగలేవు."

మరణానికి చేరువ అవుతున్న నావైపు క్రూరంగా చూస్తూ వాసుదేవ్ మళ్ళీ అన్నాడు.

"నీకు 'పొయటిక్ జస్టిస్' అన్న పదాలకు అర్థం తెలుసా? హత్యచేసినా నీవు న్యాయస్థానంలో మరణశిక్ష తప్పించుకోగలేవు. కాని ఏ విషంతో మా తల్లిని చంపావో నేను కొండదొర వద్ద సేకరించిన ఆ విషంవల్లనే నీవు మరణించబోతున్నావు. విచిత్రంగా వుందికదూ? ఇదే

పొయటిక్ జస్టిస్.''

మరణ ఘడియలు లెక్కపెట్టుకొంటున్న నావైపు తీవ్రంగా చూస్తూ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

“నీవు చనిపోయిన తర్వాత నీ శవం కుళ్ళి దుర్గంధం వేసినప్పుడే ఇతరులకు నీ మరణం గురించి తెలుస్తుంది. అప్పుడు నీ శవాన్ని పోస్ట్‌మార్టమ్ ఎగ్జామినేషన్ చేసినా నీవు మా తల్లిలాగ ఏ కారణంగా చనిపోయావో డాక్టర్లు కనిపెట్టలేరు. కాబట్టి నామీద కేసు వస్తుందని, నాకు శిక్ష పడుతుందని భ్రమించబోకు.''

ఆ క్షణంలో నా మనోచక్షువులకు రైల్వే కంపార్టుమెంటులో కూర్చున్న ఇందిరాదేవి ఆకృతి కనబడసాగింది. ఆమెకు నలతగా వుందని చెప్పగా విషపూరితమైన చూర్ణాన్ని దట్టించి వుంచిన రెండు క్యాప్సూల్స్ నేను ఆమెకు ఇచ్చిన దృశ్యంకూడ కనబడుతుండగా నాకు స్పృహ తప్పిపోయింది. □

ప్రత్యక్షం!!

నకిలీ

వసుంధర

"సేఠ్ బిహారీమల్ నుంచి వజ్రాలహారం కాజేయడమా? అది అసాధ్యం" అన్నాడు సుబ్బారావు.

"ఎందుకని?" అన్నాడు గోపీచంద్.

"ఆ వజ్రాలహారం ఖరీదు ఎనభయి లక్షలు. అది మూడు తరాల నుంచి ఆ యింట్లో ఉంటోంది. ఎందరో

ఆ హారం కొనాలనుకున్నారు. విహారీమల్ ససేమిరా అమ్మనన్నాడు" అన్నాడు సుబ్బారావు.

"అయితే?"

"ఆ హారాన్ని సేర్ చాలా భద్రంగా దాస్తున్నాడు."

గోపీచంద్ నవ్వి, "ఎవడయినా తన సొమ్మును భద్రంగానే దాస్తాడు. అంతమాత్రాన మనకు సాధ్యంకాక పోతుందా?" అన్నాడు.

"సేర్ తీసుకున్న భద్రతలు నీకు తెలియక ఇలా మాట్లాడుతున్నావు. ఆ హారం ఒక ఇనప్పెట్టెలో ఉంది. ఇనప్పెట్టెకి మొత్తం పన్నెండక్షరాలు ఎనిమిది అంకెలతో కూడిన కోడ్ ఉంది. ఆ కోడ్ సేర్‌కి తప్ప ఇంకెవరికీ తెలియదు. ఇనప్పెట్టె తెరిచాక సేర్ కాక మరెవరి చేయి ఇనప్పెట్టెకి తగిలినా యిల్లంతా మ్రోగిపోయేలా అలారం...." ఆగాడు సుబ్బారావు.

"ఓస్. ఇంతేనా! పవర్ కట్ చేస్తాను...." అన్నాడు గోపీచంద్ తేలికగా.

"ఆ అలారం బ్యాటరీమీద పని చేస్తుంది. బ్యాటరీ కనెక్షన్ ఒక ఇనప్పెట్టె లోపలే ఉంటుంది" అన్నాడు సుబ్బారావు.

గోపీచంద్ క్షణమాలోచించి, "ఇంతకీ నువ్వు చెప్ప దల్చుకున్న దేమిటి? ఆ హారం నీ క్కావాలా, అక్కర లేదా?" అన్నాడు.

"ఆ హారం ఎవరికయినా కావాలనే ఉంటుంది. కానీ అందని మ్రాని పండ్ల గురించి తెలుసుకోవాలి కదా!" అన్నాడు సుబ్బారావు.

"అందుకే నాకు పొట్టివాళ్ళంటే చిరాకు" అన్నాడు

గోపీచంద్.

"అయిదడుగుల పదంగుళాల నువ్వు ఆరడుగులవాడ్ని నన్ను పొట్టివాడంటావా?" అన్నాడు సుబ్బారావు వెటకారంగా.

"సేఠ్ బిహారీమల్ ఇనప్పెట్టెలోని వజ్రాల హారం నీకు అందని పండు కావచ్చు. నాక్కాదు. ఇప్పుడు చెప్పు ఎవరు పొట్టివాళ్ళో!"

"కబుర్లు చెప్పడం కాదు. రుజువు చేయాలి!"

"చేస్తాను. కానీ అందుకు ప్రతిఫలం పదివేలంటే చాలదు."

"ఎంత కావాలి? పాతికవేలా?"

"లక్ష రూపాయలు...."

"లక్ష రూపాయలే!" అన్నాడు సుబ్బారావు.

"లక్షరూపాయ లివ్వలేని వాడికా హారం అందని మ్రానిపండే అవుతుంది" అన్నాడు గోపీచంద్.

"అయితే నేను మా బాస్‌తో మాట్లాడి చెబుతాను."

"నువ్వు మీ బాస్‌తో ముందే మాట్లాడవలసింది."

"నీవల్ల యీ పని సాధ్యపడుతుందని ముందుగా నాకు తెలియదు కదా! ఆ వజ్రాలహారం మీద చాలాకాలంగా మా బాస్ కన్నుంది. ఆ మాట యధాలాపంగా నీతో అంటే నువ్వది బజార్లో డబ్బిచ్చి కొనుక్కోవడమన్నంత సింపుల్ అనేశావు. ఇప్పటికీ నమ్మకం లేదు కానీ ఏ పుట్టలో ఏ పాముందో చూడాలి కదా!"

"ఈ ప్రపంచంలో నాకు అసాధ్యమన్నది లేదు. ఇప్పుడయినా బాస్‌తో మాట్లాడేముందా విషయం గుర్తుంచుకో!" అన్నాడు గోపీచంద్.

2

మూడేమూడు కుర్చీలున్న చిన్నగది.

ఒక కుర్చీలో బాస్, మిగతా రెండు కుర్చీల్లోనూ గోపీచంద్, సుబ్బారావు లున్నారు.

"మొత్తం లక్షరూపాయలూ నాకు అడ్వాన్సుగా యివ్వాలి" అన్నాడు గోపీచంద్ కచ్చితంగా.

"డబ్బు తీసుకుని నన్ను మోసం చేస్తే?"

"నేను మిమ్మల్ని మోసం చేయలేను. ఆ విషయం మీకు తెలుసు హారం తీసుకున్నాక మీరు నన్ను మోసం చేసే అవకాశముంది. అదీ మీకు తెలుసు."

బాస్ నవ్వి, "బిహారీమల్ ఇంట్లో వజ్రాలహారం కొట్టేయగలవాడివి, నన్ను మోసం చేయలేవూ?" అన్నాడు.

"పండించే రైతుకు తిండికి లోటు. చెమటోడ్చే కూలీకి ఆకలి బాధ. వీళ్ళిద్దరూ లేకుంటే వ్యాపారస్థుడు బ్రతకలేడు. ఆ వ్యాపారస్థుణ్ని వైభవంగా బ్రతికించే వీళ్ళు తాము మాత్రం బ్రతకలేక బ్రతుకుతూంటారు. ఇప్పుడు మీరు వ్యాపారస్థుడు, నేను శ్రామికుణ్ని" అన్నాడు గోపీచంద్.

"చాలా తెలివిగా మాట్లాడుతున్నావు. ఇంత తెలివయిన వాడు నన్ను మోసగించడని నేను నమ్మలేను" అన్నాడు బాస్.

"అందుకో ఉపాయముంది" అన్నాడు గోపీచంద్.

"ఏమిటది?" కుతూహలంగా అడిగాడు బాస్.

"బ్యాంకులో నా పేరున లక్ష రూపాయలు జమ చేయండి. ఆ డబ్బు నా అకౌంటును చేరుకుంటుంది. బ్యాంకులోంచి నేనా డబ్బును విత్‌డ్రా చేయకుండా మీరు

నన్నాపగలరు. మీ పని అయ్యేదాకా మీరు నామీదో కన్నేసి ఉంచనక్కరలేదు. బ్యాంకులోని నా అకౌంటుమీద వేయ గలిగితే చాలు...."

"నువ్వు నన్ను మోసం చేస్తే నా డబ్బు నేను వెనక్కి తీసుకునే దెలా?" అన్నాడు బాస్.

"ఒకసారి నా అకౌంట్‌లోకి చేరేక ఆ డబ్బు మీది కాదు. అలాగే అది నా డబ్బే అయినా నేను విత్‌డ్రా చేయలేను - మీకిచ్చిన మాట నిలబెట్టుకునేవరకూ! అందు కని నాకూ మిమ్మల్ని మోసం చేయడంవల్ల ప్రయోజన ముండదు. అర్థమయిందా?" అన్నాడు గోపీచంద్.

"నీ ఉపాయం బాగుంది" అన్నాడు బాస్.

"అయితే సరే! మీరు నా అకౌంట్‌లో డబ్బు జమ చేసి నన్ను మర్చిపొండి. వారంరోజుల్లోగా వజ్రాలహారం మీకు చేరుతుంది" అన్నాడు గోపీచంద్.

3

"ఏం చేస్తున్నావురా. ఎంత పిలిచినా భోజనానికి రావు?" అంటూ గోపీచంద్ గదిలోకి ప్రవేశించింది తల్లి.

ఏదో వైరు సోల్డరింగ్ చేస్తున్న గోపీచంద్ ఉలిక్కి పడి, "ఏమిటమ్మా, మంచి సమయంలో డిస్టర్బ్ చేశావు!" అన్నాడు.

"భోజనానికి పిలిస్తే డిసర్బెన్సేమిట్రా? ఈ ప్రపంచంలో ఏం చేసినా తిండికోసమేగా...." అంది తల్లి.

గోపీచంద్ తల అడ్డంగా వూపి, "నేనేం చేసినా నీ కోసమే చేస్తున్నానమ్మా!" అన్నాడు.

"ఏడిశావులే - నా కోసం ఏమైనా చేయడానికి నేను నిన్ను ధన కనక వస్తు వాహనాలడిగానా?" అంది తల్లి.

గోపీచంద్ తల అడ్డంగా ఊపాడు.

"పోనీ నాకేమయినా రోగముందా? డబ్బుపోసి బాగు చేయించడానికి!" అంది తల్లి మళ్ళీ.

"కాదమ్మా - నువ్వు నన్నేమీ అడగలేదూ, గుర్తు చేసుకో!"

"లేదు, ముందు భోజనానికి పద! వస్తున్నాను. ఈ వయసులో ఇంకా నీకు వండిపెట్టలేక .... పెళ్ళి చేసుకోరా అంటే వినవు ...."

"అదిగో, ఇప్పుడే అన్నావేమీ అడగలేదని!"

తల్లి బుగ్గలు నొక్కుకుని, "అదా నువ్వనేది? కోడలు పిల్లని తేరా అంటే అది నాకోసంట్రా! ఏం తెలివిగా మాట్లాడుతున్నావురా!" అంది.

"అమ్మా! నీ బ్రతుకే నాకోసం అంకితం చేశావు. నా కోసం ఏం చేసుకోవాలనుకున్నా అది నీ కోసమే కదా!"

"సరేలే, కాలికి వేస్తే వేలికి, వేలికి వేస్తే కాలికి .... పద, భోజనానికి పద" అని ఆగి, "అయినా పెళ్ళి చేసుకోవాలంటే అంత కష్టపడాలా ఏమిటి?" అంది తల్లి.

"నా బ్యాంకు అకౌంట్‌లో లక్షరూపాయలైనా ఉంటే గానీ నన్ను పెళ్ళి చేసుకోనంది సరళ!" అన్నాడు గోపీ చంద్.

"అది తప్ప నీకింకెక్కడా పిల్లలే దొరకలేదుట్రా!" అంది తల్లి.

"అమ్మా! నా బ్యాంకు అకౌంట్‌లో లక్ష రూపాయలూ ఉన్నాయనుకో. అప్పుడు నేను సరళను పెళ్ళి చేసుకోనా, వేరే పిల్లను వెతుక్కోనా?" అమాయకంగా అడిగాడు గోపీచంద్.

"దానికేంరా, నిక్షేపంలాంటిపిల్ల! డబ్బుంటే వేరే

పిల్లని వెతుక్కోవడ మెందుకు?" అంది తల్లి.

"అందుకే నేను వేరేపిల్లను వెతుక్కోవడం మాని డబ్బును వెతుక్కుంటున్నాను" అన్నాడు గోపీచంద్.

"నీతో వాదించడం కష్టం బాబూ, పద భోజనానికి!" అంది గోపీచంద్ తల్లి.

అతడు చేస్తున్న పని మానేసి తల్లి వెనుక నడిచాడు.

4

అర్ధరాత్రి ఒంటిగంటయింది.

సేఠ్ బిహారీమల్ ఇంటి ముందు పెద్ద గేటు. ఆ గేటుకు పక్కగా ఓ బల్ల. దానిమీద గూర్ఖా.

గూర్ఖా కునికిపాట్లు పడుతున్నాడు.

గోపీచంద్ వెనుక నుంచి గూర్ఖాను సమీపించి ఓ రుమాలు తీసి అతని ముక్కువద్ద ఉంచాడు.

అంతే! గూర్ఖా తల వెనక్కు వాల్చేశాడు.

గోపీచంద్ గూర్ఖాని బల్లమీద కూర్చోపెట్టి తలను గోడకు ఆన్చాడు. చూసేవాళ్ళకు గూర్ఖా బుద్ధిగా కూర్చున్నా డనే అనిపిస్తుంది.

గూర్ఖా జేబులన్నీ తడిమితే అతడికి తాళంచెవి దొరికింది. ఆ తాళంచెవితో గేటు తాళంతీస్తూ అతడు గేటుకు తగిలించి ఉన్న పెద్ద బోర్డును చూశాడు.

"బివేరాఫ్ డాగ్స్!"

ఆ యింట్లో రెండు పెద్దకుక్కలున్నాయనీ అవి ఇంటి చుట్టూ రాత్రింబవళ్ళు పహరా యిస్తూంటాయనీ ఇంటి వాళ్ళకు తెలియకుండా కొత్తవాళ్ళెవరైనా గేటు తీసుకుని లోపల ప్రవేశిస్తే అవి వాసన పసిగట్టి మీదపడి చీల్చి చెండాడుతాయనీ గోపీచంద్‌కి తెలుసు.

గేటు తాళాన్నతడు తన జేబులోనే ఉంచుకున్నాడు.

జేబులోంచే అతడొక చిన్న కాల్క్యులేటరువంటి సాధనం తీశాడు. దానిపై ఒకమీట నొక్కి తిరిగి జేబులో ఉంచుకుని గేటు తీశాడు.

చిన్నగా చప్పుడయింది.

అతడు తిరిగి గేటుమూశాడు. కానీ తాళం వేయలేదు.

గూర్ఖా అలా స్పృహలేకుండా పడివున్నాడు.

గోపీచంద్ చకచకా ముందుకు నడిచాడు.

ఎక్కడా కుక్కల జాడలేదు.

అతడు తనలో తాను నవ్వుకున్నాడు.

కుక్కలు రావని అతడికి తెలుసు.

ఈ ప్రపంచంలో బరువున్న ప్రతిపదార్థానికీ ఆకర్షణ శక్తి ఉంటుంది. ప్రతి ఆకర్షణ శక్తీ తరంగ రూపంలో పయనిస్తుంది.

ప్రతి మనిషికీ కూడా రూపం బరువు ఆధారంగా ఆకర్షణశక్తి ఉంటుంది. అతడి శరీరంనుంచి ఆకర్షణశక్తి కిరణాలు తరంగాల రూపంలో పయనిస్తూంటాయి. మనిషి యిష్టాయిష్టాలకు, రాగద్వేషాలకు, విచిత్ర ప్రవర్తనకు ఈ తరంగాలే కారణం!

మనిషి మనిషికీ వేలిముద్రలు వేరైనట్లే ఈ తరంగ ప్రసరణ విధానం కూడా వేరుగా ఉంటుంది. సరైన సాధనముంటే కేవలం తరంగ ప్రసరణ ఆధారంగా కళ్ళు మూసుకుని కూడా మనుషుల్ని గుర్తించవచ్చు.

కొన్ని పశువులు, పక్షులు మనుషుల్ని ఆకర్షణ శక్తి కిరణ తరంగాల ద్వారా పసిగడతాయి. వాటిలో కుక్కలు ముఖ్యమైనవి!

గోపీచంద్ గేటు తీయగానే అతడి వాసన సోకి, పసిగట్టి కుక్కలు దూరాన్నుంచే పరుగున రావాలి!

అలా జరుగలేదంటే .... అందుక్కారణం ....

గోపీచంద్ తనలో తను నవ్వుకున్నాడు.

అతడు జేబులో ఉంచుకున్న కాల్క్యులేటర్‌వంటి సాధనం అతడినుంచి వెలువడే ఆకర్షణ శక్తికిరణ తరంగాల ప్రభావాన్ని న్యూట్రలైజ్ చేస్తుంది. అంటే తరంగ ప్రసరణ ద్వారా అతడి ఉనికిని తెలుసుకోవడం అసాధ్యం!

అంతేకాదు!

మనిషినుండి వచ్చే ఆకర్షణ శక్తి కిరణ తరంగాలు పశుపక్ష్యాదుల మెదడుపై ప్రభావాన్ని చూపుతాయి. అందుకే కుక్కలు మనుషుల్ని చూస్తే రియాక్టవుతాయి. శిక్షణనుబట్టి. అవసరాన్నిబట్టి అవి తమ రియాక్షన్ను నదుపు చేసుకోగలవు. ఊరకుక్కలు పిచ్చికుక్కలుగా మారితే తప్ప ప్రతి మనిషినీ భరించగలవు. పెంపుడు కుక్కలు యజమానులను, వారి యిష్టులను భరించగలవు.

ఇప్పుడు గోపీచంద్ శరీరంనుండి ఎటువంటి తరంగాలూ ప్రసరించబడనట్లే లెక్క! అందువల్ల కుక్కలకు సంబంధించినంతవరకూ అతడు మనిషికాడు. రాయి, రప్ప. చెట్టు, చేప వగైరాలతో సమానం!

గోపీచంద్ ఉత్సాహంగా యింట్లో అడుగుపెట్టాడు.

ఇంటిచుట్టూ ఉన్న ఆవరణ పెద్దది. ఇల్లు చిన్నదే!

గూర్ఖా. కుక్కలు ఉండగా ఆ యింట్లో వేరెవ్వరూ ప్రవేశించలేరు.

అందుకే ఆ యింటి తలుపులకు తాళముండదు.

గోపీచంద్ తలుపు తోసుకుని లోపల అడుగుపెట్టాడు.

చిన్నహాలు! ఇంట్లో పనివాళ్ళెవ్వరూ లేరు.

ఆ యింట్లో బిహారీమల్, అతడి భార్య, కొడుకు,

కోడలు మాత్రం ఉంటున్నారు. పనివాళ్ళు ముగ్గురున్నారు కానీ యింట్లో ఉండరు. ఉదయం ఆరింటికి వచ్చి రాత్రి ఎనిమిదింటికి వెళ్ళిపోతారు.

హాలు చుట్టూ గదులు.... అంతే ఆ యిల్లు!

ఏ యే గదుల్లో ఎవరెవరుంటారో గోపీచంద్‌కు తెలుసు. తెలుసుకోవడం పెద్దగా కష్టమూకాదు. బిహారీమల్ ఆ యింటి గురించిన రహస్యాలేమీ ఉంచలేదు.

ఇనప్పెట్టె ఉన్న గదిలో అడుగుపెట్టాడు గోపీచంద్.

గదిలో సన్నటిదీపం వెలుగుతుంది.

గది మధ్యన మెత్తటి పరుపులు. గదికి ఒక మూలగా ఇనప్పెట్టె. దాని సైజు ఎంతో పెద్దదికాదు. మూడడుగుల ఎత్తు, అడుగున్నర వెడల్పు ఉంటుంది. చూడ్డానికి మందంగా కనబడుతోంది.

గోపీచంద్ గదిలో చుట్టూ చూశాడు.

గోడలకు దేవుడి పటాలున్నాయి.

ముఖ్యంగా ఇనప్పెట్టికి ఎదురుగా గోడమీద ఒక ఫొటో ఫ్రేం! నాలుగంగుళాల మందంలో ఉన్న ఆ ఫ్రేం లోపల లక్ష్మీదేవి బొమ్మవుంది. ఆ దేవత తామరపూవులో కూర్చుని చేతిలోంచీ బంగారు కాసులు కురిపిస్తూంది. గోపీచంద్ ఆ పటంవంకా, ఇనప్పెట్టివంకా మార్చి మార్చి చూశాడు.

అతడి ముఖం వికసించింది.

అతడు పటందాకా నడిచి రెండు చేతులూ ఎత్తి ఫ్రేంను గోడమీంచీ తీశాడు. భుజానికి వ్రేలాడుతున్న ఫ్యాన్సీ బాగులోంచి స్క్రూడ్రైవరు వంటి పరికరం తీసి ఆ ఫ్రేం విప్పి అద్దాన్ని తొలగించాడు.

సరిగ్గా పదినిముషా లక్కడున్నాడు. ఆ సమయంలో

చిన్న చిన్న ఎలక్ట్రానిక్ చిప్పను, కొన్ని కార్డు సైజు పరికరాలను ఫ్రేంలో బిగించి తిరిగి అద్దాన్ని యధా ప్రకారం పెట్టేసి ఆ ఫ్రేంను గోడకు తగిలించాడు.

చూస్తూంటే ఆ ఫ్రేంలోని లక్ష్మీదేవి ఎప్పటికిలాగే ఉంది.

గోపీచంద్ మరోసారి ఆ ఫ్రేంనీ, ఇనప్పెట్టినీ పరీక్షగా చూసి వచ్చినదారినే వెనక్కు వెళ్ళిపోయాడు.

వెళ్ళేటప్పుడు గేటుకు తాళంవేసి ఇంకా స్పృహతప్పి ఉన్న గూర్ఖా జేబులో తాళంచెవి ఉంచాడు.

5

"బాస్ చాలా కోపంగా ఉన్నాడు" అన్నాడు సుబ్బారావు.

"ఎందుకని?" అన్నాడు గోపీచంద్

"అప్పుడే మూడురోజులయింది, లక్ష రూపాయలు నీ అకౌంట్లోవేసి; ఇంతవరకూ నీ నుంచి ఏ సమాచారం లేదు"

"నాకు వారంరోజులు టైముందిగా"

"ఉంటేమాత్రం ఈ పనికి వారంరోజులు కావాలా?"

"అదిగేముందే నేను ప్రతి నిముషాన్నీ లెక్కించి గడువు అడుగుతాను. వారంరోజులు దాటిపోతే నన్నను మానించాలి కానీ ఈలోగా నన్ను వేధించడం అన్యాయం!"

"కానీ యీ పనికి వారంరోజులు కావాలా?"

"ఇది మీకు సాధ్యంకాని పని అనేకదా నా కప్ప జెప్పారు?"

"అవుననుకో! కానీ వివియన్ రిచర్డ్స్ సెంచరీ చేయడానికి నూరు బాల్సు తీసుకుంటేఅది చాలా ఎక్కువన దానికి నేను క్రికెట్ ప్లేయర్ని కానవసరం లేదుకదా!"

"నిజమే! కానీ ఆ వివియన్ రిచర్డ్స్ వన్‌డేల్లో ఒక లాగా, టెస్టుమ్యాచిల్లో మరొకలాగా ఆడతాడని నీకు తెలియదా?"

సుబ్బారావు చిరాగ్గా "బౌలర్ బాల్‌వేస్తే డిఫెన్సాడే వాడు ఎటాకింగ్‌స్ట్రోక్స్ చేస్తాడని నమ్మలేంకదా! నువ్వసలింతవరకూ ఏ ప్రయత్నమూ చేసినట్లు లేదు" అన్నాడు.

"అంటే?"

"నువ్వు డబ్బు నీ అకౌంట్లో జమ కాగానే సంతృప్తి పడి ఊరుకున్నావనీ, నెమ్మదిగా ఎప్పుడో ఆ డబ్బు విత్‌డ్రా చేసుకుంటావనీ బాస్ అనుమానం. ఆయన అనుమానంలో తప్పులేదు. లేకుంటే డబ్బు తీసుకున్నాక మూడు రోజులు వృధా పోనిచ్చేవు" అన్నాడు సుబ్బారావు.

"నీ బాస్ అంత చవటదద్దమ్మేంకాదు. ఆయన నన్ను వేయి కళ్ళతో కనిపెడుతున్నాడు. మొన్న నేను అర్ధరాత్రి పూట బిహారీమల్ ఇంట్లో చొరబడడం ఆయనకు తెలిసే ఉంటుంది. నేనా వజ్రాలహారం అప్పుడే తెచ్చి దాచుకున్నాననీ, లేదా అది తేవడం నావల్లకాదని అప్పుడే గ్రహించేశాననీ ఆయన అనుమానం. కానీ ఆ రెండూ నిజంకావు. ప్రస్తుతానికి నేను కోడ్ నంబరు తెలుసుకువచ్చేనంతే! నీ బాస్‌కంత తొందరగావుంటే ఆ నంబరుపయోగించి ఇనప్పెట్టె తలుపులు తెరిచి హారాన్ని తనే తెచ్చుకోమను. లేదా వారంరోజులు గడువయ్యేదాకా ఆగమను" అన్నాడు గోపీచంద్.

"కోడ్ నంబర్ తెలుసుకున్నావా ఎలా?"

"ఏ యినప్పెట్టె ముందైనా నిలబడి కళ్ళు మూసుకుని ఒక్క నిముషం నిలబడ్డానంటే చాలు దేవి నాకు అది తెరిచే

ఉపాయం చెవిలో చెబుతుంది" అన్నాడు గోపీచంద్ నవ్వుతూ.

అయితే లక్ష్మీదేవి ఫొటో ఫ్రేంలో అతడమర్చిన మినీ ట్రాన్స్మిటర్ ఆ గదిలో జరిగే విశేషాలన్నీ అతడింటికి సిగ్నల్స్‌గా పంపుతూంటే అతడవి టీవీలో వాచ్ చేశాడనీ, అందులోనే బిహారీమల్ ఇనప్పెట్టె తెరుస్తున్న దృశ్యం తను చూశాడనీ అతడు సుబ్బారావుకి చెప్పలేదు.

"అయితే కోడ్ నంబరు చెప్పు" అన్నాడు సుబ్బారావు.

గోపీచంద్ ముందు తటపటాయించినా, "లక్షరూపాయలిచ్చినందుకీ మాత్రం రహస్యం తెలుసుకోవచ్చులే!" అంటూ కోడ్ నంబరు చెప్పి, "నీకు వచ్చిన సమాచారం తప్పు. ఇందులోని అక్షరాలు పదకొండు. అంకెలు తొమ్మిది" అన్నాడు.

సుబ్బారావాశ్చర్యంగా, "ఇది సరైన నెంబరేనా?" అన్నాడు.

"కావాలంటే వెళ్ళి పరీక్షించుకోవచ్చు"

"వద్దులే. నువ్వే వెళ్ళి హారంకూడా తీసుకుని రా!" అన్నాడు సుబ్బారావు.

6

మధ్యాహ్నం రెండుగంటల సమయం.

గోపీచంద్ ఆగాడు బిహారీమల్ ఇంటి గేటుముందర.

వాచ్‌మన్ లేచి నిలబడి, "సాబ్ ఇంట్లోలేరు" అన్నాడు.

"ఊళ్ళోకూడా లేరని నాకు తెలుసు. ఎందుకంటే ఆయనే నన్ను పంపారు. మేలురకం వజ్రాలు కొన్ని ఇంట్లో యిమ్మన్నారు" అన్నాడు గోపీచంద్.

అతడు మర్యాదస్థుడిలా కనబడుతూండడంవల్ల వాచ్

మన్ గేటుతీస్తూ, "ఒక్కనిమిషం ఇక్కడే వుంటే లోప లకు ఫోన్ చేస్తాను. ఆవరణలో కుక్క పహారా తిరుగు తోంది. అది మిమ్మల్ని బ్రతికనివ్వదు—ఇంట్లో వాళ్ళెవ రైనా వస్తే తప్ప!" అన్నాడు.

"అవసరంలేదు. సాబ్‌కా కుక్కల్నమ్మింది నేనే! అవి సన్నేం చేయవు" అన్నాడు గోపీచంద్.

వాచ్‌మన్ అతడి నమ్మకానికాశ్చర్యపడ్డాడు. నిత్యం చూస్తున్నా అతడికే అవంటే భయం.

గోపీచంద్ మామూలుగా లోపలకు వెళ్ళిపోయాడు. వాచ్‌మన్ అతడివంకే ఆశ్చర్యంగా చూశాడు.

బంగళాలో బిహారీమల్ కొడుకులేడు. తండ్రితోపాటు అతడూ ఊరెళ్ళాడు.

ఒంటిగంటకు పనివాళ్ళు వెళ్ళిపోయారు. తిరిగి వాళ్ళు సాయంత్రం నాలుగింటికి వస్తారు.

ఇంట్లో బిహారీమల్ భార్య, కోడలు మాత్రం ఉన్నారు.

అతడు వెళ్ళేసరికి వాళ్ళిద్దరూ చిన్న హాల్లో కబుర్లు చెప్పుకుంటున్నారు.

గోపీచంద్ తన్ను తాను పరిచయం చేసుకుని తన జేబులోంచి తీసి ఇద్దరికీ చెరో భరిణా యిచ్చాడు.

చెరో సోఫాలోనూ కూర్చుని ఆడవాళ్ళిద్దరూ ఆ భరి ణల్ని తెరిచారు. వాటిలో గోపీచందుంచిన నకిలీ వజ్రా లున్నాయి. కానీ మూత తెరవగానే ఆడవాళ్ళిద్దరూ కూర్చున్నవాళ్ళు కూర్చున్నట్లుగానే మూర్ఛపోయారు.

గోపీచంద్ తిన్నగా ఇనప్పెట్టె గదికి వెళ్ళాడు. తలుపు తాళంవేసి లేదు.

అతడు తలుపుతీసి లోపల అడుగు పెట్టబోయి ఆగాడు.

గదిలో సింహంలాంటి కుక్క పహారా తిరుగుతోంది.

గోపీచంద్ క్షణం తటపటాయించాడు.

బిహారీమల్ చాలా తెలివిగా ప్రవర్తించాడు. కుక్కను గదికి కాపలాపెట్టి తను నిశ్చింతగా ఉన్నాడు.

"అందుకు విచారిస్తావులే బిహారీమల్!" అనుకుంటూ అతడు లోపల అడుగుపెట్టాడు.

కుక్క అతణ్ణి చూసి చలించలేదు, పట్టించుకోలేదు.

గోపీచంద్ ఇనప్పెట్టెవరకూ వెళ్ళి తన జేబులోని కాల్క్యులేటర్ వంటి సాధనాన్ని తీసి మరో మీట నొక్కాడు.

అప్పుడా యంత్రంలోంచి కంటికి కనపడని ఘనక వికర్షణ కిరణాలు వెలువడ్డాయి.

విద్యుదయస్కాంత తరంగాలతో ఈగల్నీ, దోమల్నే కాదు—సృష్టిలోని ఏ జంతువునైనా బెదరగొట్టవచ్చు.

కుక్క ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

"ఇప్పట్లో అదిక్కడకు రాదు" అనుకుంటూ గోపీచంద్ తన చేతిలోని చిన్న యంత్రంలో మరోమీట నొక్కాడు.

అప్పుడు యంత్రం నుంచి బలమైన అయస్కాంత కిరణాలు వెలువడుతున్నాయి. వాటి శక్తికి ఏ బ్యాటరీలూ పని చేయవు.

గోపీచంద్ ఇనప్పెట్టి తెరిచాడు కోడ్‌నంబరుపయోగించి.

ఆ యినప్పెట్టిలో ఒకేఒక చిన్న పెట్టెవుంది. ఆ పెట్టె తెరిచి చూస్తే అందులో వజ్రాలహారం....

అయితే చూడ్డానికదంత విశేషంగా లేదు. ఆ హారం ఎనభై లక్షలు చేస్తుందంటే గోపీచంద్‌కు నమ్మబుద్ధికాలేదు.

అయినా అతడు తటపటాయిస్తూనే హారం తీసు

కున్నాడు.

ఈ హారం నకిలీదైతే తనేం చేయాలి?

బాస్ తనని నమ్ముతాడా.

గోపీచంద్ ఇనప్పెట్టెను మళ్ళీ మళ్ళీ గాలించాడు. అందులో ఆ హారమున్న పెట్టి మినహా మరేమీ లేదు.

అతడు ధైర్యంగానే ఆ పెట్టిని తన సఫారీ సూట్ జేబులోకి తోసేసి ఇనప్పెట్టి మూసేసి ఆ గదిలోంచి బయట పడ్డాడు.

అతడు చిన్న హాల్లోకి చేరుకున్న కొద్ది నిముషాల్లోనే ఆడవాళ్ళిద్దరూ స్పృహలోకి వచ్చారు.

జరిగిందేమిటో వారికి గుర్తులేదు. అతడు వారివద్ద సెలవు తీసుకుని ఇంట్లోంచి బయటకు నడిచాడు.

గేటువద్ద వాచ్‌మన్ నుంచి కూడా సెలవు తీసుకున్నాడు.

అక్కణ్ణించి తిన్నగా తనకు తెలిసిన ఓ నగల దుకాణానికి వెళ్ళాడు. హారాన్ని చూపించాడు.

అది నకిలీహారమనీ దాని విలువ రెండొందల యాభైకి మించదనీ రూఢీ అయేసరికి గోపీచంద్ గుండెలు గుబగుబలాడాయి.

అతడు సుబ్బారావు దగ్గిరకు వెళ్ళాడు. హారమున్న పెట్టె అతడి కందజేసి, "మన ఒప్పందం ప్రకారం ఇనప్పెట్టెలోని హారాన్ని తేవాలి. అందులో ఒకే ఒక్క హారముంది. అది నేను తెచ్చాను. అది అసలుదా, నకిలీదా అన్నది మీరు తేల్చుకోవాల్సిన విషయం. నేనెప్పుడూ ఎవర్నీ మోసం చేయలేదు. చేయను! ఈ విషయం గుర్తుంచుకుని నన్ను మరిచిపొండి!" అన్నాడు.

సుబ్బారావు హారాన్నందుకుని నవ్వి ఊరుకున్నాడు.

7

"నీ కోసం ఎవరో వచ్చార్రా!" అంటూ కొడుకును తట్టి లేపింది గోపీచంద్ తల్లి.

కళ్ళు నులుముకుంటూ లేచాడు గోపీచంద్. డ్రాయింగు రూంలోకి వెళ్ళి కనబడిన వ్యక్తిని చూసి, "నువ్వా, సుబ్రహ్మణ్యం!" అన్నాడు.

"నన్నెందుకిలా వేధిస్తున్నావు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమయింది?"

"సేఠ్ బిహారీమల్‌కి నేనొక తిరుగులేని యినప్పెట్టె తయారు చేసిచ్చాను. నాకింకా ఆలాంటి ఆర్డర్సు కొన్ని రానున్నాయి. ఈలోగా సేఠ్ ఇంట్లో దొంగతనం జరిగింది. నా ఆర్డర్సు కాన్సిలయ్యాయి."

"అయితే నేనేం చేసేది?"

"నా యినప్పెట్టెని ఛేదించడం ఇంకెవరికీ సాధ్యం కాదు. అది నీపనేనని నా నమ్మకం."

"నామీద నమ్మకముండడం నీకు మంచిదే!"

"అలా వేళాకోళంగా మాట్లాడకు. ఈ వ్యవహారంలో నేనెంత నష్టపోయానో తెలుసా?"

"నా వ్యవహారంలో నే నితరుల నష్టాల గురించి కాక నా లాభాల గురించి ఆలోచిస్తాను నీకు కొన్ని ఆర్డర్స్ కాన్సిలయుండొచ్చు. కానీ ఇనప్పెట్టె పేరు చెప్పి సేఠ్ దగ్గిర బాగానే గుంజి ఉంటావు!"

"అలా జరిగితే బాధ లేదు. ఇనప్పెట్టె ధర అయిదు లక్షలు చెప్పాను. అయితే సేఠ్ రెండు నెలలపాటు ఇనప్పెట్టెను ట్రయల్లో ఉంచితానన్నాడు. ట్రయల్ పీరియడ్లో దొంగతనం జరిగితే నేనతడికి రెండులక్ష లివ్వుకోవాలి.

ఆ విధంగానే మధ్యవర్తి దగ్గిర రెండు లక్షలూ ఉంచాను కూడా। ఇప్పుడా రెండు లక్షలూ పోయాయి."

గోపీచంద్ ఉలిక్కిపడి, "అయితే నన్ను దొంగ తనానికి పురికొల్పింది బిహారీమల్లే అన్నమాట। ఈ యిన ప్పెట్టె బేరంలో నువ్విచ్చిన రెండు లక్షల్లోనూ ఆయనో లక్ష మిగుల్చుకున్నాడన్న మాట।" అన్నాడు.

"అంటే నువ్వు సేఫ్ నుంచి లక్షరూపాయల ప్రతిఫలం పొందావన్నమాట।ఇకమీదట ఆ లక్ష నేనే ఇచ్చుకుంటాను. నువ్వు నా వ్యవహారంలో జోక్యం కలిగించుకోకు...."

"డియల్ బ్రదర్। ప్రజలను దోపిడీ చేస్తున్నవాడికి సాయపడాలనుకునే నీ తత్వం నాకు సరిపడలేదు. నా మాట విను. నాతో చేతులు కలుపు సామాన్యుల కుప యోగపడే ఎన్నో ఎలక్ట్రానిక్ పరికరాలను సృష్టించి వ్యాపారం చేస్తూ నిదానంగా పైకి వద్దాం. నీ దారి మళ్ళిం చాలనే నీ ప్రతి ప్రయత్నానికీ విఘ్నం కలిగించడానికి పూనుకుని నేను కొన్ని రిస్కులు కూడా తీసుకున్నాను. అయితే ఈ వ్యవహారంలో నిన్ను దెబ్బతీస్తున్నానవీ, దాంతోపాటే బిహారీమల్‌ని కూడా దెబ్బ తీస్తున్నానవీ అనుకున్నాను తప్ప - బిహారీమల్‌కే నేను పని చేస్తున్నా నని గ్రహించలేదు. బాగా ఆలోచించు. మనం శత్రువు లమై దోపిడీదారులకు సాయపడదామా? లేక మిత్రులమై గౌరవనీయులైన వ్యాపారస్థులమవుదామా?" అన్నాడు గోపీచంద్.

సుబ్రహ్మణ్యానికి ఆలోచించాలనే ఉంది కానీ జరిగిం దానికి తిన్న షాక్‌వల్ల వెంటనే ఏమీ మాట్లాడలేక పోయాడు. కానీ ఆ షాక్‌వల్లే అతడొక నిర్ణయానికి రాగలిగాడు. అదేమిటో వేరే చెప్పక్కర్లేదుగా। □

బ్రీఫ్ కేస్

విశ్వమోహిని



ఎక్స్‌ప్రెస్ కొన్ని నిముషాలలో వస్తోందనగానే ప్లాట్ ఫాం అంతా పెళ్ళి పందిరిలా అయిపోయింది.

అంతా హడావుడిగా సామాన్లు పట్టుకొని అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు.

ఎదురుచూసిన ఎక్స్‌ప్రెస్ రావడము, వెళ్ళడమూ కూడా జరిగిపోయాయి.

రైల్లోంచి దిగిన సత్యనారాయణ సామాన్లన్నీ ఒక

చోటకు చేర్చి అక్కడ పెళ్ళాన్నీ, పిల్లల్నీ కూర్చో బెట్టాడు.

చిలకలూరిపేటలో సత్యనారాయణ స్నేహితుడు వుంటున్నాడు. మర్నాటి రాత్రి అతని కూతురిపెళ్ళి. అందుకే కుటుంబంతో బయలుదేరాడు.

చిలకలూరిపేటకు బస్సులో వెళ్ళాలి. ఆ వేళ్టికి ఆ వూర్లో ఆగిపోయి కనకదుర్గ దర్శనం చేసుకుని మర్నాడు వుదయమే బస్సులో బయలుదేరి వెళ్ళవచ్చు ననుకున్నారు వాళ్ళు.

ఆ వూర్లో మంచి లాడ్జి ఏదో ఎవరినైనా అడిగివస్తానని చెప్పి. కుటుంబాన్ని అక్కడేవుంచి, సామాను జాగ్రత్తగా చూసుకోమని హెచ్చరించి వెళ్ళాడు సత్యనారాయణ.

ఓ పావుగంట తరువాత తిరిగి వచ్చాడు అతను.

"ఫలానా లాడ్జి మంచిదట. ఇక్కడినుంచి రిక్షాలో వెళ్ళాలి, పదండి" అనడంతో, అంతా కలిసి ప్లాట్‌ఫాం బయటకు నడిచారు.

* * *

హాన్సేన్ దృష్టి చాలా సేపటినుంచి ఆ బ్రీఫ్‌కేస్ మీదే వుంది.

మీడియంసైజు, లైట్ బ్రౌన్ కలర్, 'అరిస్టో' బ్రీఫ్‌కేస్ అది.

అలా ఎంతసేపటినుంచి అక్కడ వున్నదోగాని అది. హాన్సేన్ మాత్రం దాదాపు ఓ గంటనుంచి దానిని కనిపెడుతూనే వున్నాడు.

ఒకటో నంబరు ప్లాటుఫాంమీద....ఓవర్ బ్రిడ్జి స్టేర్‌కేస్‌కి చేరువలో....స్తంభం వెనుక....చెక్కు చెదరకుండా

నిలిచివున్నదది.

వెన్నెల జల్లుల్లో ప్రియుడికోసం వోపికగా ఆశతో ఎదురుచూస్తూన్న ప్రియురాలిలా వున్నదది!

గంటనుంచి చూస్తూనేవున్నాడు హుస్సేన్—ఎవరైనా వచ్చి తీసుకుంటారేమోనని.

ఎందరో దాని ప్రక్కగా వెళుతూనే వున్నారు. ఎందరో దానికి సమీపంలో వున్న సిమెంటు బెంచీమీద కూర్చుని వెళ్ళారు. వెళ్ళేవాళ్ళు వెళుతున్నారు. కొత్తమనుషులు వచ్చి కూర్చుంటున్నారు. అందరి కళ్లూ దానిమీద పడినా, ఎవరూ దాని వూసు పట్టించుకున్నట్లు లేదు.

అందుకే ఆశ్చర్యంగావుంది హుస్సేన్ మియ్యాకి.

అనుమానంగానూ వున్నది!

మొదట్లో అది వొంటరిగా కనబడగానే అందమైన పడతి వొంటరిగా దొరికినంత ఆనందమయింది అతనికి.

అయినా చేయి వేయడానికి ధైర్యం చాలలేదు. దాని యజమాని దాపులో ఎక్కడో వుంటాడనుకున్నాడు. అక్కడ వున్నవాళ్ళలో, తిరుగుతూన్న వారిలో దాని వోనర్ ఎవరో తెలియలేదు.

అందుకే కాసేపు దానిని కనిపెడుతూ వుండిపోయాడు. తనకు తెలియకుండానే ఓ గంట సుమారుగా దానికి కాపలా కాస్తున్నాడు.

కాని, కాలం గడిచేకొద్దీ ఒక్కరూ ఆ బ్రీఫ్‌కేస్‌ని తీసుకునేందుకు రాకపోవడంచేత మళ్ళీ ఆశ చిగురించింది అతనిలో.

ఎవరో దానిని అక్కడ మరిచిపోయి వదిలేసి వుంటారనిపించింది.

అంతలోనే సంశయం—ఎవరైనా దానిని అంత

నిర్లక్ష్యంగా వదిలి వెళ్ళిపోతారా అని!

ఆ క్షణంలో—ఆశ....

మరుక్షణంలో—సంశయం....

పై క్షణంలో—అనుమానం....

హుస్సేన్‌మియ్యా ఎన్నోసార్లు దాని ప్రక్కనుంచే తిరిగాడు సిగరెట్ కాలుస్తూ. దానిని తాకడానికి ధైర్యం చాలలేదు. అందుకు అతనికివున్న కారణాలు అనేకం. ఆలస్యం అయ్యేకొద్దీ అతనిలో ఆశతోపాటు ఏదో అనుమానం కూడా ప్రబలసాగింది.

ప్రొద్దుగుంకే కొద్దీ అతనిలో కుతూహలం హెచ్చింది. ఎంతసేపయినా సరే దానిని కనిపెడుతూ అక్కడే వుండాలనీ నిశ్చయించుకున్నాడు.

హుస్సేన్‌మియ్యా లాగే మరికొన్ని జతల కళ్ళు కూడా ఆ బ్రీఫ్‌కేస్‌ని ఆత్రంగా కనిపెడుతున్నాయన్న సంగతి అతనికి తెలియదు. ఎవరి హడావుడిలో వాళ్ళు వున్నారనుకున్నాడు.

ఆ కళ్ళలో కూడా ఆశ-సంశయం-అనుమానం-భీతి-నిరీక్షణ దోబూచులాడుతూన్న విషయం అతను ఎరుగడు.

ఆ విధంగా కొన్ని జతల కళ్ళు ఆ వొంటరి బ్రీఫ్‌కేస్‌ని రెప్పవేయకుండా కాపలా కాస్తూంటే - ప్రొద్దుపోయినా సురక్షితంగా వున్న చోటనే మాజిస్టిక్‌గా నిలుచుని వుంది ఆ బ్రీఫ్‌కేస్.

* * *

లాడ్జిలో దిగగానే స్నానాలవీ కానిచ్చి, క్రింద వున్న రెస్టారెంట్‌లో భోజనాలు ముగించి విశ్రాంతి కోసం పడక ఎక్కారు సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులూను.

ఫోమ్ బెడ్‌మీద నడుం వాల్చగానే నిద్ర పట్టేసింది

సత్యనారాయణకు. మళ్ళీ భార్య లేపేంతవరకు మెలకువ రాలేదు అతనికి. టైమ్ చూసుకుంటే సాయంత్రం ఆరయింది.

కనకదుర్గ గుడికి వెళ్ళడానికని తయారయ్యారంతా.

అప్పుడు జ్ఞాపకమొచ్చింది సత్యనారాయణకు బ్రీఫ్ కేస్. సామాన్లన్నీ వెదికినా కనిపించలేదది. కంగారు పట్టుకుంది అందరికీను.

"నగలూ, డబ్బూ అందులోనే వున్నాయి. రైలు దిగగానే నీ చేతిలో పెట్టి వెళ్లాను, లోపల పెట్టెయ్యమని చెప్పి. అంత వొళ్లు తెలియకుండా ఎక్కడ వదిలేసారల్లా?" అంటూ పిచ్చెక్కినవాడిలా అందరిమీదా కేకలు వేసాడు సత్యనారాయణ.

ఏదో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది అతని భార్య. దుఃఖం ముంచుకువస్తోంది ఆమెకు.

తనవీ, పిల్లలవీ నగలన్నీ అందులోనే వున్నాయి. అతను వద్దంటున్నా వినకుండా పెళ్ళికి వెళుతున్నాం కదా అని నగలన్నీ తీసుకుని బయలుదేరింది. ఓ పాతిక కాసులయినా వుంటుంది. దానికి తోడు కూడా తెచ్చిన క్యాష్ అంతా అందులోనే వుంది. త్రోవలో ఖర్చులకు కొంత పయిన వుంచుకుని మిగతాదంతా అందులోనే వుంచడమయింది.

చటుక్కున జ్ఞాపకం వచ్చింది ఆమెకు....భర్త బ్రీఫ్ కేస్‌ని తనకిచ్చి లోపల పెట్టమని చెప్పి వెళ్ళాడు. తాను దానిని ప్రక్కన వుంచి పెద్దపెట్టె తెరవబోయింది. అంతలో సామాన్లతో బరువుగా వున్న ట్రాలీ ఒకటి బ్రహ్మాండమయిన చప్పుడు చేసుకుంటూ అటే వస్తోంది. 'తప్పుకో, తప్పుకో' అంటూ పోర్టర్లు అరుస్తూంటే కంగా

రుగా దారిలో వున్న తమ సామాన్లను తలొకటీ అందుకుని ఓవర్ బ్రిడ్జి ప్రక్కగా వుంచారు. ఆ తరువాత ఎవరో ముసలావిడ వచ్చి పలకరించడంతో ఆ మాటలలో పడి బ్రీఫ్ కేస్ సంగతే మరచిపోయింది తాను.... అదంతా గుర్తుకు వచ్చేసరికి గజగజ వొణికిపోయిందామె.

భార్య చెప్పింది వింటూనే నడుము విరిగినవాడిలా కూలబడిపోయాడు సత్యనారాయణ.

"అలా కూర్చుండిపోతే యెలాగండీ? త్వరగా స్టేషన్ కి వెళ్ళి చూడండీ. ఎవరూ చూడకపోతే అక్కడేవుంటుంది" అంది ఆమె ఏడుస్తూ.

కయ్ మని లేచాడతను - "మనం రైలు ఎన్ని గంటలకు దిగామో తెలుసా? ఒంటి గంటకు. ఇప్పుడు ఆరు దాటింది. అయిదు గంటలసేపు ఆ బ్రీఫ్ కేస్ అక్కడే పడి వుండటానికి ఇదేమయినా ఫారిన్ కంట్రీ అనుకున్నావా? భారతదేశం ఇది!" అంటూ.

ఏం చేయటానికీ కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు అతనికి.

కనకదుర్గమ్మకూ, ఏడుకొండలవాడికీ మొక్కేస్తోంది ఆమె ఏడుస్తూనే.

"ఎందుకయినా మంచిది ఓసారి వెళ్ళి చూసివద్దామండీ. దొరక్కపోతే పోలీసు కంప్లెయింటయినా ఇవ్వొచ్చును పదండి" అన్న భార్య వంక వురిమి చూసి, అంతకంటె గత్యంతరం లేదు కనక కంగారుగా బయటకు వురికాడు అతను. వెనకాలే పరుగెత్తిందామె.

* * *

చీకటి పడినా ఆ బ్రీఫ్ కేస్ యథాస్థానంలో ప్లాట్ పాం మీదే వుంది.

హుస్సేన్‌మియ్యా కూడా అక్కడి నుంచి కదలలేదు. అతనితోపాటు మరి కొందరు కూడా శ్రమ అనుకోకుండా దానికి కాపలాకాస్తూనే వున్నారు, ఒకరికి తెలియకుండా ఒకరు.

ఉండేకొద్దీ వారిలో ఏవేవో అనుమానాలు పెరిగి పెను భూతాలయి నిలిచాయి.

ముఖ్యంగా - అవతలివాళ్ళు దానిని ఎందుకు ముట్టుకో వడంలేదో అన్న ఆలోచన పీడిస్తోంది....కుక్కల్లా తోకా డించుకుంటూ దాని చుట్టూనే ప్రదక్షిణాలు చేస్తూ వున్నా, దానిని అంటడానికి ధైర్యం చాలటం లేదు ఎవరికీను!

అదే సమయంలో —

ఎక్కడినుంచో సత్యనారాయణ హడావుడిగా పరు గెత్తుకు రావడం కనిపించింది.

అతను సరాసరి వోవర్‌బ్రిడ్జి వైపు వెళ్ళాడు. అతని వెనకే భార్యవుంది.

స్తంభం చాటున—కొత్త పెళ్ళికూతురిలా నిలుచుని వున్న బ్రీఫ్‌కేస్‌ని చూడగానే అంత దూరంనుంచే ఆనందంతో అరిచింది అతనిభార్య—"అదిగోనండీ, మన బ్రీఫ్‌కేస్!" అంటూ.

దంపతులు ఒక్క వురుకులో అక్కడికి చేరుకున్నారు.

సత్యనారాయణ బ్రీఫ్‌కేస్‌ని తీసి ఆనందంతో ముద్దు పెట్టుకున్నాడు.

"మనది కష్టార్జితం. అందుకే మన సొమ్ము మనకు దక్కింది," అంది భార్య, ఏడుకొండలవాడికి, కనక దుర్గకూ మనసులోనే కృతజ్ఞతలు అర్పిస్తూ.

"ఔను" అన్నాడు సత్యనారాయణ.

అతనికి ఓ ప్రక్క ఆనందంగానూ, మరో ప్రక్క

ఆశ్చర్యంగానూ వుంది.

వదిలేసిన సరుకు అన్ని గంటలయినా చెక్కు చెదర కుండా అక్కడే వుండడం అన్నది అమితాశ్చర్యాన్ని గొలుపుతోంది అతనికి, అదీ ఓ రైల్వే ప్లాట్‌ఫాంమీద! ఇంకా నమ్మశక్యం కాకుండావున్నది అతనికి, ఆ అను భవం తనకే అయిందిగాని, లేకుంటే మరొకరు చెబితే నమ్మేవాడు కాదేమో!

ఆ దృశ్యాన్ని చూస్తూన్న కళ్ళన్నీ బహుశా షాక్‌తో పైకెగిరాయి.

అన్ని గంటలుగా అర్థంలేని అనుమానాలతో, భయా లతో వూరికే దానికి కాపలా కాసారు తాము. తీరికగా తిరిగి వచ్చిన వోనర్‌కి భద్రంగా అప్పగించడం జరిగింది.

'డామిట్!' అనుకొన్నారు ఎవరికివారే.

హుస్సేన్‌మియ్యా వుండబట్టలేక సత్యనారాయణ దంపతులకు ఎదురు వచ్చాడు.

"ఆ బ్రీఫ్‌కేస్ మీదేనా సార్, చాలా సేపటినుంచి అక్కడే పడివుంది?" అంటూ పలుకరించాడు.

"ఔను. మధ్యాహ్నం రైలుదిగి హడావుడిలో మా వాళ్ళు దీన్ని ఇక్కడపెట్టి మరిచిపోయారు. ఆ స్తంభం ప్రక్కన వుండడంతో చూళ్ళేదు వీళ్ళు" అన్నాడు సత్యనారాయణ.

"మూడు గంటలనుంచి చూస్తున్నాను, ఎవరైనా వస్తారేమోనని .... అంత నిర్లక్ష్యంగా వదిలేసారు, అందులో విలువైనవేవీలేవా ఏమిటి?" అన్నాడు హుస్సేన్ మళ్ళీ.

"అయ్యో, మా ప్రాణమంతా ఇందులోనేనండీ బాబూ వుంట" అన్నాడు సత్యనారాయణ, బ్రీఫ్‌కేస్‌ని గుండె

లకు అదుముకొంటూ.

"అంటే-?" అన్నారు, కుతూహలంతో అక్కడికి చేరిన మిగతా 'కళ్ళ' తాలూకు మనుషులు.

"పెళ్ళికని బయలుదేరామండీ. మా నగలూ, డబ్బూ అన్నీ ఇందులోనే వున్నాయి" అని జవాబు ఇచ్చింది సత్యనారాయణ భార్య.

అది వింటూనే గుండెలు ఆగిపోయాయి అందరికీ.

"ఆ(!?" అంటూ నోళ్లు తెరిచారు.

అక్కడినుంచి వెళ్ళిపోయారు సత్యనారాయణ దంపతులు.

గేటు దాటుతూ అప్రయత్నంగా వెనుదిరిగి చూశాడు సత్యనారాయణ.

హాస్పేన్‌మియ్యాతో పాటు ఆ గుంపంతా అక్కడే నిలుచుని, షాక్ తిన్నట్లు చలనంలేకుండా గ్రుడ్లప్పగించి తమవంకే చూస్తోంది.

అందరి కళ్ళుపడినా, అంతమంది కాచుకొని వున్నా, అన్ని గంటలయినా, ఈ దేశంలోని ఓ రైల్వే ప్లాట్‌ఫాం మీద వదిలివెళ్ళిన తన బ్రీఫ్‌కేస్ సురక్షితంగా ఎలా వున్నదో బోధపడక అదో - ఆశ్చర్యార్థకంతో కూడిన పెద్ద ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది సత్యనారాయణ మదిలో.

అదే క్షణంలో—

ప్లాంట్‌ఫాంమీద కనీసం ఓ అరడజనుమందయినా— దేశంలో ఆ మధ్య గొప్ప అలజడి రేపిన 'ట్రాన్సిస్టర్/పార్శెల్ బాంబ్'ని తిట్టుకొంటూ, కసిగా పళ్ళుకొరుక్కుంటున్న సంగతి అతను ఎరుగడు! □

భాగస్థుడిని నమ్మకు

ప్రతాప రవిశంకర్



భాగస్వామ్య వ్యాపారంలో రిస్కు వుంది. ఒక భాగస్థుడు రెండోవాడ్ని మోసం చేసే అవకాశం బాగానే వుంది. ఈ నిజం నాకు ముందుగానే తెలుసు. ఐనా నా పార్టనర్ అహోబలరావు నా కళ్ళకు నన్ను మోసం చేసే మనిషిలా కనపడటం లేదు. నాచేత మోసగించబడేవాడి లాగే కనిపించాడు. అతడ్ని ముంచే ఆలోచన నాలో లేకపోయినా మంచివాడని అతనితో కలిసి భాగస్వామ్య

వ్యాపారం మొదలుపెట్టాను.

పాలిష్డ్ స్టోన్స్‌కు మన దేశంలో అంతగా గిరాకీ లేదుకానీ విదేశాల్లో మంచి డిమాండ్ వుంది. ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టటానికి ముందు నేను ఈ స్టోన్స్ బిజినెస్ గురించి బాగా స్టడీ చేశాను. ఫారిన్ ఆర్డర్స్ సంపాదించేవరకూ కొంచెం కష్టపడినా ఆ తర్వాత మంచి లాభాలతో సుఖపడవచ్చనిపించింది.

అహోబలరావుతో నాకు బాగానే పరిచయం వుంది. నాకు వున్నట్టుగానే అతనికీ మరికొన్ని యితర వ్యాపారాలు వున్నాయి. వ్యాపారుల సమావేశాల్లో తరచు మేమిద్దరం కలిసేవాళ్ళం. మా మధ్య స్నేహం పెరిగాక అతనితో నేను ప్రారంభించదలచుకున్న పాలిష్డ్ స్టోన్స్ బిజినెస్ గురించి మాట్లాడాను.

ఒప్పుకున్నాడు అతను. అతని వయసు దాదాపు నా వయసంత వుంటుంది. కణతల దగ్గిర నెరిసినజుట్టు-పయికి దువ్విన పలచని వెంట్రుకల కైరోడ్డు క్రాపు - గోల్డు ఫ్రేమ్ కళ్ళద్దాలతో అతను బాగా మంచివాడుగా అప్పుడు నాకు అగుపించాడు.

బిజినెస్ మొదలయిన కొన్ని నెలలు అహోబలరావు నిజాయితీగానే ప్రవర్తించాడు. నాలో బాగా నమ్మకం కలిగించి తర్వాతనే మోసం చెయ్యాలని అతని ఆలోచన కావచ్చును.

అతడిమీద నమ్మకంతో ఆ బిజినెస్ డీలింగ్స్ అన్నీ అహోబలరావుకే వదిలేశాను. సరిగ్గా అప్పుడే అతనిలో మోసం మొదలయ్యింది.

అహోబలరావు నమ్మకం ద్రోహం గుర్తుకు వస్తున్నప్పుడు నాలో గొప్ప అలజడి చెలరేగింది. అతడి గురించి

ఆరాతీశాను. అతడికి డబ్బు సంపాదించటంలోనే సంతోషం వుందని తెలిసింది. అటువంటి మనుషులు దేనికయినా సిద్ధపడతారు.

ఆలోచనల్ని పక్కకునెట్టి గ్లాసును చూశాను. విస్కీ అయిపోయింది. బాటిల్లో కూడా లేదు.

బేరర్ కోసం చూస్తుండగా అతనేవచ్చి నిలబడ్డాడు. ఏంకావాలో చెప్పాను.

సన్నటి సంగీతం వినపడుతోంది స్పీకర్ లోనించి. రూఫ్‌గార్డెన్స్ కార్నర్ టేబిల్ దగ్గర కూర్చున్నాను. అంతగా ఎత్తులేని గోడమీదనించి రోడ్డుమీద వెళుతున్న మనుషులు కనపడుతున్నారు.

వాచీ చూసుకొన్నాను.

పదిగంటలు కావస్తూంది.

గార్డెన్ రెస్టారెంటులో దీపాలు డిమ్‌గా వెలుగుతున్నాయి.

సరిగ్గా పదిగంటలకు వస్తానని ఫోనులో చెప్పాడు జాన్సన్. అతడి గురించి చూస్తున్నప్పుడు బేరర్ వచ్చాడు.

బాటిల్ ఓపెన్‌చేసి విస్కీని గ్లాసులోకి వంచి ఐస్ క్యూబ్స్ వేశాడు.

సిగరెట్టు ముట్టించాను.

మళ్ళీ కళ్ళముందు నా పార్టనర్ అహోబలరావు కనిపించాడు.

అతడ్ని అంతం చేయాలని వుంది.

నాకు తెలీకుండా అతను ఫారిన్ ఏజెంట్లతో ముందుగానే సంప్రదించి వాళ్ళకి మంచి కమీషన్ ఇచ్చి ఎక్కువ రేటుకు ఆర్డర్ ఫిక్స్ చేసుకొనేవాడు. అంతకంటే తక్కువ రేటుకు స్టాక్ రిలీజ్ చేసినట్టు ఎకౌంట్స్ చూపించేవాడు.

డిఫరెన్స్‌ను అతను లాభంగా పొందేవాడు.

చాలా ఆలస్యంగా నాకు ఈ నిజం తెలిసింది.

నాకు తెలీకుండా అతను చాలా తక్కువ కాలంలో ఐదు లక్షలు సంపాదించాడు.

అతడు లాభాల్లో యెక్కువ వాటా కావాలంటే నేనే ఇచ్చివుండేవాడ్ని. యాక్టివ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నందుకు ఇంకా ఎక్కువ రెమ్యునరేషన్ అడిగితే కాదనేవాడ్ని కాదు. బిజినెస్‌లో ఎక్కువ పెట్టుబడి నాదే. కాని ఎక్కువ లాభం అహోబలరావు పొందుతున్నాడు నన్ను మోసం చేసి.

సిగరెట్టు పీకను యాష్‌ట్రేలో నొక్కుతున్నప్పుడు వచ్చాడు జాన్సన్.

మాట్లాడకుండా వచ్చి నా యెదురుగా కూర్చున్నాడు.

ఎదురుగా బాటిల్లో వున్న విస్కీని గ్లాసులోకి వంచుకుని తాగాడు.

డిమ్‌లైట్‌లోనే అతడి నున్నగా వున్న గడ్డం తళతళ మెరిసింది. సన్నటి మీసంతో పక్కకు దువ్విన క్రాపుతో జాన్సన్ క్రిమినల్‌గా అగుపించాడు. అతడితో నాకు చాలా యేళ్ళుగా పరిచయం వుంది.

"వెళదామా?" అన్నాడతను కొంచెంసేపటికి.

"వద్దు" అన్నాను అతడి కళ్ళలోకి చూస్తూ.

"ఇక్కడే మాట్లాడుకుందామా?"

"అవును. దగ్గరలో యెవ్వరూ లేరు" అన్నాను.

జాన్సన్ ఒక్కడే గదిలో వుంటున్నాడు. కొన్నిసార్లు అతడ్ని ఆ రూములోనే కలుసుకుని మాట్లాడాను.

మళ్ళీ సిగరెట్టు వెలిగించి అహోబలరావు గురించి చెప్పాను జాన్సన్‌తో—

అంతా విని "ఏం చెయ్యాలి" అన్నాడు.

"అహోబలరావు బతికి వుండటం నాకు యిష్టం లేదు."

"ఐతే చావు ముహూర్తం పెడతాను."

"తొందరపడటం కూడా నా కిష్టంలేదు. అహోబల రావును ఈ లోకంనించి తప్పించటం నీకు కష్టం కాదని నాకు తెలుసు. కాని అందులో నాకు రిస్క్ వుంది. పోలీసులు— పరిశోధన యిలాంటివి జరుగుతాయి. నేను అతడి పార్టనర్‌ని కాబట్టి నామీద కూడా అనుమానం వుంటుంది. అందువల్ల నాకు ఇంకో ఆలోచన వస్తోంది" అన్నాను జాన్సన్‌తో—

"ఏమిటి? కాలో, చెయ్యో తీసెయ్యటమా?" అడిగాడు జాన్సన్.

"ఉహు....కాదు. అహోబలరావు మానసికంగా కుంగిపోవాలి. నా గురించి అతడికి తెలియాలి. బిజినెస్‌లో అతడి షేర్‌ను కూడా నాకు సరెండర్ చేసి ఖాళీ చేతులతో ఇంటికి వెళ్ళిపోవాలి."

"అదెలా సాధ్యం!" జాన్సన్ గ్లాసులోకి విస్కీ వంచుకుంటూ అడిగాడు.

నేను మాట్లాడలేదు.

నా గ్లాసులో మిగిలివున్న మందును తాగాను. అప్పటికే విస్కీ నాలో బాగా పని చేస్తోన్నది. మైకం తెరలు నన్ను చుట్టుకుంటున్నాయి.

"అతడ్ని బ్లాక్ మెయిల్ చెయ్యాలి" అన్నాను.

"ఏ ఆధారంతో?"

"ప్రస్తుతానికి యే ఆధారం లేదు. కాని ఆధారాన్ని నువ్వు సంపాదించాలి. వివరంగా చెబుతాను. డబ్బు

సంపాదించటంలో మునిగిపోయి అహోబలరావు భార్యని నిర్లక్ష్యం చేశాడని నాకు తెలుసు. ఆమె పేరు అహల్య. ఆమెకు కొంతమంది మగాళ్ళతో సంబంధాలు వున్నాయి. అహోబలరావు బయటకు వెళ్ళగానే అహల్య కూడా ఖరీదయిన హోటళ్ళకు వెళ్ళి మగాళ్ళతో తిరిగివస్తుంది. కొన్నిసార్లు నేను కూడా ఇతర మగాళ్ళతో చూశాను."

"గుడ్! ఐతే సాక్ష్యం సంపాదిస్తాను" అన్నాడు జాన్సన్ ఉత్సాహంగా.

"రేపు ఉదయం నన్ను కలుసుకో. మా ఆఫీస్ ఓపెనింగ్ ఫంక్షన్‌లో తీసిన ఫోటోల్లో అహల్య కూడా వుంది. ఆమెను నీకు చూపుతాను. రేపట్నించే ఆమెను నీడలా వెంటాడు. అహోబలరావు షాకయ్యేలా ఫోటోలు సంపాదించు."

ప్యాంటు జేబులోనించి పదివేల రూపాయల నోట్లకట్ట తీసి జాన్సన్ కిచ్చాను. అతను దాన్ని జేబులో దోపుకొని లేచి నిలబడ్డాడు.

"రేపు ఉదయం కలుస్తాను" అని వెళ్ళిపోయాడు.

బేరర్ రాగానే బిల్లు చెల్లించి నేను కూడా లేచాను.

2

జాన్సన్ వారం రోజులు అహల్య కోసం యెదురు చూశాడు. ఈ రోజుల్లో ఆమె మూడుసార్లు కార్లో బయటకు వెళ్ళింది కాని యెవర్నీ ఎక్కడా కలుసుకోలేదు. షాపింగు పూర్తిచేసి ఇంటికి తిరిగివచ్చింది.

"ఆమె అలాంటి మనిషి కాదేమో!...." అన్నాడు జాన్సన్.

నాకు నమ్మకం కలగలేదు.

ఆ ప్రయత్నంలో అతడ్ని వుండమని చెప్పాను.

ఆ రోజు మధ్యాహ్నం ఆఫీస్‌కు మద్రాసులో వున్న మా ఏజెంట్ దగ్గర్నించి కాల్ వచ్చింది ఫారిన్ ఏజెంట్ మద్రాసులో వున్నాడనీ. అహోబలరావుని వచ్చి అతన్తో ఆర్డర్ గురించి మాట్లాడమనీ చెప్పాడు.

ఆ రాత్రి ఏడున్నర ఫ్లయిట్‌లో అహోబలరావు మద్రాసుకు వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు.

ఆ విషయాన్ని జాన్సన్‌కు తెలియజేశాను.

"రాత్రి అహోబలరావు యింట్లో వుండడు కాబట్టి అహల్య తన ఫ్రెండ్స్‌లో యివర్నయినా తన యింటికి ఆహ్వానించే అవకాశం వుంది...." అని చెప్పాను ఫోన్‌లో.

రాత్రంతా జాన్సన్—అహోబలరావు ఇంట్లోనే వుండి పోతానని చెప్పాడు.

ఎందుకో ఆ రాత్రి జాన్సన్ కోరుకున్న సాక్ష్యాన్ని సంపాదిస్తాడని నాకు అనిపించింది.

ఎప్పటికో నిద్రపోయాను.

ఫోన్ మోగింది.

రిసీవర్ ఎత్తాను.

"పనయిపోయింది. తిరుగులేని సాక్ష్యాలను ఫిల్ములో బంధించాను. రేపు కలుస్తాను" అని ఫోన్ పెట్టేశాడు అతను.

అప్పుడు నాలుగ్గంటలయ్యింది.

తెల్లవారేవరకూ నిద్రపట్టలేదు.

ఉదయం ఎనిమిదిగంటలకే జాన్సన్ వచ్చాడు. ఆ ఫోటోలను చూపించాడు.

మొత్తం పన్నెండు,

వాటిని చూడగానే అంతులేని సంతోషం కలిగింది. అహల్య మరో మగాడితో ఏవో లోకాల్లో తేలిపోతున్నప్పుడు తీసిన ఫోటోలు.

జాన్సన్‌ని మెచ్చుకున్నాను.

ఆ ఫోటోలను చూపించి అహోబలరావును సులభంగా లొంగదీసుకోవచ్చు.

అహోబలరావు మద్రాసు నించి తిరిగి రావటంకోసం ఎదురుచూస్తున్నాను.

3

"బిజినెస్ గురించేనా?" అంటూ నవ్వాడు అహోబలరావు.

నేనూ నవ్వి "అవును. పర్సనల్ మేటర్స్‌కూడా" అన్నాను.

ఆ గదిలో ఇంకెవ్వరూలేరు. ఇద్దరమే. నేనే ఫోన్ చేసి అతన్తో చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడాలనీ అక్కడ కలుసుకోమనీ చెప్పాను.

గదిలో దీపం వెలుగుతోంది.

టేబిల్‌మీద రెండు గ్లాసుల్లో విస్కీవుంది. ప్లేట్లో కేజూనట్స్ వున్నాయి.

"మాట్లాడు" అహోబలరావు మందు తాగి జీడిపప్పు తింటూ—

"మొదట్లో నిన్ను చూసి చాలా అమాయకుడివనుకున్నాను" అన్నాను.

అతను నవ్వి "వ్యాపారంలో పైకివచ్చే మనిషి ఎప్పుడూ అమాయకంగా కనపడతాడు. కాని కాదు. అసాధ్యుడు. ఈ నిజం నీకు ఎప్పుడో తెలిసివుండాలి" అన్నాడు.

"అవును. పొరపాటు నాదే. నిన్ను నమ్మినందుకు నన్ను బాగా చీట్ చేశావు. ఇప్పటికి ఎంత సంపాదించావు?" అనడిగాను.

"ఎనిమిదిలక్షలు" అన్నాడు సిగరెట్టు ముట్టిస్తూ—

షాక్ ఫీలయ్యాను.

అహోబలరావు బుకాయిస్తాడనుకున్నాను. కాని అంత ఫ్రాంక్‌గా నిజాన్ని ఒప్పుకుంటాడనుకోలేదు.

"నువ్వు చేసిన మోసానికి నిన్ను ఏమైనా చెయ్యగల శక్తి నాకు వుంది. కాని ముందుగా ఒక అవకాశం ఇస్తున్నాను. నువ్వు అదనంగా సంపాదించిన ఎనిమిదిలక్షలనూ తిరిగి ఇచ్చి బిజినెస్‌లో నీ వాటాను కూడా నాకు సరెండర్ చేసి నువ్వు వెళ్ళిపోవాలి. ఇదీ షరతు" అన్నాను.

అహోబలరావు పెద్దిగా నవ్వి "నువ్వు ఎంత బెదిరించినా నీ యే షరతులకూ నేను ఒప్పుకోను. ఒక్క రూపాయి కూడా ఇవ్వను" అన్నాడు చాలా హేళనగా—

ఇహ నేను ఆలస్యం చెయ్యలేదు. ప్యాంటుజేబులోంచి కవరు తీసి అతనికిస్తూ "ఇందులో ఫోటోలు చూడు. ఆ తర్వాత నువ్వు అన్ని షరతులకూ ఒప్పుకుంటావు" అన్నాను అతన్లాగే నవ్వుతూ—

ఆశ్చర్యంతో కవరందుకుని అందులో ఫోటోలు బయటకు తీశాడు. అతడి మొహంలో భావాలను సులభంగానే చదివాను. కోపంతో అతడి మొహం జేవురించింది. కణతలమీద నరాలు పొంగాయి.

"ఎలా వున్నాయి? బాగా వచ్చాయా?" అన్నాను హేళనగా—

వాటిని కవర్లో వుంచి "ఇప్పుడు కూడా నేను నీకు

లొంగను" అన్నాడు మొండిగా—

"ఏమిటి నీ ధైర్యం? ఆ ఫోటోల్లో వున్న మనిషి నీ భార్య అహల్య కాదా?" అనడిగాను అనుమానంతో—

"అవును. ఆమె నా భార్య అహల్య. కాని నా ధైర్యానికి కారణం వేరేవుంది" అంటూ అతను షర్టు జేబులోనించి ఓ కవరు తీసి నాముందు పడేశాడు.

ఆ కవర్ని తెరుస్తున్నప్పుడు ఎందుకో తెలీని భయంతో నాచేతులు వణికాయి.

అందులో ఫోటోలు వున్నాయి.

వాటిని చూడటంతోనే నా కళ్ళు తిరిగాయి. అవమానంతో కుంగిపోయాను. నాలోవున్న శక్తి ఒక్కసారిగా క్షీణించిపోయినట్లనిపించింది.

పది ఫోటోల్లో నా రెండో కూతురు రూప మరో మగాడితో కలిసి వుంది. అహల్య ఫోటోలకంటే ఇంకా దారుణంగా వున్నాయి ఆ ఫోటోలు. ఆ ఫోటోలు బయటపడితే నేను ఆత్మహత్య చేసుకోక తప్పదు.

"ఫోటోలు బాగా వచ్చాయనుకుంటాను. మంచి ఎక్స్పర్ట్ ఫోటోగ్రాఫర్‌తో తీయించాను" అన్నాడు అహోబలరావు సిగరెట్టు ముట్టిస్తూ—

"నీకీ అవసరం ఎందుకు వచ్చింది?" హీనమైన గొంతుతో అడిగాను అతడ్ని—

"భాగస్వామ్యంలో రెండో భాగస్థుడ్ని మోసం చెయ్యటం అంటే ఒడుపుతో పామును పట్టుకోటం లాంటిదని నా నమ్మకం. పాము కాటెయ్యకుండా, ఒకవేళ వేసినా ఆ వేటునించి తప్పించుకోటానికి ఏం చెయ్యాలో పాముల్ని పట్టేవాడు ముందుగానే తెలుసుకుంటాడు. నేనూ అంతే

చేశాను. నా మోసాన్ని తెలుసుకున్న నువ్వు మవునంగా వూరుకోవనీ - నన్ను లొంగదీసుకునే ప్రయత్నం ఏదో చేస్తావనీ నాకు తెలుసు. అందుకే ముందుగా నా రక్షణ కవచాన్ని నేను తయారుచేసుకున్నాను" అన్నాడు అహోబలరావు.

నేను మాట్లాడలేకపోయాను.

అహోబలరావు నాకంటే ఎన్నో మెట్లు పైన నిలబడి వున్నాడు. ఎవరి ఫోటోలు వాళ్ళ దగ్గిరే వుంచుకునేట్టు ఇకముందు బిజినెస్‌లో మోసంలేకుండా చూసుకునేట్టు మా మధ్య కొత్త ఒప్పందం కుదిరింది.

కొత్త విస్కీబాటిలు ఓపన్‌చేసి రెండు గ్లాసుల్లో మందు పోసి ఛీర్స్‌కొట్టాడు అహోబలరావు.

రాత్రి పదకొండు గంటలకు అహోబలరావును వదిలించుకున్న తర్వాత జాన్సన్‌ని అతడి గదిలో కల్సుకున్నాను. □

ఐరన్ లేని మనిషి!



తాటికల్లు గ్రామంలో రెండు హత్యలు జరిగాయని రేడియో మెసేజ్ అందుకున్న డి. యస్. పి. విక్రమ రావు వెంటనే బయల్దేరాడు.

మామూలుగా అయితే ఒక గ్రామంలో రెండుహత్యలు జరిగినంతమాత్రాన డి.యస్.పి కంగారుపడి హుటాహుటిన బయల్దేరవలసిన అవసరం ఏమీ వుండదు. సర్కిల్ లెవల్లోనే తతంగం జరిగిపోతుంది.

అయితే తాటికల్లు గ్రామం ఇటీవల వార్తల్లోకి ఎక్కింది. నెల రోజుల క్రితం ఒక పార్టీవారు తమ

ప్రత్యర్థుల మీద బాంబులువేసి, గడ్డివాములు తగల బెట్టారు. అప్పుడు ఎవరూ చనిపోకపోయినా ఆస్థి నష్టం జరిగింది. కొందరికి గాయాలు తగిలాయి. సరిగ్గా పది హేను రోజులు గడిచిన తర్వాత దెబ్బతిన్నవర్గంవారు భారీ ఎత్తున బాంబులతో దాడి జరిపారు. గ్రామంలో బీభత్సం సృష్టించారు. ఇళ్ళు తగలబెట్టారు. అడ్డం వచ్చిన వారిని చావబాదారు. ఈ అల్లకల్లోలంలో నలుగురు మర ణించారు. ఇరవయి మంది దెబ్బలు తగిలి హాస్పటల్లో చేర్చబడ్డారు.

ముఖ్యమంత్రి గ్రామాన్ని సందర్శించి బాధితుల్ని ఓదార్చి, దోషులను కఠినంగా శిక్షించమని పోలీసు అధి కారులను ఆదేశించారు. అపోజిషన్ వారిమీద దుమ్మెత్తి పోశారు. తర్వాత అపోజిషన్ నాయకులు గ్రామానికి విచ్చేసి పొజిషన్‌లో వాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. ఆ కారణంవల్ల తాటికల్లు అందరి దృష్టిలో పడింది. పత్రికలవాళ్ళు బాధితుల్ని ఇంటర్వ్యూ చేసి ఫీచర్లు ప్రచురించి ప్రచారం ఎక్కువ చేశారు.

ఇంత గొడవ జరిగి పట్టుమని పది రోజులు కాక ముందే మళ్ళీ జంట హత్యలు వార్త పోలీసుల్ని కంగారు పెట్టింది.

డి.యస్.పి. విక్రమరావు అక్కడకు చేరుకునేసరికి వెంకటరాయుడి మేడ దగ్గర జనం భారీయెత్తున చేరి వున్నారు.

సి.ఐ. వచ్చి సెల్యూట్ చేశాడు.

"ఎవరు చనిపోయింది?" డి.యస్.పి. విక్రమరావు ప్రశ్నించాడు.

"వెంకటరాయుడి భార్య, పాలేరు సర్" చెప్పాడు సి. ఐ.

డి.యస్.పి. తల వూపి హత్యాప్రదేశాన్ని చేరుకున్నాడు.

బెడ్ రూమ్‌లో వెంకటరాయుడి భార్య శవం పడివుంది. హాల్లో పాలేరు శవం వుంది. ఇద్దర్నీ పదునయిన కత్తితో పొడిచి చంపారు.

డి.యస్.పి. హత్యాప్రదేశాన్ని సునిశితంగా పరిశీలించి బయటకు వచ్చాడు.

వెంకటరాయుడు చాలా విచారంగా వున్నాడు. ఏడ్చి ఏడ్చి ముఖం వుబ్బి వుంది. కళ్ళు ఎర్రబడ్డాయి.

"వెపన్ దొరికిందా?" ప్రశ్నించాడు డి.యస్.పి.

"నో సర్!" అన్నాడు సి.ఐ.

* * *

"వాళ్ళు దాడిచేసిన తర్వాత మేమంతా వూళ్ళో లేము సార్! భయపడి కొత్తపేటలో మకాం వేశాం. పొలం పనులు పాడయిపోతాయని నా భార్య వచ్చి నాట్లు వేయిస్తోంది. కాని వాళ్ళు ఆడవాళ్ళని కూడా చంపుతారనుకోలేదు. లేకపోతే అసలు పంపేవాడినే కాదు" అన్నాడు వెంకటరాయుడు.

డి.యస్.పి. వింటూ తల వూపాడు.

"అయితే ఇదంతా రామానాయుడి వర్గంవాళ్లు చేయించి వుంటారా?" అన్నాడు డి.యస్.పి.

వెంకటరాయుడు తల వూపాడు.

"రామానాయుడి వర్గం వాళ్ళు ఎవరు దొరికినా అరెస్టు చెయ్యమని మేసేజ్ పంపండి. జిల్లా మొత్తం ఎలర్ట్

చెయ్యండి" అని డియస్పీ సర్కిల్ ఇనస్పెక్టర్‌కి ఆదేశా లిచ్చాడు.

"సార్! ఇప్పటికే వాళ్ళమీద వున్న కేసులు చాలు. నాలుగు మర్డర్ కేసులు, దొమ్మీ కేసులు పెట్టారు. వాళ్ళ ప్రాణానికి అవి చాలు. మళ్ళీ ఈ కేసు కూడా ఎందుకు? చంపినవాళ్ళు ఎటూ దొరకరు" అన్నాడు వెంకట రాయుడు.

"వాడ్డూయూ మీన్?" ఆశ్చర్యంగా అన్నాడు డియస్పీ.

"అవును సార్! లాభం ఏముంది చెప్పండి? వాళ్ళ మీద కేసులుపెట్టినంతమాత్రాన నా భార్య తిరిగివస్తుందా?" విరక్తిగా అన్నాడు వెంకటరాయుడు.

డియస్పీ ఆలోచనలో పడ్డాడు.

పాలేరు తల్లిదండ్రులు భోరున ఏడుస్తున్నారు. గుమి గూడిన జనాన్ని పోలీసులు తరుముతున్నారు.

* * *

"సర్!"

తలెత్తి చూశాడు. సర్కిల్ ఇనస్పెక్టర్ కనిపించాడు డియస్పీకి.

"యస్" అన్నాడు.

సి.ఐ. తనతో ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్న ట్టుగా తోచింది.

"వాట్?" ప్రశ్నించాడు డియస్పీ.

"సర్! వెంకటరాయుడు చిన్న రిక్వెస్ట్ చేస్తున్నాడు."

"వాట్?"

"భార్య శవాన్ని పోస్ట్‌మార్టమ్ చెయ్యొద్దని రిక్వెస్ట్ చేస్తున్నాడు. అతనికి చాలా బాధ కలుగుతుందిట. ఆమె

శరీరాన్ని ముక్కలు చెయ్యడం సహించలేనంటున్నాడు."

"శవాన్ని పోస్టుమార్టమ్ చెయ్యకపోతే వెంకటరాయుడు ఎంత ఇస్తానని ఆఫర్ చేశాడు?" సీరియస్‌గా అడిగాడు డియస్పీ.

సర్కిల్ ఇనస్పెక్టర్ ముఖం వెలవెలా బోయింది.

"సర్!" అన్నాడు వణుకుతున్న పెదవులతో.

"టెల్ మీ ఫ్రాంక్‌లీ" కఠినంగా వుంది డియస్పీ గొంతు.

"ఐ యామ్ సారీ సర్. నో సర్. వెంకటరాయుడు బాధ పడుతూ రిక్వెస్ట్ చేశాడని తమకు మనవి చేశాను సర్. ఇందులో నాకులాభం ఏమీలేదు సర్"అన్నాడు సి.ఐ.

"నీ కసలు మేనర్స్ వున్నాయా? మర్డర్ కేసులో శవాల్ని పోస్టుమార్టమ్ చేయించకుండా ఎట్లా ప్రొసీడ్ అవుతావు? అంటే అసలు మర్డర్లే జరగలేదని కేసు క్లోజ్ చేస్తావా?"

"నో సర్. అదంతా వెంకటరాయుడు హాస్పటల్ డాక్టర్‌తో మేనేజ్ చేస్తానని అన్నాడు సర్. పోస్టుమార్టమ్ రిపోర్టు వస్తుంది. కాని డాక్టర్ పోస్టుమార్టమ్ చెయ్యడు" చెప్పాడు సి. ఐ.

"వెంకటరాయుడు శవాన్ని పోస్టుమార్టమ్ చెయ్యొద్దని ఎందుకు అడుగుతున్నాడో ఆలోచించావా?" ప్రశ్నించాడు డియస్పీ.

"భార్యమీద అతనికి ఎంతో ప్రేమ సర్."

సి. ఐ. చెప్పిన మాటలు విని పక్కున నవ్వాడు.

"గాడిద సర్వీసు చేశావ్! ఎందుకు? నీ బుర్ర పని చెయ్యడంలేదు. యూ నీడ్ రిటైర్‌మెంట్ ఫ్రమ్ సర్వీస్!"

"సర్!" కంగారుగా అన్నాడు సి. ఐ.

"నథింగ్ డూ యింగ్. సెండ్ ద బాడీస్ టూ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ ఇమ్మీడియట్లీ!"

"సర్!"

"అట్లాగే డాగ్స్ని తెప్పించు. వెపన్ తప్పకుండా దొరుకుతుంది" అన్నాడు డియస్పీ.

సి. ఐ. వణుకుతూ పరిగెత్తాడు.

*　　　*　　　*

శవాల్ని పోస్ట్‌మార్టమ్ చేసిన తర్వాత బంధువులకు అప్పజెప్పారు. వెంకటరాయుడు భార్య శవాన్ని చూసి భోరున ఏడుస్తున్నాడు.

"అంత్యక్రియలు పూర్తయ్యాక వెంకటరాయుణ్ణి అరెస్ట్‌చేసి తీసుకురా!" నెమ్మదిగా చెప్పాడు డియస్పీ.

"సర్!" అన్నాడు సి.ఐ. షాక్ తిన్నవాడిలా.

"యస్. మర్డర్స్ చేసింది వెంకటరాయుడే!" అని నవ్వుతూ కారెక్కి వెళ్ళిపోయాడు డియస్పీ.

సాయంకాలం డియస్పీకి ఫోన్‌చేశాడు సి ఐ.

"సర్! వెంకటరాయుణ్ణి అరెస్ట్‌చేసి తీసుకొచ్చాను."

"గుడ్. ఇప్పుడే వస్తున్నా!" అన్నాడు డియస్పీ.

డియస్పీ స్టేషన్‌కి వెళ్ళేసరికి సి ఐ. ఎదురొచ్చాడు. లోపలకు వెళ్ళి కూర్చున్నాడు.

"సర్! వెంకటరాయుడు మర్డర్స్ చేసినట్లు ఒప్పుకొన్నాడు." చెప్పాడు సి.ఐ.

"ఒప్పుకోక చస్తాడా?" అని నవ్వాడు డియస్పీ.

"సర్! మీకు వెంకటరాయుడిమీద అనుమానం ఎట్లా కలిగింది?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు సి ఐ.

"శవాల్ని పోస్ట్‌మార్టమ్ చెయ్యవద్దని రిక్వెస్ట్ చేసి

నందుకే।" అని నవ్వాడు.

సి.ఐ. అయోమయంగా చూసాడు.

"అవునయ్యా! పోస్ట్‌మార్టమ్‌రిపోర్టుపూర్తిగాచదివావా?"

"సర్!"

"ఏం వుంది అందులో?"

"వెపన్‌తో లోతుగా పొడవడం వల్ల రక్తస్రావమై ప్రాణం పోవడం జరిగింది."

"అది సరే! అందులోనే ఒక ముఖ్యమైన పాయింట్ వుంది."

సి.ఐ. నెత్తి గోక్కున్నాడు టోపీ ఎత్తి.

"ఎవడయ్యా నీకు ప్రమోషన్ ఇచ్చింది? ఏ మంత్రి రెకమండేషన్ కేండిడేట్ వి నువ్వు?" అని ఎగతాళిగా నవ్వాడు డియస్పీ.

సి.ఐ.కి కంగారులో అసలు బుర్ర పనిచెయ్యడంలేదు.

"నో సర్" అన్నాడు.

"ప్రాణం పోవడానికి ముందు వాళ్ళు ఇంటర్‌కోర్సు జరిపారని లేదూ?"

"యస్సార్?"

"పాలేరుతో వెంకటరాయుడి భార్యకి అక్రమ సంబంధం వుంది. ఊళ్ళో గొడవలతో ఎక్కడెక్కడో తిరుగుతున్న వెంకటరాయుడు హఠాతుగా అర్ధరాత్రిపూట ఇంటికి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ రెడ్‌హేండెడ్‌గా దొరికారు. ఆవేశంతో ఇద్దర్నీచంపి పారిపోయాడు. ఏమీ ఎరగనట్లు కబురు అందుకొని వచ్చాడు. రామానాయుడి వర్గంవాళ్ళు మర్డర్స్ చేసారని ఎవరైనా అనుమానిస్తారు ప్రస్తుత పరిస్థితుల్లో. నేరం వాళ్ళమీదకు పోతుందని అనుకున్నాడు. పోస్ట్‌మార్టమ్ చేస్తే పెర్సనల్ ఇంటర్‌కోర్సు సంగతి బైట

పడుతుందని వెంకటరాయుడికి తెలుసు. తనమీదకు అనుమానం మళ్ళుతుందని ఆలోచించి పోస్ట్‌మార్టమ్ వద్దని రిక్వెస్ట్ చేశాడు." అన్నాడు డియస్పీ.

"వెపన్‌తో పాటు వెంకటరాయుడి బట్టలు నెత్తురులో తడిసినవి మన కుక్కలు వెతికి పట్టుకోగానే అతను నేరం ఒప్పుకొన్నాడు." చెప్పాడు సర్కిల్.

"చచ్చినట్లు ఒప్పుకుంటాడు. వెపన్‌మీద ఫింగర్ ప్రింట్స్ దొరికిపోయాయి గదా! పైగా నెత్తురు మరకలున్న బట్టలు అతనివే. టైమ్ లేకపోవడంతో వాటిని పొలంలో పాతిపెట్టాడు. అసలు బట్టలు పాతిపెట్టడం కంటే కాలిస్తే మనకి దొరికేవికావు. రాత్రి వాన పడుతూ వుండడంతో బట్టలు తడిసి అతని ప్రయత్నం బెడిసికొట్టి వుంటుంది." అన్నాడు డియస్పీ.

సి.ఐ. మెచ్చుకోలుగా డియస్పీ విక్రమరావు వైపు చూసాడు. □

నోట్లో నాలుక!



ముఖపత్ర సుందరి

తిరుమలశ్రీ

ఉన్నట్టుండి చిరంజీవి 'హుర్రే!' అని పెద్దగా అరవడంతో ఉలిక్కిపడి చేతిలోని సోడా బాటిల్‌ని వదిలేసాడు కిళ్ళీకొట్టు కిట్టూ.

ఆ బాటిల్ కాస్త క్రిందనున్న బల్లమీద కూర్చుని సీరియస్‌గా వార్తాపత్రికలోని రాజకీయాలను చదివేస్తున్న ఆసామీ బట్టతలమీద లాండ్ అయింది.

ఆ దెబ్బతో ఓ గావుకేక పెట్టాడతను బాధతో.

ప్రక్కనే నిలుచుని నిప్పు త్రాటితో సిగరెట్ వెలిగించు

కొంటూన్న ఓ కస్టమర్ ఆ కేకకు జడుసుకొని మూతి కాల్చుకొని కెవ్వుమన్నాడు.

సోడాకోసం నిలుచున్న మరో కస్టమర్ ఆ అరుపులకు, కేకలకు కంగారుపడి ఎందుకైనా మంచిదని వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తాడు - ఎయిర్ రెయిడ్ సైరెన్ ఆల కించిన వాడిలా.

లిప్తపాటులో జరిగిపోయిన ఆ చర్య - ప్రతి చర్యలకు మూలకారకుడైన చిరంజీవి మాత్రం మూల విరాట్టులా కూర్చున్న చోటునుంచి కదలకుండా చేతిలోవున్న 'వినయ' మాస పత్రికలో ఏదో బిజీగా చదివేస్తున్నాడు. ఎందుకో అతని ముఖం మతాబులా వెలిగిపోతోంది.

"ఏమిటోయ్, చిరంజీవీ! ఎందుకలా అరిచావ్? నీ అరుపు ఎన్ని విధాలుగా చేటు తెచ్చిందో చూడు" అన్నాడు కిళ్ళీకొట్టు యజమాని కిట్టూ చిరుకోపంతో.

"చూస్తున్నాను, గురూ! భలేఛాన్స్!" అన్నాడు చిరంజీవి, పత్రికలోంచి తల ఎత్తకుండా, కిట్టూ ఏమంటు న్నాడో బుర్రకు ఎక్కించుకోకుండానే.

"ఏం చూస్తున్నావో, ఏమో - నా బొంద!" అంటూ నొసలు బాదుకున్నాడు కిట్టూ.

చిరంజీవి దృష్టిమాత్రం 'వినయ'లోని ఆ ప్రకటన మీదే వుంది.

'వినయ ముఖచిత్రంలో
కనపడాలనుకుంటున్నారా?'

—అన్న కాప్షన్ క్రిందవున్న విషయంలోని ముఖ్యాం శాలను అర్జెంటుగా మననం చేసుకుంటున్నా డతను—

'వినయ అట్టమీద అందంగా, చూడ ముచ్చటగా ఉండే

స్త్రీల ఫోటోలు వేయాలన్నది మా ఆకాంక్ష! పదహారేళ్ళ నుండి నలభై ఏళ్ళ స్త్రీలవరకూ గల ఏ స్త్రీ ఫోటో అయినా పంపవచ్చును....'వినయ' ముఖచిత్రంగా ఎన్నికైన ప్రతి ఫోటో తాలూకు ఫోటో గ్రాఫర్‌కి 250 రూ॥లు పారితోషికం పంపగలం. అంతేగాక, 'వినయ' సంవత్సరం పాటు ఉచితంగా అందిస్తాం!'

"ఇంతకూ ఏమిటీ నీచేత అలా అరిపించిన విషయం?" అంటూ ప్రశ్నించాడు కిట్టూ ఆశ్చర్యపోతూ.

"చదు, గురూ! మంచి ఛాన్స్.... రెండువందలయాభై రూపాయల పారితోషికం!" అంటూ 'వినయ'లోని ప్రకటనను చూపించాడు చిరంజీవి అతనికి.

అది చూసిన కిట్టూ ముఖం వికసించింది. "మంచి పిట్టను పట్టావంటే నక్క తోకను తొక్కినట్టేనోయ్ నువ్వు." అన్నాడు తన భాషలో చిరంజీవిని ప్రోత్సాహపరుస్తూ.

చిరంజీవి డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగ డిపార్టుమెంటులో చేరి రెండేళ్ళయింది ఫోటోగ్రఫీ అతని హాబీ. మొదటి నుంచీ ఓ ఫోటోగ్రాఫర్ ఫ్రెండ్‌తో స్నేహం వుండడంవలన ఫోటోగ్రఫీలో మంచి ప్రవేశం కూడా వున్నదతనికి.

తమ వీధి మొగలో వున్న కిళ్ళీకొట్టు దగ్గర ఎక్కువ సమయం గడుపుతూ వుంటాడు చిరంజీవి చేసే పనేమీ లేక. అందుకే కిట్టూతో మంచి స్నేహముంది.

"ఓ అందమైన అమ్మాయి కనిపిస్తే చాలు గురూ, రెండువందలయాభై రూపాయలు మనవవుతాయి. పోస్టల్ ఆర్డర్‌లకయినా వస్తుంది. వెధవది—ప్రతిసారీ అప్లికేషన్

ఫీస్‌కి యింట్లో డబ్బు లడగాలంటే ఇబ్బందిగా వుంటోం దనుకో" అన్నాడు చిరంజీవి.

"శుభస్య శీఘ్రం. త్వరగా రంగంలోకి దిగు" అన్నాడు కిట్టూ నవ్వుతూ.

చిరంజీవి ఇంటికి వెళ్ళి కెమెరా అయితే తీసుకున్నాడు గాని, అందులోకి కలర్ ఫిల్మ్ కావాలి. తన ఫ్రెండ్ స్టూడియోకి వెళ్ళాడు. విషయం వివరించి, "ఫిల్మ్ అప్పివ్వు గురూ, పారితోషికం రాగానే కొనిచ్చేస్తాను" అని చెప్పి, ఫిల్మ్ కెమేరాలో లోడ్ చేసుకుని హుంషా రుగా బయలుదేరాడు—అందగత్తెల వేటలో—

ఉమన్స్ కాలేజ్ దగ్గరైతే అందమైన అమ్మాయిలు కనిపిస్తారు. కాని, వ్యవహారం ఏమాత్రం బెడిసికొట్టినా వొంటికి ప్రమాదం! అమ్మాయిలంతా కలిసి చాకిరేవు పెట్టెయ్యగలరు!

అందుకే పార్కువైపు నడిచాడు. త్రోవలో ఇరవై యేళ్ళ అందమైన యువతి చిరంజీవి కళ్ళలో పడింది. అతని సంతోషానికి మేర లేకపోయింది. నడిరోడ్డుమీదే ఎగిరి గంతులేయాలనిపించింది. కాని. ట్రాఫిక్ బంద్ అయిపోతుందని భయపడి మానేశాడు.

పేవ్‌మెంట్ ప్రక్కనున్న 'శారీ సెంటర్' షో కేసుల్లోంచి కనిపిస్తూన్న బొమ్మలకు కట్టిన కొత్తరకపు చీరెలను చూస్తోందామె.

"వినయ" ముఖచిత్రానికి ఆమె వందనం బావుంటుం దనుకున్నాడు చిరంజీవి, ఆమె ఫోటో జెనిక్ ఫేస్‌ని చూస్తూ.

అతను దగ్గరకు వెళ్ళేసరికే ఆమె కదిలి ముందుకు

నడిచింది. ఆమె వెనుకే నడిచాడతను జనం అడ్డుపడ దంతో ఆమెను చేరుకోలేకపోతున్నాడు. మధ్య—మధ్య ఆమె షాప్ విండోస్ దగ్గిర ఆగి బట్టలు చూస్తోంది. తీరా అతను చేరువకు వచ్చేసరికి కదిలి ముందుకు సాగుతోంది.

అలా ఆమె ముందు—అతను వెనుకగా దాదాపు ఓ కిలోమీటరు నడిచారు. క్యాచింగ్ గేమ్ ఆడుతున్నట్లు.

చివరకు ఎలాగైతేనేం—ఓ షాపు దగ్గిర నిలుచుని వున్న ఆ యువతి వద్దకు పరుగెత్తుకెళ్ళి ఆమె ముందు నిలుచున్నాడు చిరంజీవి.

మళ్ళీ ఆమె యెక్కడ కదిలిపోతుందోనన్న భయంతో కెమేరా సర్దుకుని ఆమెతో. "మిస్! మీరు చాలా అందంగా వున్నారు, ఇఫ్ యూ డోంట్ మైండ్, మీ ఫోటో తీస్తాను" అనేసి, ఆమె జవాబుకు ఎదురుచూడకుండానే, "స్మైల్ ప్లీజ్!" అన్నాడు. ఫిల్మ్ లెన్సులో ఆమెఫేస్ చూస్తూ.

అయితే—తల వంచుకుని యాంగిలూ, డిస్టెన్సూ అడ్జెస్ట్ చేసుకుంటూన్న చిరంజీవి దవడ వార్నింగు లేకుండానే అదిరిపోయింది. ఆ చప్పుడుకు బాంబు ప్రేలిందనుకుని భయంతో షాపులోంచి బయటకు పరుగెత్తుకొచ్చారంతా.

ఒక క్షణం యేమీ తెలీలేదు చిరంజీవికి. మెదడు మొద్దుబారిపోయింది.

"ఇడియట్! ఇందాకట్నుంచి కనిపెడుతున్నాను. నన్ను వెంబడిస్తూనే వున్నావు. కెమేరా ఒకటి మెళ్ళో వేలాడేసుకుని కనిపించిన ఆడపిల్లనల్లా అల్లరిపెడతావా-అందంగా

వున్నావు, ఫోటో తీస్తానంటూ!" అంటూ, ఆది చాల దన్నట్లు కాలి చెప్పుకూడా తీసింది ఆ యువతి—

తనకు చెడు వుద్దేశ్యం యేమీ లేదని ఆమెకు నచ్చ చెప్పాలనుకున్నాడు. కాని, చుట్టూ మూగిన జనాన్ని చూసే సరికి భయం వేసింది. జనానికింకా అసలు సంగతి అర్థం కాలేదు. అర్థమయ్యేసరికి చిరంజీ అక్కడ లేడు!

"జై ఉషా!" అంటూ పి. టి. ఉషను ఓసారి స్మరించుకుని కాలికి బుద్ధి చెప్పాడు.

అలా యెంతదూరం పరుగెత్తాడో తెలీదు. ఆయాసం రావడంతో. ప్రమాదం గడిచిందన్న భరోసా ఏర్పడడంతో పార్కు దగ్గరకొచ్చి ఆగాడు రొప్పుతూ.

అమ్మాయి చూస్తే సుకుమారంగా వుంది. కాని. ఆమె చేయి మాత్రం మందంగానే తగిలింది. అందుకే దవడ తిమ్మిరెక్కిపోయింది కొంతసేపు. తిమ్మిరి తగ్గాక బాగా నొప్పి గలిగింది. చేత్తో గట్టిగా రుద్దుకున్నాడు.

"డామిట్! బోణీ బేరమే బెడిసికొట్టింది!" అను కున్నాడు అలుపు తీర్చుకుంటూ.

అంతలోనే పత్రిక ఆఫర్ చేసిన పారితోషికం గుర్తుకు రాగానే నూతనోత్సాహం కలిగింది అతనిలో.

"ఆఫ్టరాల్, కష్టపడనిదే యేదీ సాధించలేం. గదా!" అని తనకు తానే సర్ది చెప్పుకున్నాడు.

పార్కు గేటు దగ్గిరే నిలుచుని వచ్చేపోయే ఫూటో లను పరిశీలనగా చూడసాగాడు ముఖచిత్రానికి పనికొచ్చే ఫేస్ కోసం.

అంతలో పార్కులో గల కోతిబొమ్మ దగ్గిర కూర్చున్న యువతిమీద పడ్డాయి చిరంజీవి చూపులు.

కోతిబొమ్మ ముందున్న లాన్‌లో కూర్చున్నదామె. ఆమె వీపు మాత్రం కనిపించింది చిరంజీవికి. ఆమె శరీర లావణ్యము, సౌకుమార్యమూ చూసి, ఆమె ముఖచిత్రానికి తప్పక పనికొస్తుందనుకున్నాడు. మెల్లగా ఆమెవైపు నడిచాడు.

ఈసారి ఆమె ముందుకు వెళ్ళడానికి జంకాడు చిరంజీవి. దవడ నొప్పి యింకా అలాగే వుండడంతో, ఎందుకయినా మంచిదని ఆమె వెనుకే నిలుచుని, "ఏమండీ! ప్రముఖ పత్రికకు ముఖచిత్రంగా అందమైన అమ్మాయి ఫోటో కావాలి. మీకు అభ్యంతరం లేకపోతే మీ ఫోటో తీసి పంపించమంటారా? అఫ్‌కోర్స్, మీకు అభ్యంతరం లేకుంటేనే సుమా! నాట్ అదర్‌వైజ్" అన్నాడు.

చివాలున వెనక్కి తిరిగిందామె. "విత్ ప్లెజర్" అంది నవ్వుతూ.

ఆమె వదనం చూడగానే 'కెవ్వు' మన్నాడు చిరంజీవి.

అంతే! అక్కడినుంచి ఒకటే పరుగు అతను!

పార్కుదాటి బయటపడ్డాక ఒకచోట ఆగి, 'మైగాడ్! రూపంచూసి మోసపోయాను. ఆమె ముఖం కంటె ఆ కోతిబొమ్మే నయం!' అనుకున్నాడు, ఆమె వంకరమూతి, ఎత్తుపళ్ళూ తలచుకుని జడుసుకుంటూ.

ఆ రెండవ అనుభవంతో మరింత నిరుత్సాహం కలిగింది అతనికి. అందమైన అమ్మాయిల ఫోటోను తీయడం అనుకున్నంత సులభం కాదేమోనన్న బెంగ ఆరంభమయింది.

నిరుత్సాహంతో కాళ్ళీడ్చుకుంటూ తోచిన దిక్కుగా నడవసాగాడు చిరంజీవి. అతని మదిలో పత్రిక ప్రకటం

చిన పారితోషికమే మెదులుతోంది. అంతమంచి బహుమతిని వదులుకోవడానికి మనసు రావడంలేదు.

అలా కొంతదూరం వెళ్ళిన చిరంజీవికి హఠాత్తుగా కన్నులు మిరుమిట్లు గొలిపాయి. కారణం ఏమిటా అని చూస్తే—ఎదురుగా, కొన్ని గజాల దూరంలో ఓ అందమైన యువతి ఓ ఇంట్లోంచి వస్తుంది. పాతికేళ్ళుంటాయి ఆమెకు. ఆకాశం నుంచి అప్పుడే దిగివచ్చిన అప్సరసలా వుంది.

ఆమెను చూడగానే, పత్రికకు కావలసిన ముఖచిత్రం అదే అనిపించింది చిరంజీవికి. అతని బుర్ర చురుకుగా పని చేసింది.

ఓసారి చుట్టూ కలయజూసాడు. జనం దగ్గరలో లేరు.

గబ-గబా కెమేరా సర్దుకుని లెన్స్ సరిచేసుకున్నాడు. డిస్టెన్స్ అడ్జెస్ట్ చేసుకున్నాడు.

అతను ఏం చేస్తున్నాడో ఆమె గ్రహించేలోపునే వివిధ కోణాల్లోంచి ఆమెను రెండు, మూడు స్నాప్స్ లాగి పారేసాడు. ఆ తరువాత మరో క్షణంకూడా అక్కడ నిలుచోకుండా అక్కణ్నించి మాయమయ్యాడు.

* * *

చిరంజీవి పంపిన అందాల యువతి ఫోటో 'వినయ' మాసపత్రికలో ముఖచిత్రంగా వచ్చింది.

అది చూసిన చిరంజీవి ఆనందానికి మేరలేకపోయింది.

కిట్టూకూడా ఫోటో చాలా బావున్నదని తెగ మెచ్చుకున్నాడు.

పత్రిక విడుదలైన మర్నాటినుంచే పోస్ట్‌మాన్ కోసం ఎదురుచూడసాగాడు చిరంజీవి, పారితోషికం వస్తుందని.

అయితే, మూడురోజుల తరువాత పోస్ట్‌మాన్‌కి బదులు పోలీసులు ప్రత్యక్షమయ్యారు చిరంజీవి ఎదుట!

పోలీసులను చూడగానే బిగిసిపోయాడు చిరంజీవి. అనుమతి లేకుండా తన ఫోటో తీసి పత్రికకు పంపినందుకు ఆ యువతి పోలీస్ కంప్లెయింట్ ఇచ్చిందేమోనని భయంవేసింది. తాను చేసిన పొరపాటు ఎంత తీవ్రమైనదో అప్పుడుగాని తెలిసిరాలేదు అతనికి.

అయితే—

పోలీసులు చిరంజీవిని అరెస్టు చేయలేదు. 'వినయ' ముఖచిత్రానికి పంపించిన ఆ యువతి వివరాలు అడిగారు అతన్ని. అవేవీ తనకు తెలియదని అతను చెప్పడంతో, ఆమె చిరునామా చెప్పమన్నారు. అదీ తనకు తెలీదనీ, కావలిస్తే ఆరోజు ఆమె ఏ ఇంట్లోంచి వచ్చిందో చూపిస్తాననీ అన్నాడు చిరంజీవి.

చిరంజీవి చూపించిన ఇంటిని ముట్టడించారు పోలీసులు. ఆ సమయంలో ఆ ఇంట్లో ఆ యువతే కాక మరో యువకుడు కూడా వున్నాడు.

పోలీసుల్ని చూసి పారిపోబోయిన ఆ యువతీ, యువకుల్ని అరెస్టుచేసి కస్టడీలోకి తీసుకున్నారు పోలీసులు.

అదంతా చూసిన చిరంజీవి తెల్లమొగం వేశాడు.

అతని అయోమయాన్ని గుర్తించిన ఇన్‌స్పెక్టర్ ఇలా అన్నాడు—"మిస్టర్ చిరంజీవీ! ఈ యువతి ఓ డ్రెడెడ్ టెర్రరిస్ట్. ఇతను ఈమె సహచరుడు. ఏడాదిక్రితం పంజాబులోని బస్‌పాసెంజర్స్ మాసేకర్‌లో పాల్గొన్న టెర్రరిస్టుల నాయకురాలు ఈమె. ఈ యువతి ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో మర్డర్స్ జరిగాయి. ఉత్తరాదిన పోలీసులు ఈమెకోసం తీవ్రంగా గాలిస్తూంటే, దక్షిణాదికి పారిపోయి

వచ్చి ఇక్కడ దాక్కున్నట్టుంది .... పోలీస్ ఏజెన్సీస్‌ని తప్పించుకు తిరుగుతూన్న ఈ మెను పట్టిచ్చిన వారికి పాతిక వేలు బహుమతినికూడా ప్రకటించింది పంజాబ్ ప్రభుత్వం. ఇన్నాళ్ళకు మీ ద్వారా బంధింపబడింది. ఈ నెల 'వినయ' పైన ఈ మె ఫోటో చూడగానే ఆరాతీసాము. ఆ ఫోటో పంపినది మీరని తెలిసింది .... సో, థాంక్స్ అండ్ కంగ్రాచ్యులేషన్స్! మీకు తెలీకుండానే ఓ డ్రెడెడ్ టెర్ర రిస్ట్ పట్టిచ్చారు మీరు పంజాబ్ ప్రభుత్వం ప్రకటించిన బహుమతిని త్వరలో నే మీకు అందజేస్తాము."

అవాక్కయిన చిరంజీవిని అక్కడే విడిచి టెర్రరిస్టు లను జీప్‌లో ఎక్కించుకుని వెళ్ళిపోయారు పోలీసులు.

తేరుకున్న చిరంజీవి, "గుడ్ గాడ్! పాతికవేలు! ట్వెంటీ ఫైవ్ థౌజండ్! క్వార్టర్ ఆఫ్ ఎ లాఖ్! .... థాంక్యూ, థ్యాంక్యూ, వినయా!" అంటూ పత్రికకు కృత జ్ఞత లర్పించాడు పట్టరాని ఆనందంతో. □

ధర్మం!

ఇదే గద్దెపై భిక్షువు బలిచక్రవర్తి శిబి చక్రవర్తి లాంటి మహానుభావులు కూర్చున్నారు

సీరియల్

నగరంలో నేరగాళ్ళు

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

అందులో నించి అందంగా వున్న పాతికేళ్ళ యువతి తళతళ మెరుస్తున్న ఇంపోర్టెడ్ చీరతో దిగి రోడ్డు పక్కనే వున్న ఫిల్ము క్యాపెట్‌ను వంగి తీసుకుని తిరిగి కారులోకి ఎక్కింది.

వెంటనే డాడ్జి కారు ముందుకు కదిలి వెళ్ళిపోయింది. ఆ సందు మొదట్లో పాన్ షాపులో కూర్చున్నతను ఆమెను గుర్తుపట్టాడు. అతనికి రోడ్డుమీద వంగి ఆమె తీసుకున్న వస్తువేమిటో తెలియలేదు.

8

కాస్ట్రో నవ్వి "వినాయక్ చాలా తెలివయినవాడు" అన్నాడు.

"అవును కాస్ట్రో - వినాయక్ నిజంగానే తెలివైన వాడు. ఆతను మా గ్యాంగ్‌లో వున్నప్పుడు అతను వేసే

పథకాలకు తిరుగులేదు. ఎంత కష్టమైన పనినైనా సుల భంగా సాధించేవాడు. అతను మాకు శత్రువుగా మారి మా చేతుల్లోనే ప్రాణాలు పోగొట్టుకోవటం నిజంగా మా బేడ్ లక్'' విచారంగా అన్నాడు ధనుంజయ్.

వాడియా సిగరెట్ ముట్టించాడు. అతని మొహం నిండా కోపం నిండి వుంది వినాయక్ చచ్చిపోయినా అతనికి కసిగానే వుంది.

"వినాయక్ ఇంత ద్రోహం చేస్తాడని అనుకోలేదు" అన్నాడు వాడియా పొగబయటకు వదులుతూ.

"అవును వినాయక్ మాకు శత్రువుగా మారిపోతాడని ఏమాత్రం వూహించినా అతన్ని ఎప్పుడో కాల్చి చంపి వుండేవాళ్ళం. అతను చచ్చిపోయినా మా నేరాలకు సంబంధించిన ఫిల్మ్ క్యాసెట్ని అతడెక్కడ దాచి వుంచాడో ఇప్పటికి కూడా తెలియలేదు. ఆ ఫిల్మ్కోసం వేట సాగిస్తూనే వున్నాం. కాస్ట్రో - ఎలాగైనా నువ్వు ఆ ఫిల్మ్ను సంపాదించిపెట్టాలి. ఆ ఫిల్మ్కోసమే యస్పీ. నాయక్ మా కంటే ఎక్కువగా ప్రయత్నం చేస్తున్నాడు." అన్నాడు జైన్ కాస్ట్రోతో.

కాస్ట్రో మాట్లాడలేదు. గ్లాసునిండా వున్న ఫారెన్ విస్కీని తాగి ఒక్కసారి ముగ్గురికేసి చూసాడు.

సిగరెట్టు ముట్టించి "మీకు తెలియకుండానే మీ నేరా లకు సంబంధించిన ఆధారాలను ఫిల్మ్లో బంధించాడంటే నిజంగా వినాయక్ అసాధ్యుడు. ఇంతకీ అతనుండే స్థావ రాలన్నీ ఫిల్మ్కోసం గాలించబడ్డాయా?" అడిగాడు కాస్ట్రో.

"అన్నీ గాలించాము. కానీ ఆ ఫిల్మ్ ఆచూకీ దొరక

లేదు. చివరగా వినాయక్ చచ్చిపోవటానికి ముందువున్న లాడ్జిగదిని పోలీసులు సోదా చేశారు అందులో మేము పోగొట్టుకున్న డబ్బు దొరికింది. కాని—ఫిల్మ్ వాళ్ళకి దొరకలేదు. ఆ ఫిల్మ్ యస్పీ నాయక్ చేతికి దొరికినట్లయితే మేమంతా జైలులో కూర్చుని చదరంగం ఆడుతూ వుండేవాళ్ళం" అన్నాడు జైన్.

సిగరెట్టు పొగవదుల్తూ కాస్ట్రో కణతలమీద రుద్దుకుని-

"వినాయక్‌కి మనకు తెలియని ముఖ్యమైన స్నేహితుడు లేక స్నేహితురాలు వుండి వుండాలని నా అనుమానం. లేకపోతే ఆ ఫిల్మ్ మీకుగాని, పోలీసులకుగాని దొరికివుండేది" అన్నాడతను.

"ఈ సిటీలో వినాయక్ స్నేహితులెవరో తెలుసుకోవటం ఎలా సాధ్యం?" అన్నాడు వాడియా.

"తెలిసికోవటం కష్టమైనా ప్రయత్నం చేయకతప్పదు" ధనుంజయ్ అన్నాడు.

సీసాలు ఖాళీ అయినాయి. చప్పట్లుకొట్టాడు జైన్. ఒక్క నిమిషానికే అర్ధనగ్నంగా వున్న ఒక యువతి ఫారెన్ విస్కీ సీసాని ట్రేలో పెట్టుకుని వయ్యారంగా నడిచి అక్కడికి వచ్చింది.

ఆమె భుజంమీద చెయ్యివేసి దగ్గరగా లాక్కుని "నీ పేరేమిటి?" అన్నాడు కాస్ట్రో.

"లైకా" అన్నదా యువతి మెలికలు తిరుగుతూ.

నలుగురి గ్లాసులలోను బాటిల్లోని మందుని వంచి ఐస్ క్యూబ్స్ వేసింది.

నలుగురు గ్లాసులను పైకెత్తి క్షణంలో ఖాళీచేసి బల్ల మీద వుంచారు.

కాస్ట్రో రాక ఆ ముగ్గురికి గొప్ప ధైర్యాన్ని కలుగ జేసింది. పోలీసులకి దొరక్కుండా ఆ ఫిల్మ్ క్యాపెట్‌ను కాస్ట్రో సంపాదించగలడని వాళ్ళకి నమ్మకం కలిగింది.

కాస్ట్రో శక్తిసామర్థ్యాలు వాళ్ళకి బాగా తెలుసు.

అంతర్జాతీయ నేరస్థులలో కాస్ట్రోకి వున్న పేరు మరే క్రిమినల్‌కి లేదు.

ముగ్గురి కళ్ళకి కాస్ట్రో మసగ్గా కన్పించాడు. కాస్ట్రో ప్రక్కనే నిల్చున్న యువతి ముగ్గురిగా కన్పించింది. కాస్ట్రో వచ్చిన సంతోషంలో ఎక్కువగానే తాగారు వాళ్లు.

"కాస్ట్రో" పిలిచాడు ధనుంజయ్.

అతన్ని చూశాడు కాస్ట్రో లైటర్‌తో సిగరెట్టు వెలిగించుకుంటూ "నువ్వు ఎంత డబ్బుతీసుకున్నా ఇవ్వటానికి మేము సిద్ధంగా వున్నాం మాకా ఫిల్మ్ కావాలి" అన్నాడు జైన్.

"భయపడకండి. కాస్ట్రో అనుకున్నది సాధిస్తాడు. ఇంతకీ యస్పీనాయక్ సంగతేమిటి?"

"అంటే?" అర్థంకానట్టు అడిగాడు ధనుంజయ్.

"యస్పీని హత్యచేస్తే మన ప్రాబ్లమ్ కొంతవరకు తీరిపోతుందా?" అడిగాడు కాస్ట్రో - జైన్ని.

"అవసరంలేదు. ఆ ఫిల్మ్ యస్పీకి దొరకనంతవరకు మాకేమీ ప్రమాదంలేదు. మా నేరాలకు సంబంధించిన ఆధారాల సహాయంతోనే యస్పీ మమ్మల్ని జైల్లోకి నెట్టే ఆలోచనలలో వున్నాడు. ఫిల్మ్‌ని సంపాదించటంలో మన ప్రయత్నాలకు అతను అడ్డుతగిలినా లేక ఆ ఫిల్మ్ అతనికి దొరికినట్టు మనకు తెలిసినా నాయక్ బతికివుండకూడదు."

అన్నాడు జైన్.

"అవును. అంతే" అన్నారు వాడియా - ధనుంజయ్.

కాస్ట్రో ఏదో మాట్లాడబోతున్నప్పుడు టెలిఫోన్ మోగింది. ఫోన్ సెట్ను లైకా తీసుకువచ్చి జైన్ ముందు ఉంచింది బల్లమీద.

జైన్ రిసీవర్ తీసుకుని "జైన్ స్పీకింగ్" అన్నాడు.

"బాస్ నేను" అవతలవైపు నించి ఫోనోలో అరిచాడు ఖాదర్.

"ఏమిటి?" విసుగ్గా అడిగాడు.

"బాస్. చాలా ముఖ్యమైన విషయం. టాప్ సీక్రెట్. వినాయక్ దాచిపెట్టిన ఆ ఫిల్మ్ క్యాసెట్ దొరికింది."

"ఈజిట్! నిజంగా దొరికిందా!?" ఆశ్చర్యంగా సంతోషంతో అడిగాడు జైన్.

"అవును బాస్. కాని ఇప్పుడది నా దగ్గరలేదు. ఇక్కడే ఎక్కడో పడిపోయింది."

"బ్రూట్. అర్థలేకుండా వాగకు. కాల్చిచంపుతాను. నీ దగ్గర వున్న ఫిల్మ్ నీకు తెలియకుండా ఏమవుతుంది?"

గబగబా అంతా చెప్పాశాడు ఖాదర్.

"డర్టీరోగ్. ఇంతకీ నువ్వు ఎక్కడ్నించి మాట్లాడు తున్నావ్?"

"అజిత్ రోడ్డులోవున్న పబ్లిక్ టెలిఫోన్ బూతులో నించి"

"నువ్వక్కడేవుండు. నేను వెంటనే అక్కడికి వస్తున్నా" రిసీవర్ పెట్టేశాడు జైన్.

"ఏమిటి ఫిల్మ్దొరికిందా?" ఆత్రంగా అడిగాడు ధనుంజయ్.

ఖాదర్ ఫోనోలో చెప్పిందంతా ఆ ముగ్గురికీ చెప్పాడు జైన్.

"క్విక్ ....మనం వెంటనే బయల్దేరాలి."

"కాస్ట్రో నువ్వూ మాతో వస్తున్నావ్"

క్షణంలో ఆ నలుగురు కార్లో అజిత్ రోడ్డుకు బయల్దేరారు.

సరిగ్గా ఎనిమిది నిమిషాల ప్రయాణం.

కార్లో వెళుతున్నంతసేపు డ్రైవ్ చేస్తున్న జైన్ నెర్వెస్‌గా ఫీలయ్యాడు. చేతికి దొరికిన ఫిల్మ్‌ను పోగొట్టిన ఖాదర్‌ను కాల్చి చంపాలనే ఆవేశం కల్గింది.

అజిత్ రోడ్డు టెలిఫోన్ బూత్ ముందుకారు ఆగేసరికి చీకట్లో నిలుచున్న ఖాదర్ కారు దగ్గరకు వచ్చాడు. అతడి చేతికి చిన్నగాయం అయింది. అతను కార్లో ఎక్కాడు.

"ఇంకొంచెం ముందుకు వెళ్ళాలి" అన్నాడు ఖాదర్.

రెండు నిమిషాలకి ఖాదర్ చెప్పిన చోటున రోడ్డుమీద కారును ఆపాడు జైన్.

"ఇక్కడే" అన్నాడు ఖాదర్ కార్లోనించి దిగి.

మిగిలిన నలుగురు కార్లోనించి దిగి చుట్టూ చూశారు. రోడ్డుమీద జనసంచారంలేదు.

ఖాదర్ - కాస్ట్రోకేసి అనుమానంగా చూశాడు.

సరిగ్గా అప్పుడే "కాస్ట్రో - ఆ ఫిల్మ్‌క్యాసెట్ ఇక్కడే ఎక్కడో పడివుంటుంది. అంతగా జనసంచారం లేని రోడ్డులో దాన్ని మరెవరో తీసుకెళ్ళే అవకాశం తక్కువ. కాబట్టి మనం ఇక్కడే వెదకాలి" అన్నాడు జైన్.

'కాస్ట్రో' తనలో తనే చిన్నగా అనుకున్నాడు ఖాదర్.

కాస్ట్రో గురించి ఇంతకు ముందు వినటమేగాని ప్రత్యక్షంగా చూడలేదు.

ఆలోచిస్తూనే రోడ్డు పక్కగా వెదుకుతున్నాడు ఖాదర్.

అప్పటికే మిగిలిన నలుగురు రోడ్డు అంచువరకు వెళ్ళి వంగి నేలను చూట్టం మొదలు పెట్టారు.

ఎక్కడా వాళ్ళకి ఆ ఫిల్మ్ క్యాసెట్ దొరకలేదు.

నలుగురు కారు దగ్గరకు వచ్చారు.

ఖాదర్ ఇంకా దూరంగా చీకట్లో నిలబడి వంగి చూస్తున్నాడు.

"ఖాదర్" పిలిచాడు ధనుంజయ్.

అతడు దగ్గరకు రాగానే "ఏం జరిగిందో క్లియర్‌గా చెప్పు" అన్నాడు.

రాజేశ్వరి దగ్గరికి వెళ్ళినప్పటినించీ, కారు గుద్దుకుని తను కిందపడి స్పృహ పోగొట్టుకునేవరకూ జరిగినదంతా చెప్పాడు ఖాదర్.

"నువ్వు చెప్తున్నదంతా నిజమేనా? వినాయక్‌లాగా తర్వాత మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజాలని ఆ ఫిల్మ్‌ని దాచిపెట్టి నాటకమాడుతున్నావా?" అనుమానంగా అడిగాడు వాడియా.

"బాస్! నన్ను నమ్మండి. నిజంగా ఇదంతా జరిగింది. నాకే ఆ ఉద్దేశం ఉంటే ఆ ఫిల్మ్ దొరికిందని మీకు ఫోను చేసి వుండేవాడ్ని కాదు. నాకు స్పృహ వచ్చేలోపల ఎవరో ఆ ఫిల్మ్‌ని తీసుకెళ్ళి వుండాలి" వణుకుతున్న గొంతుతో అన్నాడు ఖాదర్.

తను పొరపాటు చేశాడేమో అనిపించిందతనికి. ఆ ఫిల్మ్ పోయింది కాబట్టి దాని గురించి చెప్పకుండా వుండా

ల్పింది-అనుకున్నాడు,

"మైగాడ్. ఆ ఫిల్మ్ ఇంకెవరికైనా దొరికిందంటే మనం ప్రమాదంలోనే వున్నట్టు అనుకోవాలి. ఇప్పు డేమిటి చేయటం?" ఆందోళనతో అన్నాడు వాడియా.

"ఇటజ్ టూ డేంజరస్. ఆ ఫిల్మ్ దొరికిన వ్యక్తి అందులో ఏముందో తెల్సుకుని పోలీసుల కిచ్చాడంటే మీ పని అవుట్" అన్నాడు కాస్ట్రో.

ఈడ్చి మొహంమీద కొట్టాడు ధనుంజయ్-ఖాదర్ని. తూలి వెనక్కు పడ్డాడు ఖాదర్.

"డర్టీ డెవిల్. అంత విలువయిన క్యాసెట్ను పట్టుకుని నిర్లక్ష్యంగా రోడ్డు మధ్యగా నడుస్తావా? నీ అజాగ్రత్త వల్లనే దొరికిన అవకాశం జారిపోయింది. ఐ విల్ షూట్ యు" ప్యాంటు జేబులోనించి పిస్తోల్ని బయటికి తీసి ఖాదర్కు గురి చేశాడు ధనుంజయ్.

"వద్దు బాస్" బలివ్వబోతున్న జంతువులాగా అరి చాడు ఖాదర్.

"స్టాప్ ధనుంజయ్. తొందరపడకు" అన్నాడు జైన్.

వాడియా ఏదో మాట్లాడబోయేంతలో గుండెల నదర గొడుతూ పోలీసు సైరన్ విన్పించింది.

"మైగాడ్! రాజేశ్వరి హత్య పోలీసులకు తెలిసి వుంటుంది" భయం నించి తేరుకుంటూ అన్నాడు ఖాదర్.

"క్విక్" అంటూ డోరు తెరిచి కార్లో ఎక్కాడు జైన్. మిగిలినవాళ్ళు గబగబా కార్లో ఎక్కి కూర్చోగానే చిన్న జర్క్తో ముందుకు కదిలి వేగాన్నందుకుంది.

డోరు పక్కనే కాస్ట్రోని ఆనుకుని కూర్చున్నాడు

ఖాదర్.

మూడు నిమిషాలకు కారు రోడ్డు మలుపు తిరుగుతున్నప్పుడు కెవ్వున అరిచాడు ఖాదర్.

అంతా ఉలిక్కి పడి అతన్ని చూశారు.

వున్నట్టుండి డోరు తెరుచుకుంది.

ఖాదర్‌ని బయటికి నెట్టాడు కాస్ట్రో

"కాస్ట్రో, ఏం జరిగింది?" అడిగాడు జైన్.

"ఖాదర్‌ను నేనే కాల్చి చంపాను. అతనీ వృత్తికి పనికిరాడు" అన్నాడు కాస్ట్రో సైలెన్సర్ అమర్చి వున్న పిస్తోలును కోటుజేబులో పడేసుకుంటూ.

ఆ తర్వాత కొన్ని క్షణాలకు రోడ్డుపక్కనే నెత్తురు మడుగులో పడివున్న ఖాదర్ శవం దగ్గిర ఆగింది పోలీసు కారు.

* * *

ఉలిక్కి పడింది సుమిత్ర - డాక్టర్ గోవర్ధన్ కూతురు. షో కేసు ముందు నిలబడి బొమ్మల్ని చూస్తున్న అతన్ని ఇంకోసారి పరిశీలనగా చూసింది.

అవును. సందేహం లేదు అతనే. కాకపోతే డ్రస్ మార్చుకున్నాడు. అదే మొహం. తన తండ్రిని హింసించి చంపిన హంతకుల్లో అతడొకడు.

సుమిత్ర గుండె దడదడలాడింది.

ఏం చేయాలో వెంటనే నిర్ణయించుకుంది.

ఆ ముఠాలో ఏ ఒక్కరు కన్పించినా తనకి ఫోన్‌చేసి తెలియజేయమని యస్పీనాయక్ తనతో చెప్పాడు.

పేమెంట్ కౌంటర్‌మీదున్న ఎర్రటి టెలిఫోన్ సుమిత్రకు కనబడుతూనే వున్నది.

ఒక్కసారి అతడ్ని చూసింది.

ఇంకా అతను షో కేసులోని బొమ్మలను చూస్తూనే వున్నాడు. గబ గబా టెలిఫోన్ దగ్గిరకు నడిచింది సుమిత్ర. హేండ్‌బేగ్‌లో నించి యస్పీనాయక్ టెలిఫోన్ నెంబర్ వున్న స్లిప్ బయటికి తీసి ఆ నెంబరుకు డయల్ చేసింది.

క్షణంలో కనెక్షన్ వచ్చి అవతలినించి నాయక్‌గొంతు విన్పడింది

"నేనండి....డాక్టర్ గోవర్ధన్‌గారి అమ్మాయి సుమిత్రను. ఒక ముఖ్యమైన విషయం. డాడీని హత్యచేసిన మనుషుల్లో ఒకడిప్పు డిక్కడే వున్నాడు."

"ఎక్కడున్నాడు? నువ్వెక్కణ్నించి మాట్లాడుతున్నావు?" అడిగాడు నాయక్ అవతల్నించి.

"సుందరం రోడ్డులో వున్న లిటిల్ ఫ్లవర్సు ఫాన్సీ ఎంపోరియం నించి."

"నువ్వక్కడే వుండు. అతడ్ని జాగ్రత్తగా గమనిస్తూ వుండు మేము బయల్దేరుతున్నాం."

రిసీవర్ పెట్టేసి నాలుగడుగులు వెనక్కు జరిగి అతడ్నే గమనిస్తూ నిల్చుంది సుమిత్ర. కాని ఆమెకు మరో మనిషి శ్రద్ధగా యస్పీనాయక్‌తో తన సంభాషణను విన్నాడని తెలియదు.

అతనే కాస్ట్రో. ఆ క్షణంలో మారువేషంలో వున్నాడు. అతను కూడా సుమిత్ర చూస్తూన్నతన్ని గమనిస్తూ నిలబడ్డాడు.

ఐదు నిమిషాలవరకు అతను ఒక ప్లాస్టిక్ బొమ్మను ప్యాక్ చేయించుకుని ఆ ఎంపోరియంనుండి బయటికి

నడిచాడు.

వెళుతున్న అతనిని ఆదుర్దాగా చూసింది సుమిత్ర. ఎలాగయినా అతన్ని అక్కణ్నించి వెళ్ళనివ్వకుండా ఆపాలనుకుంది. కాని తను ఎదురుపడితే అతడు తనని గుర్తుపడతాడు.

సుమిత్ర అలా ఆలోచిస్తున్నప్పుడే అతను రోడ్డెక్కి నడవటం మొదలుపెట్టాడు.

అతడి వెనుకే కాస్ట్రో మెట్లు దిగి వెళ్ళి రోడ్డువారగా ఆగివున్న ఎంబాసిడర్ కార్లో కూర్చుని స్టార్టుచేశాడు.

రోడ్డు చివరగా గబగబా నడిచి వెళుతున్న అతడ్నే చూస్తోంది సుమిత్ర—యస్పీ నాయక్ త్వరగా రావాలని కోరుకుంటూ.

ఒకే ఒక్క నిమిషం—

కారువేగాన్ని పెంచాడు కాస్ట్రో. క్షణంలో కారు ముందు నడుస్తున్న అతడ్ని గుద్దుకుని మీదగా వెళ్ళిపోయింది ఆగకుండా.

రోడ్డుమీద చాలామంది అరిచారు పెద్దగా. అలా అరిచిన వాళ్ళలో సుమిత్రకూడా వుంది. ఆమె కాళ్ళు వణికాయి. అది యాక్సిడెంట్ కాదని ఆమెకు తెలుసు.

అప్పటికే నెత్తురుమడుగులో పడి వున్న అతడి శవం చుట్టూ జనం చేరారు.

సుమిత్ర ఎంపోరియం మెట్లు దిగి రోడ్డు మీదకు వస్తున్నప్పుడు పోలీసుకారు వచ్చి ఆమెముందు ఆగింది.

కార్లోనుండి దిగిన యస్పీనాయక్—సుమిత్రను గుర్తుపట్టి "అతనెక్కడ?" అని అడిగాడు.

"టూ లేట్" అంటూ కొంచెం దూరంలో రోడ్డుమీద

గుంపుగా చేరిన మనుషుల్ని చూపించిందామె.

యస్పీనాయక్ తిరిగి కార్లో ఎక్కబోయాడు. సరిగ్గా అప్పుడే ఫాన్సీ ఎంపోరియంలోనించి ఒకతను వచ్చి "సార్ మిమ్మల్ని ఎవరో ఫోన్లో పిలుస్తున్నారు" అని చెప్పాడు.

ఒకే ఒక్క సెకండు ఆలోచించాడు నాయక్. ఈ క్షణంలో తను ఇక్కడ వున్నట్టు ఎవరికి తెలుసు?

ఎంపోరియంలోకి వెళ్ళి రిసీవర్ తీసుకుని "నాయక్ స్పీకింగ్" అన్నాడు.

అవతలవైపు నుంచి నవ్వు విన్పించింది.

"ఎవరునువ్వు?"

"కాస్ట్రో"

"దగ్గరలోవున్న ఏదైనా షాపులోనుంచి మాట్లాడుతున్నావా?"

"కాదు. దూరంనించే మాట్లాడుతున్నాను. ఈ టైంకి మీరు ఫ్యాన్సీ ఎంపోరియం ముందుకు వచ్చి ఆగుతారని తెలుసు. అంతేకాదు, ఏ మనిషిని పట్టుకోవాలని వచ్చారో ఆ మనిషిని నెంబర్ లేని ఎంబాసిడర్ కారుతోనే డాష్ ఇచ్చి చంపేశాను"

"అతను నీకు శత్రువా?" అడిగాడు నాయక్.

"చెప్పను."

"కాస్ట్రో—ఈ నగరంలో అడుగుపెట్టాక ఇది నువ్వు చేసిన రెండో హత్య"

"కాదు మిస్టర్ నాయక్. ఇది నేను చేసిన మూడో హత్య" అవతల్ని ఫోన్ పెట్టేశాడు కాస్ట్రో.

* * *

రోడ్డుపక్కనే కారును ఆపాడు కాస్ట్రో.

అజిత్ రోడ్డు రాత్రి ఏడుగంటల సమయంలో ఎక్కువ సందడిగా లేదు. ఆరోడ్డు చివరకు వెళితే లేబర్ కాలనీ వుంది. ఇక ఆ ప్రాంతమంతా ఎక్కువ పేదవాళ్ళతోనే నిండి వుంటుంది.

కాస్ట్రో నెత్తిమీద నల్లటి టోపీ పెట్టుకున్నాడు. పీలం రంగు షర్టును నల్లటి ప్యాంటులోకి దోపుకున్నాడు.

కారును ఆపినా వెంటనే అందులోనించి దిగలేదు అతను—రెండు నిముషాలు కార్లోనే కూర్చుని అప్పు డప్పుడు నడిచే, వాహనాలమీద వెళుతున్న మనుషుల్ని చూశాడు.

ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు జైన్ మెటల్ ఇండస్ట్రీకి ఎవరో ఫోన్ చేశారు.

ముగ్గురి ఘరానా పెద్దమనుషుల నేరాలను బంధిం చిన ఫిల్మ్ క్యాసెట్ తనదగ్గర వుందనీ, యాభై లక్షలు ఇస్తే ఆ ఫిల్మ్‌ని ఇచ్చేస్తాననీ ఫోన్ చేశాడు. మళ్ళీ రాత్రి ఎనిమిది గంటలకు ఫోన్ చేస్తాననీ—బేరం కుదరకపోతే ఆ ఫిల్మ్‌ను ఐ జి.ఆఫ్ పోలీస్‌కు అందజేస్తాననీ అన్నా డతను.

అతనెవరో తెలీదు.

ఏదో పబ్లిక్ టెలిఫోన్ బూత్ నించి ఫోన్ చేసి వుండాలి.

యాభై లక్షలు అతనికిచ్చి ఆ ఫిల్మ్‌ను తీసుకోటానికి జైన్-వాడియా-ధనుంజయ్ సిద్ధంగా లేరు. ఆ ఫిల్మ్‌కోసం ఒకసారి డెబ్బయ్ఐదు లక్షలు నష్టపోయారు. అందుకే ఆ బ్లాక్ మెయిలర్ ఎవరో కనిపెట్టి అతడ్ని అంతంచేసి ఆ

ఫిల్మ్ తీసుకురమ్మని కాస్ట్రోని పంపారు వాళ్ళు.

కాస్ట్రో తెలివితేటలకు—శక్తిసామర్థ్యాలకు ఇదొక పరీక్ష.

కార్లోనించి దిగాడు కాస్ట్రో.

వీధి దీపాలు వెలుగుతున్నాయి. అక్కడక్కడ వున్న షాపుల్లో అంతగా జనం లేరు.

కారుదాటి రెండడుగులువేసి అతడు పేవ్‌మెంట్ మీద నిలబడ్డాడు. ఆ షాపులన్నీ రాత్రి ఎనిమిది గంటలకే మూత పడతాయి. ఎనిమిదిగంటలతర్వాత రాత్రి పదిగంటలుదాటే వరకు తెరిచివుండేవి పాన్‌షాపులే—

క్రితంరాత్రి ఖాదర్ ఫిల్ముక్యాపెట్‌ను పోగొట్టుకున్న ప్రదేశంలోనే వున్నాడతను. అక్కడే నిలబడి రోడ్డుకు రెండువైపులా చూశాడు.

అప్పుడు పడింది అతడి దృష్టి తెరిచివున్న ఓ పాన్ షాపుమీద. అది ఆ సందు మొదట్లో వుంది. రాత్రి అది మూసి వుండటంవల్ల దాన్ని గమనించలేదు అతడు.

చిన్నగా నడిచి రోడ్డును క్రాస్‌చేసి అవతలివైపుకు వెళ్ళాడు.

పెద్ద పెద్ద అంగలతో సందు మొదట్లో వున్న పాన్ షాపు దగ్గిరకు వెళ్ళాడు. అప్పుడు షాపులో కూర్చున్న యువకుడు ఏదో డిటెక్టివ్ నవల చదువుకుంటున్నాడు.

చిన్నగా దగ్గాడు కాస్ట్రో.

అతను కాస్ట్రోను చూసి "ఏంకావాలి?" అనడిగాడు.

"ఒక ఇన్ఫర్‌మేషన్ కావాలి" సిగరెట్టు వెలిగించుకుని అన్నాడు.

"ఎవరు మీరు."

"సీక్రెట్ పోలీస్"

అతను బెదురుతూ కాస్ట్రోవైపు చూశాడు.

కాస్ట్రో సీరియస్‌గా అతడి కళ్ళల్లోకి చూసి "రాత్రి నువ్వు ఎన్ని గంటలకు షాపు మూశావు?" అనడిగాడు.

"ఎందుకు?" అన్నాడతను భయంగా—

"షటప్.... ఇది పోలీసు ఎంక్వయిరీ నువ్వు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. అంతే. చెప్పు.... రాత్రి ఎన్నిగంటలకు నువ్వు షాపు మూశావ్?"

అతను భయపడి "పదిన్నర కావస్తోన్నప్పుడు" అన్నాడు వెంటనే.

"ఈ రోడ్డులో ఒక మనిషి కారుకు గుద్దుకుని పడి పోయాడు. నువ్వు చూశావు. అవునా?"

"చూళ్ళేదు."

"నిజంచెప్పు.... అదిగో .... అక్కడే" చూపించాడు కాస్ట్రో.

"నిజంగా చూళ్ళేదు. నాకు డిటెక్టివ్ నవలలు చదివే పిచ్చి వుంది. నవల చదువుతుంటే నాకేమీ తెలీదు. రాత్రి కూడా రెండు నవలలు చదివాను."

"రాత్రి నువ్వు ఇంకేం చూశావ్? రోడ్డున వెళుతున్న ఎవరికయినా రోడ్డుమీద ఏదయినా దొరికిందా? ఎవరైనా ఒంగి ఏదయినా తీసుకోవటం నువ్వు చూశావా?" అతను చూసి వుంటాడని నమ్మకం లేకపోయినా అడిగాడు కాస్ట్రో.

ఒకే ఒక్క సెకండ్ ఆగి "ఆ... చూశాను" అన్నాడు ఉత్సాహంగా—

"గుడ్ — ఏం చూశావ్?" సిగరెట్టు ముక్కను

దూరంగా విసురుతూ అన్నాడు కాస్ట్రో.

"రాత్రి ఒక కారు ఆగింది. అది డాడ్జికారు. అందులో నించి ఒకామె దిగి రోడ్డుమీద వొంగి ఏదో వస్తువు తీసుకుని మళ్ళీ కారెక్కి వెళ్ళిపోయింది."

"వెరీగుడ్ ...ఆమె తీసుకున్న వస్తువేమిటో నువ్వు చూశావా?"

"లేదు. ఏదో ప్యాకెట్టులాగా వుంది. దూరంగా వుండటంతో సరిగ్గా కనపడలేదు."

"ఆ డాడ్జి నెంబర్ చూశావా?"

"చూడలేదు. కాని ఆమె నాకు తెలుసు" అన్నాడతను.

"తెలుసా!! ....ఐతే చెప్పు....ఎవరామె?"

"డార్జిలింగ్ హోటల్లో డాన్సుచేసే క్యాబరే డాన్సర్. పేరు సలీమా."

"ఆమె ఇల్లు తెలుసా?"

"ఎక్కడో తెలీదు. కాని ఆమె రోజూ ఇటే వెళుతుంది. సి.ఐ.టీ. కాలనీ అని గుర్తు."

కాస్ట్రో జేబులోనించి పర్సు బయటకు తీసి అతడి మొహంలోకి చూసి నవ్వాడు. నవ్వుతూనే వందరూపాయల నోటుతీసి అతని కివ్వబోయాడు.

అతను తీసుకోలేదు.

"వద్దు పోలీసులకు ఇవ్వాలి....కాని వాళ్ళ దగ్గర తీసుకోకూడదు" అన్నాడు.

"తీసుకో....మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చావు....ఈ విషయం ఎవ్వరికీ తెలీగూడదు. ప్రమాదం" అంటూ ఆ వందరూపాయల నోటును అతడిముందు పడేసి రోడ్డు మీదకు వచ్చాడు.

ఖాళీగా వెళుతున్న ఆటోని ఆపి ఎక్కి కూర్చుంటూ "సి.ఐ.టి. కాలనీ" అన్నాడు కాస్ట్రో.

*　*　*

"యాభై లక్షలు" అన్నాడతను.

అతడి పేరు రంగన్. అతను సోఫాలో సలీమా పక్కనే కూర్చున్నాడు.

"అవును. ఈ దేశం వదిలివెళ్ళిపోవచ్చు. అనుకోని అదృష్టం...." అన్నది సలీమా మెరుస్తున్న కళ్ళతో—

లిప్‌స్టిక్ వేసుకున్న దొండపండుల్లాంటి ఎర్రటి ఆమె పెదవులు ఫ్లోరోసెంట్ దీపం కాంతిలో తళతళమని మెరుస్తున్నాయి.

ఆమె చెంపల్ని నిమిరాడతను.

"ఆ ఫిల్మ్ రోడ్డుమీద నీకు కనబడటం నిజంగా లక్. ఏ దేశానికి వెళ్ళిపోదాం? డబ్బు చేతికి దొరగ్గానే ఈ దేశం వదిలి వెళ్ళిపోయే యేర్పాట్లు నేను నిముషాల్లో చేస్తాను" అన్నాడు రంగన్ ఆమె చెక్కిళ్ళు నిమురుతూనే—

సలీమా అతడ్ని ప్రేమతో చూసింది.

ఆ రోజు డార్జిలింగ్ హోటల్‌లో ఆమె ప్రోగ్రాం లేదు. బొంబేనించి వచ్చిన మైనా స్పెషల్ ప్రోగ్రాం వుంది. అందుకే సలీమా ఇంట్లో వుంది.

రంగన్ ఆమెను ప్రేమించాడు. సలీమా కోసం చాలా డబ్బు ఖర్చుచేశాడు. ఆమెను పెళ్ళిచేసుకోటానికి సిద్ధంగా వున్నాడు.

"ఒక రౌండ్ వేస్తాను" అన్నాడు రంగన్ లేచి నిల్చుంటూ.

"వద్దు.........మందు తాగటానికి అంత తొందరెందుకు? నువ్వు వాళ్ళకి మళ్ళీ ఫోన్ చెయ్యాలి. తాగొద్దు" అన్నది.

"ఏం చేద్దాం?"

"ఆలోచించు....వాళ్ళు ఒప్పుకుంటే డబ్బును మన దగ్గిరకు ఎట్లా చేర్చుకోవాలో ఆలోచించు...."

"వాళ్ళు ఒప్పుకోనీ....ఆ ప్లాన్ ఆలోచనకు ఒక్క నిముషం చాలు."

"యాభై లక్షలకు వాళ్ళు ఒప్పుకుంటారా?"

"చచ్చినట్టు ఒప్పుకుంటారు."

"వాళ్ళు క్రిమినల్స్....వాళ్ళతో మనం డీల్ చెయ్యగలమా?" అనుమానంగా అడిగింది సలీమా....

రంగన్ నవ్వాడు.

"నీకు తెలీదు ఇప్పుడు మనం కూడా క్రిమినల్సమే. మనం వాళ్ళని బ్లాక్ మెయిల్ చేస్తున్నాం. బ్లాక్ మెయిల్ చేసేవాళ్ళు కూడా క్రిమినల్స్ జాబితాలోకి వస్తారు....అవకాశం దొరికినప్పుడు రిస్క్ తీసుకోవటంలో తప్పు లేదు. చూద్దాం — ఏం జరుగుతుందో?" అన్నాడతను.

"నా కెందుకో భయంగా వుంది రంగన్! మనల్ని ఎవరైనా ట్రేస్ చేశారంటే ప్రమాదం. ప్రాణాలతో వదలరు. యాభై లక్షలు ఇవ్వటానికి ముందు మనల్ని పట్టుకోటానికే ప్రయత్నం చేస్తారు! నువ్వు ఆలోచించావా ఇవన్నీ?" అన్నది సలీమా.

"మనల్ని ట్రేస్ చెయ్యటం సాధ్యం కాదు డియర్....నువ్వు ఆ ఫిల్మ్ ప్యాకెట్టును రోడ్డుమీద తీస్తున్నప్పుడు యెవరయినా చూశారా?..." రంగన్ అడి

గాడు.

"నేను గమనించలేదు. చూసే అవకాశం లేదు. రోడ్డు మీద యెవ్వరూ లేరు. షాపులన్నీ మూసివున్నాయి. కాని ఒకే ఒక్క షాపు తెరిచివుంది. ఆ షాపులో కూర్చున్న మనిషి నన్ను చూశాడేమో నేను గమనించలేదు."

"ఏ షాపు?"

"రోడ్డు పక్కనే వున్న పాన్ షాపు. ఆ పాన్ షాపు ఒక్కటే రాత్రి పదిన్నరదాకా తెరిచివుంటుంది. ఆ షాపు వాడు నన్ను చూస్తే చూసివుండొచ్చు. అవును. ఆలోచిస్తుంటే ఇప్పుడు గుర్తుకొస్తోంది? ఫిల్మ్ తీసుకుని వెనక్కి తిరుగుతున్నప్పుడు చూశాను. అతను నన్నే చూస్తున్నాడు" అలా చెబుతున్నప్పుడు సలీమా కళ్ళలో అతడికి భయం కనబడింది.

"మైగాడ్....నీ ఆలోచన సరయినదే. ఆ ఫిల్మ్‌ను పోగొట్టుకున్న మనిషి దాన్ని వెతుక్కుంటూ వస్తే తప్పకుండా ఆ పాన్‌షాపులో వున్నవాడ్ని ఎంక్వయిరీ చేస్తాడు. అతడు చెబుతాడు. అతను నీ కారు నెంబర్ని గుర్తుపెట్టుకొని వుంటే?"

"కారు నెంబరు గుర్తుపెట్టుకోవాలనే ఆలోచన అతడికి ఎందుకు వస్తుంది?" అన్నది సలీమా.

"రావొచ్చు....రాకపోవచ్చు........కాని కొంతమంది గుర్తుపెట్టుకుంటారు. చాలా సులభంగా గుర్తుండే నెంబరు నీ కారుకుంది....నాలుగు ఒకట్లు ఎవరికైనా గుర్తుంటాయి. అన్నింటినీ మించి నువ్వు ఈ సిటీలో చాలా మందికి తెలుసు. డార్జిలింగ్ హోటలువాళ్ళు చాలాసార్లు నీ ఫోటోను వాల్‌పోస్టర్ల మీద, పాంప్లెట్స్‌మీద వేశారు. అతను నిన్ను గుర్తుపట్టి వుంటే నిజంగా మనకు

ప్రమాదం....” అన్నాడు రంగన్ కొంచెం భయాన్ని కళ్ళలో బయటపెడుతూ—

ఇదివరకటి ధైర్యం అతన్లో లేదని సలీమా తెలుసు కుంది.

“నీకు ముందే చెప్పాను ఆ ఫిల్మును పోస్టులో పోలీసు లకు అందజేద్దామని. కాని నువ్వు వినలేదు. దాన్నడ్డం పెట్టు కుని లక్షలు సంపాదించవచ్చని చెప్పావు. నేను కూడా ఆశపడ్డాను.”

“వర్రీ అవకు సలీమా....ఆ పాన్‌షాపువాడు చెప్ప కుండా వుంటే మన్నల్ని ఎవ్వరూ ట్రేస్ చెయ్యలేరు. వాడు నిన్ను గుర్తుపట్టాడో లేదో ముందు తెలుసుకో వాలి. ఆ తర్వాతనే మనం ఈ విషయం గురించి ఆలో చించాలి.”

“అతడ్ని నువ్వు కలుసుకుంటావా?”

“అవును.”

“ఇలా అడిగితే అతడికి అనుమానం రాదూ?”

“రాదు. రాకుండా అడుగుతాను. జాగ్రత్తగా వుండు. గంటలో తిరిగొస్తాను.”

రంగన్ నిలబడ్డాడు. చేతి నున్న వాచీ చూసు కున్నాడు.

సలీమా సోఫాలోనే కూర్చునివుంది దిగులుగా.

రంగన్ తలుపు దగ్గరకు నడిచి బోల్టు తీశాడు. అంతే—పెద్దగా అరుస్తూవచ్చి సలీమా కాళ్ళ దగ్గిర పడి పోయాడు.

ఉలిక్కిపడి చూసింది సలీమా—

ఇద్దరూ భయంగా తలుపువైపు చూశారు.

తలుపు తగిలిన చోట మొహాన్ని రుద్దుకుంటూ తలుపు దగ్గిర నిల్చున్న ఆరడుగుల మనిషిని చూస్తూ "ఎవరున్నవు?" అన్నాడు రంగన్.

"కాస్ట్రో."

"నీ పేరు ఎప్పుడో విన్నాను" అన్నాడు రంగన్.

"ఇప్పుడు యిక్కడ కూడా విన్నావు" అన్నాడు కాస్ట్రో మళ్ళీ తలుపుకు బోల్టు బిగిస్తూ—

"ఎవరు కావాలి? నువ్వెవరో మాకు తెలీదు" అన్నది సలీమా అతని రూపాన్ని పరిశీలనగా చూస్తూ—

"నాకు తెలుసు...నువ్వు సలీమా! ఇతని పేరు తెలీదు. చెబితే తెలుసుకుంటాను" అన్నాడు కాస్ట్రో.

"రంగన్" అన్నది సలీమా.

"గుడ్ ....నా పేరు కాస్ట్రో అని చెప్పాను. ఇంటర్నేషనల్ క్రిమినల్ని. మీ దగ్గిరున్న ఫిల్మ్ కోసం వచ్చాను" అన్నాడు.

వాళ్ళిద్దరూ షాక్ ఫీలయినా భయంగానే కాస్ట్రోని చూశారు.

ముందుగా రంగన్ నోరు తెరిచి "ఏ ఫిల్మ్?...." అన్నాడు—

కాస్ట్రో ముందుకు నడిచి కిందపడివున్న రంగన్ని షర్టు పట్టుకుని పైకి లేపదీసి ఈడ్చి మొహంమీద కొట్టాడు.

కీచుమని అరుస్తూ సోఫామీద పడ్డాడు రంగన్.

అతడి పెదిమ పగిలింది. నోట్లోనించి నెత్తురు షర్టు మీదకు కారింది.

సలీమా కంగారుగా చూసింది రంగన్‌ని.

"వెధవలాగా ప్రవర్తించకు రంగన్. కొన్నాళ్ళక్రితం ఇండియాలోని ఒక సిటీలో కాస్ట్రో చేసిన హత్యల గురించి నువ్వు గుర్తుచేసుకుని వుంటే నా ముందు అబద్ధం చెప్పి వుండేవాడివికాదు. ఇప్పటికి రెండు రోజుల్లో మూడు హత్యలుచేశాను. మీరు మొండికేస్తే ఇంకో ఐదు నిముషాల్లో అవి ఐదు హత్యలవుతాయి. చెప్పు ...ఎక్కడుంది ఆ ఫిల్ము క్యాసెట్?" అన్నాడు కాస్ట్రో ప్యాంటు జేబులోనించి పిస్తోలు బయటకు తీస్తూ—

రంగన్—సలీమా కేసి చూశాడు.

"బుకాయించి ప్రయోజనంలేదు. పాన్‌షాపులో మనిషి నిన్ను గుర్తుపట్టాడు సలీమా ...డాడ్జికారు ఆపి రోడ్డుమీది ఫిల్ము కేసెట్‌ను నువ్వు తీసుకుని కారెక్కటం అతను చూశాడు. ఐతే ఆ వస్తువేమిటో అతనికి తెలీదు. ఇక మీరు తప్పుకోలేరు. ఆ ఫిల్ము ఇవ్వండి వెళ్ళిపోతాను. నాకు ఎక్కువ టైంలేదు. క్విక్" అన్నాడు కాస్ట్రో సిగరెట్టును లైటరుతో ముట్టించుకొంటూ—

ఆశ్చర్యంగా చూశాడు రంగన్—కాస్ట్రోని.

ఇంత త్వరగా వాళ్ళు తమని ట్రేస్‌చేసి ఇంటికే వస్తారని అనుకోలేదు రంగన్—తను పొరపాటుచేసినట్టు అతను తెలుసుకొన్నాడు.

ఇప్పుడేమిటి చెయ్యటం?

తప్పదు.

నెగిటివ్ ఫిల్ము‌ను, డెవలప్‌చేసిన ప్రింటును కాస్ట్రోకి ఇచ్చెయ్యాలి. లేకపోతే అతను చంపుతాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఇప్పుడు మీ ఇద్దరిప్రాణం

ఖరీదు యాభై లక్షలు. అంటే ఫిల్ముకోసం నువ్వడిగిన యాభై లక్షల్ని మిమ్మల్ని ప్రాణాలతో వదిలినందుకు సరిపెడతాను''.

"ఆశకొద్దీ బ్లాక్ మెయిల్ చేశాం....ఆ ఫిల్ము తీసుకెళ్ళు" అన్నది సలీమా.

"గుడ్. లేవండి....ఫిల్ము ఎక్కడుందో చూపించండి" అన్నాడు కాస్ట్రో పిస్తోలు వూపుతూ—

సలీమా—రంగన్ నిలబడి పక్కనేవున్న గదిలోకి నడిచారు తలుపులను నెట్టుకొని.

ముందు వాళ్ళిద్దరు — వెనుక పిస్తోలు పట్టుకుని కాస్ట్రో—

రెండుగదులు దాటి మూడో గదిలోకి వెళ్ళారు.

ఆ గదిలోనేవుంది ఐరన్ సేఫ్.

రంగన్ వెనుకే నిలబడివున్నాడు కాస్ట్రో. ఒక్క నిముషం ఆలోచించాడు రంగన్. పిస్తోలు పట్టుకున్న కాస్ట్రో చెయ్యి రంగన్ చేతిపక్కనేవుంది. చేత్తో పిస్తోలును ఎగరకొట్టెయ్యొచ్చు. కాని ఆ తర్వాత అతనితో తను తలపడగలడా? అతడితో చెయ్యికలిపి గెలవగలడా? కాస్ట్రోకంటే తను బలవంతుడుకాదు. యుక్తితో అతడ్ని దెబ్బతీయాలి. విలువైన ఆ ఫిల్ము క్యాసెట్‌ను అతనికి ఇవ్వకూడదు. అతడికిచ్చినా అందులోవున్న రహస్యాలను తెలుసుకున్న తనని, సలీమాను ప్రాణాలతో వదిలి వెళతాడనే నమ్మకం కూడా లేదు. అందుకే సాహసం చేయాలి.

"ఊ....తెరు" పిస్టలు వూపుతూ అన్నాడు కాస్ట్రో.

సేఫ్ తెరుస్తున్నట్టు నటిస్తూ సలీమా వైపు చూసి

కన్ను గీటాడు. ఆశ్చర్యంగా రంగన్‌ని చూసింది ఆమె.

సేఫ్ తలుపు తెరిచి హటాత్తుగా చెయ్యెత్తి కాస్ట్రో చేతి మీద కొట్టాడు రంగన్.

పిస్టలు ఎగిరి దూరంగా పడింది.

రంగన్ ప్రతిఘటిస్తాడని కాస్ట్రో వూహించలేదు. వాళ్ళిద్దరూ భయపడ్డారనే అనుకొన్నాడతను.

పిస్టలు ఎగరగొడుతూనే కాస్ట్రో డొక్కలో మోచేత్తో గట్టిగా పొడిచాడు రంగన్.

కాస్ట్రో వెనక్కు వంగి కిందపడుతూ రంగన్ కాలు పట్టుకుని లాగాడు.

కిందపడ్డాడు రంగన్. పడుతూనే పెద్దగా అరిచాడు -
"సలీమా - పిస్టలు తీసుకొని కాస్ట్రోని కాల్చు"

వెంటనే అక్కడ్నించి కదిలింది సలీమా - గోడవారగా విండో దగ్గర పడివున్న పిస్టలు దగ్గరకు నడిచింది.

పడుకునే రంగన్ భుజంమీద గట్టిగా తన్నాడు కాస్ట్రో. అతడికి కసిగావుంది. తనకంటే బలహీనుడయిన రంగన్ తనకు ఎదురు తిరగటాన్ని కాస్ట్రో సహించలేక పోయాడు.

దూరంగా పడిన రంగన్ లేచి సలీమా దగ్గరకు పరిగెత్త బోయాడు. అప్పుడే వొంగి పిస్టలు తీసుకుంటోన్నది సలీమా—

రంగన్‌కు పరిగెత్తే అవకాశాన్నివ్వలేదు కాస్ట్రో. కిందకు జారి కాలితో రంగన్‌ని తన్నాడు. కాస్ట్రో మీదపడి పోయాడు రంగన్. పడుతూనే మళ్ళీ అరిచాడు.

"సలీమా .... అతన్నికాల్చు" ఆలస్యం చెయ్యకుండా

పిస్టలు పేల్చింది సలీమా—

"ఢాం"

కెవ్వున అరిచాడు రంగన్. అతడి తల్లోకి వెనుకనించి దూరిపోయింది పిస్టలుగుండు.

కాస్ట్రో మీద పడుతూనే సలీమాను కాల్చమని పక్కకి దొర్లే ప్రయత్నాన్ని చేశాడు రంగన్. కాని అతని ఎత్తే మిటో తెలుసుకున్న కాస్ట్రో రంగన్ని పక్కకు దొర్లనీయకుండా తనకు కవచంగా అడ్డు పెట్టుకున్నాడు.

నెత్తురు బయటకు వచ్చింది తల్లోంచి.

నేల మీద వాలిపోయాడు రంగన్. అతడి ప్రాణం వెంటనే పోయింది.

భయంతో అరిచింది సలీమా పిచ్చిగా—

అరిచి షాక్‌తో పిస్తోలు పట్టుకుని అక్కడే నిలబడిపోయింది. కాస్ట్రో లేచి వచ్చి ఆమె చేతిలో పిస్తోలు లాక్కుని బలంగా చెంపమీద కొట్టినప్పుడు ఆమె వులిక్కిపడి షాక్‌నించి తేరుకుంది.

"రంగన్‌ని నువ్వే కాల్చి చంపావు" అన్నాడు కాస్ట్రో.

సలీమా మాట్లాడలేదు. తల్లోనించి నెత్తురు కారుతున్న రంగన్ శవాన్ని చూస్తూ నిలబడిపోయింది.

"ఫిల్ము బయటకు తియ్యి" అన్నాడు కాస్ట్రో.

ఆమె అతడ్ని చూసి కదల్లేదు.

"నిన్ను నేను చంపుతాను" పిస్తోలు ఆమెకు గురి చేశాడు.

సలీమా అక్కడ్నించి సేఫ్ దగ్గరకు వెళ్ళి లోపలి అర తెరిచి చూసింది.

ఈసారి ఆమెకు పూర్తిగా మతిపోయింది.

"ఫిల్మ్ లేదు. ఎవరో తీసుకెళ్లారు" అన్నది వణుకు తున్న గొంతుతో.

"యూ చీట్" సలీమా చెంపమీద కొట్టాడు కాస్ట్రో.

ఆమె బాధగా అరుస్తూ కింద పడింది.

కాస్ట్రో గబగబా సేఫ్ మొత్తం వెతికాడు. నిజంగానే అతడికి ఫిల్మ్ దొరకలేదు.

"ఎక్కడ దాచారు? నిజం చెప్పు" కర్కశంగా అడిగా డతను.

"ఇక్కడే దాచి వుంచాం. ఎవ్వరికి తెలీదని సేఫ్‌కు తాళం కూడా వెయ్యలేదు."

"ఐతే ఎవరు తీశారు?"

"తెలీదు"

"రంగన్ నీకు తెలీకుండా దాచి వుంటాడా?"

"తెలీదు. అతను అటువంటివాడు కాదు."

"ఐతే నువ్వు అతనికి తెలీకుండా దాచిపెట్టావా?"

"లేదు. నిజమే చెబుతున్నాను. నన్ను నమ్ము కాస్ట్రో" దీనంగా అన్నది సలీమా.

"రంగన్‌ని నువ్వు నిజంగా ప్రేమించావా?" కాస్ట్రో అడిగాడు.

"అవును. ఇద్దరం పెళ్ళి చేసుకోవాలని అను కున్నాం."

"అతను ఇప్పుడు లేడు. అతను లేకుండా నువ్వు బతకగలవా?"

సలీమా మాట్లాడకుండా అతడ్ని చూసింది.

"బతకలేవు, నువ్వు బతక్కూడదు. నువ్వు కూడా

రంగన్‌ని కలుసుకోవాలి."

"ఢాం" పిస్తోలు పేలింది.

కెవ్వుమన్నది సలీమా—

వెనక్కు వొరిగిపోయింది. ఆమె గుండెల్లో దిగి పోయింది పిస్తోలు గుండు. క్షణంలో ప్రాణం పోయింది.

రెండు శవాలను చూస్తూ ఐరన్ సేఫ్ ముందు నిలబడి సిగరెట్ ముట్టించాడు కాస్ట్రో. పొగ వదులుతూ ఆ ఇంట్లో వున్న గదులన్నిటిపీ ఫిల్ము కోసం వెతకటం మొదలుపెట్టాడు.

గంటసేపటికి ఖాళీ చేతులతో కాస్ట్రో ఆ ఇంట్లోనించి బయటకు నడిచాడు.

9

ఐ. జి. ఆఫ్ పోలీస్ కార్యాలయం.

యస్. పి. నాయక్— ఐ. జి. ఎదురుగా తల వంచు కుని కూర్చున్నాడు. ఆయనకు ఇన్సల్టింగ్‌గా వుంది.

"ఎన్నాళ్ళీ హత్యలు మిస్టర్ నాయక్? వీటిని ఆపటం మన డిపార్టుమెంటుకు సాధ్యం కాదంటారా?" అన్నాడు ఐ. జి.

"చిత్రమైన పరిస్థితి - నేరస్థు లెవరో తెలుసు. ఎందుకు ఈ హత్యలు చేస్తున్నారో తెలుసు. ఐనా వాళ్ళని పట్టుకుని ఈ హత్యలను ఆపటానికి సాక్ష్యం లేదు. మనం సేకరిం చిన సాక్ష్యాలన్నింటిని వాళ్ళు తెలివిగా నాశనం చేస్తు న్నారు. ఐ ఫీల్ షయ్" బాధగా అన్నాడు నాయక్.

"బాధపడి ప్రయోజనం లేదు. ఏదో ఒక వ్యూహం

పన్ని వాళ్ళందరినీ పట్టుకోవాలి....ఇంతకీ వినాయక్ మీకు ఫోన్‌చేసి చెప్పిన ఆ ఎవిడెన్స్ ఎక్కడ వుందో సూచనగా ఐనా తెలుసుకోగలిగారా?" ఐ. జి. అడిగాడు సిగరెట్ వెలిగించి—

"లేదు. ఆ సాక్ష్యం కోసమే ఈ హత్యలన్నీ జరుగుతున్నాయి. సూచనగా కూడా అది ఎవరి దగ్గిర వుందో తెలీలేదు. వినాయక్ బసచేసిన హసీనా లాడ్జి గదిలో డబ్బు, మేకప్ బాక్సు తప్పించి నేరస్థులకు సంబంధించిన ఇంకే ఇతర ఆధారమూ దొరకలేదు. కాని శత్రువులు తెలివిగా మనకంటే ముందు ఆ ఎవిడెన్స్‌ను ట్రేస్ చేస్తున్నారు. కాని అది వాళ్ళకు దొరకటం లేదు. చేతులు మారుతూ వుండాలి. అందుకే ఈ హత్యలు. హత్యలు ఆగిపోయాయంటే ఆ ఎవిడెన్స్ వాళ్ళకు దొరికినట్టుగానే మనం అనుకోవచ్చు."

"అవును. ఇప్పుడు మనకీ వాళ్ళకి కావలసింది వినాయక్ వాళ్ళ నేరాలను రుజువు చేస్తూ సంపాదించిన సాక్ష్యం. ఏలాగైనా దాన్ని మనమే సంపాదించాలి."

"ప్రయత్నం చేస్తున్నాం సర్....ఆ ముగ్గురు నేరస్థులనూ జైల్లోకి నెట్టాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తూనే వున్నాను. కాని చాలా వేగంగా వాళ్ళు మూవ్ అవుతున్నారు. వాళ్ళని నేరస్థులుగా రుజువుచేసే సాక్ష్యం దొరకటం లేదు. ఇప్పటివరకూ వాళ్ళదే పైచెయ్యి."

"కావొచ్చు....వేగంగా మూవ్ అయ్యే మనుషులు ఏదో ఒక పొరపాటు చేస్తారు. దొరికిపోతారు. వాళ్ళు చేసే పొరపాటు కోసం ఎదురు చూస్తూ కూర్చునే అవకాశం మనకు లేదు. మనం కాస్ట్రో గురించి మరచిపోకూడదు.

కాస్ట్రో పెద్ద శాడిస్టు. కారణం లేకుండానే హత్యలు చేసే మనిషి'' అన్నాడు ఐ.జి. లేచి నిల్చుంటూ.

"కాస్ట్రో గురించి మనం సిటీలో వున్న మనుషులకు తెలియజెయ్యటం మంచిదనుకుంటాను సర్. ఎవరయినా కాస్ట్రోను గుర్తుపట్టి జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది'' అన్నాడు నాయక్ ఐ.జి.ని చూస్తూ.

"నో....కాస్ట్రోని రెచ్చగొట్టటం మంచిది కాదు. అతన్ని ఆపటం కష్టమవుతుంది.........అతను కన్నింగ్ ఫాక్స్. ఊసరవెల్లిలా రంగులు మారుస్తాడు. అతడ్ని సాధారణ పౌరులు గుర్తుపట్టి మనకు తెలియజెయ్యటం సాధ్యం కాదు. ఆ ప్రయత్నం చెయ్యకండి'' అన్నాడు ఐ.జి.

"ఏదో ఒక నేరం మోపి ఆ ముగ్గురు ఘరానా నేరస్థులనీ కస్టడీలోకి తీసుకుంటే?''

"వద్దు మిస్టర్ నాయక్....ఇన్ని హత్యలకు కారణమైన మనుషులమీద కసి, వుండటం సహజం. ఐనా మనం వాళ్ళని సాక్ష్యం, ఆధారం లేకుండా పట్టుకోటం సాధ్యం కాదు. ఇలా జరుగుతుందనేవాళ్ళు కాస్ట్రోని ఈ సిటీకి పిలిపించారు. ఆ ముగ్గుర్ని కస్టడీలోకి తీసుకున్నా అతను మనకు దొరకడు. దొరక్కుండా నగరంలో అలజడి రేపుతాడు. అతడి గురించి మనకు తెలుసు. మనం ఇంకో విషయం గుర్తు చేసుకోవాలి. మినిస్ట్రీలో ఆ ముగ్గురికీ మంచి వాల్యూ వుంది. కారణం లేకుండా కస్టడీలోకి తీసుకొంటే ఒక్క గంటలో వాళ్ళు బయటకు వెళ్ళిపోతారు. నో....ఇట్స్ నాట్ ది వే'' అన్నాడు ఐ.జి.

కొంచెంసేపు నాయక్ మాట్లాడకుండా వుండి పోయాడు. ఆయన గుండెలో మంట రేగింది. దారుణంగా హత్య చెయ్యబడిన ఇన్‌స్పెక్టర్ అమృతరాజు ఆయన కళ్ళముందు కనబడ్డాడు. వదలకూడదు. ప్రాణాలకు తెగించయినా ఆ నేరస్థులను పట్టుకోవాలి.

"మిస్టర్ నాయక్!" అటూ ఇటూ ఆలోచిస్తూ తిరుగుతున్న ఐ.జి. పిల్చాడు.

"సర్!"

"ఈ హత్యలను ఆపకపోతే ప్రజల్లో పోలీసులమీద నమ్మకం పోతుంది .... ఆ పరిస్థితి రాకముందే మనం క్రిమినల్స్‌ని పట్టుకోవాలి. ఈ పని ఒకరితో జరగదు. అందుకే అఫిషియల్స్ కాన్ఫరెన్స్ ఎరేంజ్ చెయ్యాలి....మిగిలిన ఆఫీసర్స్ సలహాలు కూడా తీసుకొని ఒక పథకం తయారు చెయ్యాలి .... అవునంటారా?" అన్నాడు ఐ.జి.

తల వూపాడు ఎస్.పి. నాయక్.

ఐ.జి. ఏదో మాట్లాడుబోతున్నప్పుడు బల్లమీద వున్న ఫోన్ మోగింది.

రిసీవరు ఎత్తి "మైగాడ్ ...ఇంకో.........హత్యా!" అన్నాడు ఐ.జి!

నాయక్ కళ్ళ ముందు కాస్ట్రో కనబడ్డాడు ఆ క్షణంలో.

*　　　　*　　　　*

బయట ఇంకా చీకటి పడకపోయినా ఆ గదిలో దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

బల్ల యెదురుగా వున్న కుర్చీల్లో ముగ్గురూ కూర్చుని వున్నారు. వాళ్ళ మొహాలనిండా కోపం, ఆందోళన, భయం కలిసిపోయి వున్నాయి.

ధనుంజయ్ కోటు జేబులోనించి కర్చీఫ్‌తీసి మొహాన్ని తుడుచుకొని వాడియాని చూశాడు. వాడియా జైన్‌వైపు చూసి పొగ వస్తూన్న సిగరెట్‌ను యాష్‌ట్రేలో నొక్కాడు.

వాళ్ళ ఫీలింగ్స్‌ని గమనించనట్టు కాస్ట్రో విస్కీ తాగుతూ కూర్చున్నాడు. లైకా అతడి పక్కనే నిలబడి వుంది. ఆమె వంటిమీద బ్రా, అండర్‌వేర్ తప్పించి ఏమీ లేవు. అప్పుడప్పుడు ఆమె ముగ్గురు బాస్‌లనీ చూస్తూంది.

లైకాకు వాళ్ళ మౌనం గురించి తెలుసు.

కాస్ట్రో మొహంలో ఎటువంటి ఎక్స్‌ప్రెషన్ లేకుండా తాగుతున్నాడు.

"కాస్ట్రో" అన్నాడు జైన్ సిగరెట్టును లైటర్‌తో ముట్టించుకుని—

గ్లాసు కిందపెడుతూ అతడ్ని చూశాడు కాస్ట్రో.

"ఫిల్మ్ గురించి ఆలోచించావా?"

"డోంట్ వర్రీ!" అన్నాడతను చాలా మామూలుగా.

కాస్ట్రో అలా అనగానే ధనుంజయ్‌కు కోపం వచ్చింది. కంట్రోల్ చేసుకొన్నాడు. కాస్ట్రో రాక్షసుడు. అతడు తమ అనుచరుడు కాదు.

"ప్లీజ్ కాస్ట్రో....ముగ్గురం బతికివున్నా మాలో ప్రాణం లేనట్టే ఫీలవుతున్నాం. అవకాశం దొరికి జారి

పోయింది. ఆ ఫిల్ము మన చేతికి దొరికేవరకూ వర్రీ అవక తప్పదు. బాగా ఆలోచించు. ఆ డాన్సర్ దగ్గిర వున్న ఫిల్ము యేమయ్యింది? సేఫ్‌లో వున్న ఫిల్మ్ ఎలా మాయమయ్యింది? ఆ పాన్‌షాపువాడు నీకంటే ముందు ఇంకెవరికయినా సలీమా గురించి ఇన్ఫర్‌మేషన్ ఇచ్చేవాడేమో అడిగావా?''

''జైన్.... ఆ పాన్‌షాపువాడు ఇంకో మనిషికి ఇన్ఫర్‌మేషన్ ఇచ్చే అవకాశం లేదు. ఎందుకంటే ఖాదర్‌కు ఆ ఫిల్ము దొరికిన సంగతి యెవ్వరికి తెలుసు? నాలాగే ఆచూకీ తీయటానికి ఆ పాన్‌షాపువాడిని ఎవ్వరూ కలుసుకోరు. పాన్‌షాపువాడు చూసినా అది ఫిల్ము అని వాడికీ తెలీదు'' అన్నాడు కాస్ట్రో కొంచెం విసుగ్గా.

''ఐతే—సలీమా ఇంట్లో ఫిల్ము ఏమయ్యింది?'' అడిగాడు వాడియా వెంటనే.

''ఏమయ్యిందో ఆలోచించాలి. సలీమా ఆమె ప్రియుడు ఒకర్నొకరు మోసం చేసుకోలేదు. ఇద్దరూ కలిసే మనల్ని బ్లాక్‌మెయిల్ చెయ్యాలనుకున్నారు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నప్పుడు మూడో మనిషి యెవరో వినివుండాలి. అంతకు మించి మరో అవకాశం లేదు'' లైకా నడుము చుట్టూ చెయ్యివేసి దగ్గిరకు లాక్కుంటూ అన్నాడు కాస్ట్రో.

''ఎవరా మూడో మనిషి?'' ధనుంజయ్ అడిగాడు.

''తెలుసుకోవాలి.''

''ఎలా?''

''బుర్ర వుపయోగించి ధనుంజయ్....''

''ఆ మూడో మనిషి ఫిల్మును పోలీసులకు అందజేస్తే

ఏం చెయ్యాలి?" వాడియా అడిగాడు.

కాస్ట్రో నవ్వాడు.

నవ్వటం ఆపి "మీ ముగ్గురికీ వేషాలు మార్చి నాతో పాటు జింబాంబ్వే తీసుకువెళతాను. సరేనా?" అన్నాడు.

"ప్లీజ్........బి సీరియస్ మిస్టర్ కాస్ట్రో........మా యాంగ్జయిటీని నువ్వు అర్థం చేసుకోవటంలేదు" అన్నాడు జైన్.

"జైన్....యాంగ్జయిటీ ఫీలయినంత మాత్రాన ఏమీ కాదు. మందు తాగండి. అన్నీ మరచిపోయి రెస్ట్ తీసుకోండి. ఈ కాస్ట్రో మీ దగ్గిర వున్నప్పుడు మీ భయాలన్నీ వదిలెయ్యండి. ఆ ఫిల్మ్ పోలీసులకు దొరికినా వాళ్ళు మిమ్మల్ని యేమీ చెయ్యలేరు. అవసరమయితే మిమ్మల్ని ఇండియా సరిహద్దులు దాటిస్తాను. పాకిస్థాన్‌లో మీకు ఆశ్రయం కల్పిస్తాను. ఒప్పుకుంటారా?"

జైన్ మిగిలిన ఇద్దర్నీ చూశాడు.

వాళ్ళేమీ మాట్లాడలేదు.

కాస్ట్రో ఎంత ధైర్యం చెబుతున్నా ఒకవైపు భయం వాళ్ళని తరుముతూనే వుంది. ఇన్నాళ్ళూ సాక్ష్యాలు దొరకలేదు కాబట్టే పోలీసులు ఏమీ చెయ్యలేకపోయారని వాళ్ళకి తెలుసు. సాక్ష్యాలు దొరికిన క్షణంలో ఏం జరుగుందో కూడా వాళ్ళకి బాగా తెలుసు. కాని కాస్ట్రో ప్రొటెక్షన్ ఎంతవరకు? ఎంతమందిని చంపుతాడు? ఈదేశ సరిహద్దులు దాటి మరో దేశాన్ని చేరుకోవటం అంత సులభంగా సాధ్యమవుతుందా?

"ఏమిటి ఆలోచిస్తున్నారు? నా మాటల్లో మీకు నమ్మకం కనపడలేదా?" కాస్ట్రో అడిగాడు కళ్ళుచిట్లించి చూస్తూ—

"నమ్మకం గురించి కాదు .... ఇంకో దేశానికి పారిపోయే పరిస్థితి రావటం మా ముగ్గురికీ ఇష్టంలేదు. ఈ దేశంలో మాకు వున్న పొజిషన్ నీకు తెలుసు. ఇంకో దేశంలో సాధారణ మనుషుల్లా కేవలం చావకుండ వుండటం కోసమే బతికి వుండటం మాకొద్దు. అందుకే నువ్వు ముందు ఆ ఫిల్మ్ గురించి తెలుసుకోవాలి. మాకు మాటలు అవసరంలేదు .... పనికావాలి .... ఎంత డబ్బయినా ఇవ్వటానికి సిద్ధంగా వున్నాం. ఉయ్ వాంట్ ది ఫిల్మ్.." సీరియస్‌గా చెప్పాడు జైన్.

లైకా నడుమును వదిలేశాడు కాస్ట్రో. వాళ్ళ అంతరంగంలో ఏమున్నదో అతడికి అర్థమయ్యింది. తాగటం వల్లనే కాకుండా కోపంతో అతడికళ్ళు ఇంకొంచెం ఎర్రగా మారినాయ్.

సీసాలో మిగిలిన విస్కీని గొంతులోకి వంచుకుని లేచి నిలబడ్డాడు. ఒక్కసారి వాళ్ళని చూసి పక్కనే వున్న గదిలోకి వెళ్ళాడు. ఆ గదిని అతనికి ఎలాట్ చేశారు వాళ్ళు.

అతడు వెళ్ళిన తర్వాత వాళ్ళు మాట్లాడుకోలేదు.

ఆ గదికేసి చూస్తూ కూర్చున్నారు.

లైకా అక్కడే నిలబడిపోయింది.

ఈ పరిస్థితుల్లో కాస్ట్రోకి కోపం తెప్పించటం మంచిదేనా? ఆలోచిస్తూంది లైకా.

పదినిముషాలకు కాస్ట్రో గదిలోనించి బయటకువచ్చాడు. అతడు జుట్టును పూర్తిగా పైకి దువ్వుకున్నాడు. బొద్దుగా వున్న మీసాన్ని అతికించుకున్నాడు. పొత్తుగావున్న పొట్టిగా కత్తిరించినట్టున్న గడ్డాన్ని తగిలించుకున్నాడు. స్కయ్

కలర్ షర్టును ప్యాంటులోకి టక్‌చేసి కళ్ళకు గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు పెట్టుకున్నాడు.

అతన్ని బాగా తెలిసినవాళ్ళయినా గుర్తుపట్టడం కష్ట మనుకున్నారు ఆ ముగ్గురూ....

ఇంతకీ కాస్ట్రో ఆలోచనయేమిటి? ఎందుకోసం వేషాన్ని మార్చుకున్నాడు?

వాళ్ళిలా ఆలోచిస్తున్నప్పుడే అతను బయటకు వెళ్ళి పోయాడు.

పువ్వుల చెట్లపక్కనే ఆపివున్న కార్లో ఎక్కి స్టార్ట్ చేశాడు.

రెండు నిముషాల్లో ఎంబాసిడర్ కారు నగరవీధుల్లో తిరగటం మొదలుపెట్టింది.

తాగిన మైకం అతడిలో బాగా పనిచేస్తుంది.

ఎక్కడా ఆపకుండా కారును రోడ్లమీద పరుగు తీయించాడు.

కాస్ట్రోలో కోపం పెరిగిపోయింది. ముఖ్యంగా జైన్ మాటలు అతడ్ని రెచ్చగొట్టాయి. దెబ్బతిన్న పులిలాగా ఆలోచిస్తుంది అతడి మెదడు.

ఎగ్జిబిషన్ గ్రవుండు దగ్గిరకు వచ్చాడు అతను. ఎంబా సిడర్‌ను ఆపాడు.

అప్పటికే దీపాలు వెలుగుతున్నాయి.

గ్రవుండు బయటవున్న గోడపక్కనే ఆగివున్నాయి చాలా మోటారు వాహనాలు.

గ్రవుండు లోపల సందడి బయటకు వినపడుతోంది. ఇండస్ట్రియల్ అండ్ ట్రేడ్ ఎగ్జిబిషన్‌లో జనం చాలా మంది వున్నారు.

లోపల తిరుగుతున్న జయింట్‌వీల్ రోడ్డుమీదకు కన పడుతోంది.

రెండు నిముషాలు కార్లోనే కూర్చుని ఆలోచించాడు ఆతడు. తర్వాత కారును గోడపక్కనే పార్కు చేసి టిక్కెట్టు తీసుకొని గ్రవుండ్ లోపలకు నడిచాడు.

ఎన్నో రకాల స్టాల్స్ దగ్గర జనం గుంపులుగా నిలబడి చూస్తున్నారు.

కాస్ట్రో సిగరెట్టు ముట్టించాడు.

పొగ వదులుతూ జనాన్ని తప్పుకొంటూ నడుస్తు న్నాడు. అతడికి బాగా అనీజీగావుంది. గుండెలనిండా మంట మండుతున్నట్టు ఫీలయ్యాడు.

ఫిల్మ ఏమయిపోయింది?

దాన్ని తాను సాధించగలడా?

ఐస్‌క్రీం స్టాలు దగ్గిర ఆగాడు.

ఒక యువకుడు—యువతి నవ్వుకుంటూ నిలబడి ఐస్‌క్రీం తింటున్నారు. ఆ అమ్మాయి పెద్దగా నవ్వు తోంది.

ఇరవై యేళ్ళలోపు వుంటుంది వయసు—

పొడుగూ పొట్టికాని ఎత్తులో తెల్లగావుంది.

ఆమె అందం కాస్ట్రోని ఆకర్షించింది.

ఆమె కాస్ట్రోని చూడలేదు.

కాస్ట్రో ఆమెనే చూస్తూ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

రకరకాల ఆడవాళ్ళు అతనికి కనపడ్డారు. అతడి కళ్ళ ముందు ఆ అమ్మాయే కనపడుతోంది. స్వచ్ఛమైన ఆ నవ్వు అతని ఎక్స్‌ప్రెషన్స్‌ను మార్చేస్తూంది.

వాళ్ళిద్దరు అతనికి జ్యూస్ స్టాల్ దగ్గర కనపడ్డారు. అక్కడకూడా ఆ అమ్మాయి నవ్వుతూనే వుంది. కాస్ట్రో కొంచెం దూరం వాళ్ళవెనుకే నడిచాడు. తర్వాత అతను వాళ్ళను దాటిపోయాడు.

మళ్ళీ జయింట్ వీల్ దగ్గర వాళ్ళు కలిశారు.

కాస్ట్రో అక్కడ నిలబడివాళ్ళు జయింట్ వీల్‌ఎక్కి తిరుగుతున్నప్పుడు చూశాడు. వాళ్ళు దిగివచ్చారు.

వచ్చిన తర్వాత స్టాల్స్‌కి దూరంగా ఒకచోట కూర్చున్నారు.

వాళ్ళ వెనుకవైపు కొంచెం దూరంలో అతడుకూడా కూర్చున్నాడు. అక్కడ బాగా గడ్డి పెరిగివుంది. ఆ అమ్మాయి మళ్ళీ నవ్వుతోంది.

ఏదో పారిశ్రామిక ప్రదర్శన ఏర్పాటుచేసిన స్టాలు వెలుతురుకు అడ్డుగా నిలబడివుంది.

వాళ్ళిద్దరూ కూర్చున్న ప్రదేశంలో చీకటిగా వుంది.

పదినిముషాలకు వాళ్ళిద్దరూ లేచి నిలబడ్డారు.

అప్పటికే కాస్ట్రో చేతిలో సైలెన్సరు అమర్చిన పిస్టలు ప్రత్యక్షమయ్యింది.

ఆ అమ్మాయి అతడి చెయ్యిపట్టుకొన్నది.

గాలికి ఎగురుతున్న పమిటను నడుము చుట్టూ తిప్పుకొంటున్నది.

సరిగా అప్పుడే పేల్చాడు పిస్టలును కాస్ట్రో.

వెన్నులో నించి దూరిపోయింది గుండు.

కెవ్వుమంటూ కూలిపోయిందామె నేలమీదకు—

జయింట్ వీల్ దిగిన జనం ఆమె అరుపు విని పరిగెత్తుకొంటూ వచ్చారు.

పక్కనేవున్న అతడికి మతిపోయింది బోర్లాపడిన ఆమె వెన్నులోనించి కారుతున్న రక్తాన్ని చూడగానే —

కిందపడుతున్నప్పుడే ఆ యువతి ప్రాణం పోయింది.

కాస్ట్రో లేచి నిలబడ్డాడు. పిస్టోలును జేబులోకి నెట్టుకొని జనాన్ని దాటుకొంటూ వెళ్ళిపోయాడు బయటకు —

అతడి గుండెమంట చల్లారింది.

ఇప్పుడతను మాయమైన ఫిల్ము గురించి కూల్‌గా ఆలోచిస్తూ గ్రవుండ్‌లోనించి బయటకు వచ్చాడు.

అప్పటికే ఎవరో పోలీస్ కంట్రోల్‌రూంకు ఫోన్ చేశారు.

కాస్ట్రో తిరిగి వస్తున్నప్పుడు సైరన్ మోగించుకొంటూ ఎగ్జిబిషన్ గ్రవుండ్‌వైపు వెళుతున్న పోలీసు వాహనాలు కనపడ్డాయి.

వాట్ని చూసి నవ్వుకొన్నాడు కాస్ట్రో.

* * *

గదిలో ఫ్యాను గిర్రున తిరుగుతోంది.

డిమ్‌గా వెలుగుతోంది దీపం .... తోటలో వెలుగుతున్న దీపాల వెలుతురు కిటికీల్లోనించి లోపలకు పడుతోంది.

కుర్చీలో వెనక్కువాలి కళ్ళు మూసుకొన్నాడు యస్.పి. నాయక్. ఆయన కళ్ళముందు ఎగ్జిబిషన్ గ్రవుండ్‌లో బోర్లాపడి చనిపోయిన అందమైన ఆ యువతి రూపం కనపడింది.

ఆ యువతికి శత్రువులు ఎవ్వరూలేరని, మధ్యతరగతి కుటుంబంలోపుట్టి డిగ్రీ ఫైనలియర్ చదువుతోందనీ ఆమె పక్కనేవున్న యువకుడు చెప్పిన మాటలు ఆయనకు గుర్తుకొచ్చాయి.

అలాంటి యువతిని పిస్టలుతో కాల్చి చంపవలసిన అవసరం ఎవరికి వుంది?

జనం మధ్య ఓ యువతిని హత్యచేసి నిబ్బరంగా వెళ్ళిపోగల ధైర్యం వున్న మనిషి ఎవరు?

కాస్ట్రో కదిలాడు అంతరంగంలో—

అవును. అవసరం లేకపోయినా హత్యలుచేసే అలవాటు ఒక్క కాస్ట్రోకేవుంది సంతోషంలోనూ, దుఃఖంలోనూ హత్యలు చెయ్యటం అతని హాబీ. నాలుగేళ్ళ క్రితం భారతదేశంలో అంతులేని హత్యలుచేసి సంచలనం సృష్టించాడు. ఇప్పుడుకూడా అలాంటి సంచలనమే లేస్తూంది.

ఎగ్జిబిషన్ గ్రవుండ్‌లో యువతి హత్య గురించి న్యూస్ పేపర్లు ఎంతటి దుమారాన్ని లేవదీస్తాయో నాయక్ వూహించాడు. ఇప్పటికే జైన్ ముఠాచేస్తున్న హత్యలు ప్రజల్లో ఆందోళనను కలిగించాయి. పోలీసుల అసమర్థతకు ఇంతకంటే నిదర్శనం ఇంకేమీ అవసరం లేదు.

కాస్ట్రో!

ఆ పేరు తల్చుకొంటున్నప్పుడు నాయక్ పిడికిళ్ళు బిగుసుకొన్నాయి.

నరరూప రాక్షసుడు.

కాస్ట్రోని పట్టుకోవాలి. ఉరికంబం ఎక్కించాలి....

ఎలా?!

నాయక్ సిగరెట్ వెలిగించి గదిలో ఒక్కడే కూర్చుని ఆలోచిస్తున్నప్పుడు ఆయన భార్య ఊర్మిళ లోపలకు వచ్చింది.

ఒక్క క్షణం చూసి "భోజనం చెయ్యరూ?" అంది.

"వద్దు" అన్నాడు నాయక్.

"వద్దని గంట క్రితం చెప్పారు. మళ్ళీ అడుగుతున్నాను. ఆకలితో నిద్ర పట్టదు....రండి."

"ప్లీజ్....ఊర్మిళా....భోజనం చేసినా నాకు నిద్ర పట్టదు. ఇంత అపజయాన్ని నేనెప్పుడూ ఎదుర్కోలేదు. జాలి, దయలేని ఒక అంతర్జాతీయ హంతకుడి పడగ నీడలో ఈ నగరం నిద్రపోతోంది."

"ఎవరతను?" అడిగింది ఊర్మిళ.

"కాస్ట్రో."

వెంటనే గుర్తుకొచ్చింది ఆమెకు కాస్ట్రో పేరు.

నేరస్తుల గురించి నాయక్ చెప్పకపోయినా పేపర్లలో చదివి తెలుసుకునే ఇంట్రస్ట్ ఊర్మిళకు ఎప్పుడూ వుంది.

"మైగాడ్....నాలుగేళ్ళ క్రితం ఇండియాలో ఎన్నో హత్యలు చేసి దొరక్కుండా పారిపోయాడు" అన్నదామె.

"అవును. ఆ డెవిల్ యిప్పుడు మన సిటీలోనే వున్నాడు. అవసరం లేకపోయినా అమాయకులను పిస్తోలుతో కాల్చి చంపుతున్నాడు. ఇంకా ఎంతోమందిని అతను

హత్య చేస్తాడు ....''

"కాస్ట్రోని మీరు పట్టుకోలేరా?" అడిగింది ఊర్మిళ భర్త కళ్ళలోకి చూస్తూ —

"పట్టుకోవాలనే పట్టుదల వుంది ఊర్మిళా ....కాని అతనంత సులభంగా దొరకడు. అతడికి పోలీసులను మించిన తెలివితేటలు వున్నాయి. కాస్ట్రో గూఢచారశాఖలో వుంటే బాగా రాణించేవాడు. కాని క్రిమినల్‌గా మారిపోయి తన ఇంటెలిజెన్స్‌ను దేశద్రోహానికి వుపయోగిస్తున్నాడు."

"వర్రీ అవకండి ....కాస్ట్రో తప్పకుండా దొరుకుతాడు.. త్వరలోనే ఆతడ్ని పట్టుకుని ఈ సిటీని అతన్నించి రక్షించండి ....''

నాయకేదో మాట్లాడబోయాడు. సరిగ్గా అప్పుడే టెలిఫోన్ మోగింది.

ఊర్మిళ కదిలి రిసీవరు అందుకుని "హలో" అన్నది.

"ప్లీజ్ ....నాయక్‌ని పిలుస్తారా?" ఎవరో అడిగారు అవతల్నించి.

"మీ రెవరు?"

"ప్లీజ్ ...." విసుక్కున్నాడు—

ఊర్మిళ రిసీవర్ని పట్టుకుని భర్తని చూసి కళ్ళతో సైగ జేసింది ....

సిగరెట్ ముక్కను యాష్‌ట్రేలో నొక్కి వచ్చి రిసీవరు తీసుకుని "నాయక్ స్పీకింగ్" అన్నాడు.

"హల్లో ....నాయక్ ....గుర్తుపట్టావా?" నవ్వుతూ అది

గాడు.

"కాస్ట్రో" వెంటనే అన్నాడు నాయక్... ఆ గొంతు ఆయనకు బాగానే జ్ఞాపకం వుంది.

వెల్ ... నాయక్ ....నా గొంతును మీరు బాగానే గుర్తు పెట్టుకున్నారు. ఏం చేస్తున్నారు? ఇంకా నిద్రపోలేదా?" అడిగాడు కాస్ట్రో.

"నిద్ర పట్టక ఫోన్ చేశావా కాస్ట్రో?" అన్నాడు నాయక్.

"లేదు ....కావాలనే ఫోన్ చేశాను. సస్పెన్స్ ఎందుకు? ఎగ్జిబిషన్‌లో అమ్మాయిని నేనే కాల్చి చంపాను."

"ఎందుకు?"

"కారణంలేదు. కాల్చి చంపాలని అనిపించింది.... చంపేశాను. అంతే....ఆ హత్య గురించి మీరు దర్యాప్తు జరపటం అనవసరం."

"దారుణం కాస్ట్రో ...కారణం లేకుండా అమాయకులను కాల్చి చంపటం అమానుషం....ప్లీజ్ .... నువ్వీ హత్యలు ఆపెయ్యి....ఒక సాధారణ సిటిజన్‌గా నిన్ను రిక్వెస్ట్ చేస్తున్నాను. అనవసరంగా ప్రజల ప్రాణాలను తియ్యకు."

నవ్వేడు కాస్ట్రో....నవ్వటం ఆపి "నాయక్.... నెత్తురు రుచి మరిగిన పులిని నేను. ఏ దేశానికి వెళ్ళినా హత్యలు చెయ్యకుండా నేను బతకలేను. అది నా బలహీనత అనుకోండి ...సారీ ... ఈ విషయంలో నేను మీకు హామీ ఇవ్వలేను....మీకు ఫోన్ చేసిన కారణం వేరే

వుంది నాయక్" అన్నాడు....

"ఏమిటి?"

"మనిద్దరం కలుసుకోవాలి....మీతో మాట్లాడాలి."

ఆశ్చర్యపడ్డాడు నాయక్.

ఏదో ఒక రాత్రి ఫోన్ చేసి కాస్ట్రో ఇలా కలుసుకోవాలని అంటాడని వూహించలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? యెక్కడ కలుసుకోవాలనేనా?"

"కాదు... నేను నీకు శత్రువును.... నన్ను కలుసుకోవాలనే ఆలోచన నీకు వచ్చినందుకు?"

"కొంచెంసేపు మన శత్రుత్వం గురించి మరచిపోండి నన్ను కలుసుకోవటానికి మీరు యిష్టపడుతున్నారా?"

"చెప్పు ఎక్కడ కలుసుకోవాలి?"

"సరిగ్గా పదిహేను నిముషాల తర్వాత కార్లో బయల్దేరండి. బ్లాక్‌హిల్స్ పక్కనించి వెళ్ళే హైవేమీద ప్రయాణం చెయ్యండి. అరగంట లోపల మిమ్మల్ని ఎక్కడో ఒకచోట కలుసుకుంటాను. డియర్ నాయక్.... మీకు ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను" అన్నాడు కాస్ట్రో.

"లేదు....నేనొక్కడినే వస్తాను....ఎవరి సహాయము తీసుకోను నిన్ను పట్టుకోటానికి...."

"వెల్...మీ రొక్కరు నన్ను పట్టుకునే ప్రయత్నం చెయ్యరని నాకు తెలుసు. ఐనా నన్ను నేను రక్షించుకోగలను..."

డిస్కనెక్ట్ చేశాడు కాస్ట్రో అవతల్నించి.

అప్పటిదాకా అక్కడే వుండి వాళ్ళ సంభాషణ వింటున్న ఊర్మిళ—నాయక్‌తో ఇలా అన్నది:

"వద్దు....ఈ రాత్రి మీరు ఒక్కరే ఆ డెవిల్‌ని కలుసుకోటానికి వెళ్ళొద్దు .."

నాయక్ నవ్వి "కాస్ట్రో జిత్తులు నాకు తెలుసు ఊర్మిళా....అతడి ఎత్తుకు పై ఎత్తు వెయ్యాలి " అని డయల్ చేశాడు....

క్షణం తర్వాత కంట్రోల్ రూమ్‌లో యెవరో పలికారు.

"నాయక్ హియర్...బ్లాక్ హిల్స్ పక్కనించి వెళ్ళే హైవేమీద అంతర్జాతీయ నేరస్థుడు కాస్ట్రో వెళుతున్నాడు. నాలుగు వాహనాల్లో పోలీసులు బయల్దేరండి....కొంచెం కొంచెం గేప్‌తో వెళ్ళండి....హైవేమీద వెళ్ళే వాహనాలను సెర్చ్ చెయ్యండి....కాస్ట్రో దొరుకుతాడు. పావుగంట తర్వాత ఆ రోడ్డుమీద కార్లో వస్తాను........ క్విక్...."

రిసీవరు పెట్టేసి భార్యకేసి చూశాడు నాయక్.

"కాస్ట్రో దొరుకుతాడంటారా....?" అనుమానంగా అడిగింది.

"నమ్మకంలేదు. ఐనా ప్రయత్నం చెయ్యాలి.... కాస్ట్రోకి నామీద నమ్మకం వుంది. నేను ఒక్కడినే వస్తానని అతను అనుకుంటాడు....ఫోన్‌లో మాట్లాడి అతను వెంటనే బయల్దేరి ఆ దారిలో ఎక్కడో కాచుకుని వుంటాడు చీకట్లో. అందుకే నన్ను పదిహేను నిముషాల

తర్వాత బయల్దేరమని చెప్పాడు. నేను అతడ్ని పట్టుకునే ఏర్పాటు చేస్తానని ఊహించాడు....కాబట్టి అంత జాగ్రత్తగా వుండడు...."

పది నిముషాల్లో డ్రెస్ మార్చుకొని గేరేజ్‌లో వున్న కారుని బయటకు తీశాడు నాయక్....ఆయన కోటుజేబులో పిస్తోలు బరువుగా వుంది.

గేటుదగ్గిర జవాను నిలబడి వున్నాడు—

చేతినున్న వాచీ చూసుకున్నాడు నాయక్....

భార్యకేసి చూసి ముందుకు పోనిచ్చాడు కారుని....

నిర్మానుష్యంగా వున్న వీధుల్లోనించి దూసుకుపోతోంది ఎంబాసిడర్.

కారు డ్రయివ్ చేస్తూనే సిగరెట్ ముట్టించాడు నాయక్ లైటర్‌తో....రోడ్డుమీద అప్పుడప్పుడు యెదురు వస్తున్న వాహనాలు వేగంగా పరుగుదీస్తున్న ఎంబాసిడర్‌ని చూసి పక్కకు తప్పుకొని పోతున్నాయి దూరం నించే—

సిటీ బయటకు వచ్చింది కారు.

నాయక్ ఆలోచిస్తున్నాడు — కాస్ట్రో తనతో ఏం మాట్లాడాలని అనుకున్నాడు? అతడు పన్నిన వ్యూహం యేమిటి?

ఎంత ఆలోచించినా అర్థంకాలేదు.

ఫోన్లో చెప్పలేదు.

సూచనగా ఐనా తెలియజెయ్యలేదు.

ఏమైనా ఈ అవకాశాన్ని వదులుకోగూడదు. కాస్ట్రోని ఉచ్చులో బిగించాలి.

ఇంతకీ కాస్ట్రో బయటకి వచ్చాడా?

బ్లాక్ హిల్స్ దాటిపోయింది కారు.

రోడ్డుమీద పడుతోంది లైట్ల వెలుతురు. రోడ్డుకు రెండువైపులా చీకటిగా వుంది.

చీకట్లో ఎక్కడయినా కాస్ట్రో పొంచివున్నాడా?

నాలుగు పోలీసు వాహనాలు బాగా ముందుకు వెళ్ళిపోయి వుండాలి. అవును. పావుగంటలో చాలాదూరం వెళ్ళిపో వచ్చు. ఆలోచిస్తూ డ్రయివ్ చేస్తున్నాడు.

ఆయనకి దూరంనించి ఏదో వాహనం వస్తున్నట్టుగా లైట్ల వెలుతురు కనపడింది. కొంచెం దగ్గరకు వచ్చిన తర్వాత దాన్ని ఫోర్డుకారుగా గుర్తించాడు.

రోడ్డుకు మధ్యగా తిప్పాడు ఎంబాసిడర్‌ని. లైట్లు ఆఫ్ చెయ్యకుండా విండోలోనించి చెయ్యి బయటకు వుంచి ఫోర్డు కారును ఆపమన్నట్టు సైగచేశాడు.

ఆగిపోయింది ఫోర్డు.

"ఐయామ్ యస్.పి. నాయక్....మీపేరు చెబుతారా?" ఫోర్డులో కూర్చున్న ముప్పయ్యేళ్ళ యువకుడిని అడిగాడు నాయక్.

"డాక్టర్ అరోరా...." అన్నాడతను.

అతను సన్నగా వున్నాడు. పాపిడి దువ్విన క్రాపు - తెల్లని పొడుగు చేతుల షర్టు వేసుకున్నాడు.

"దార్లో మిమ్మల్ని పోలీసులు చెక్ చేశారా?"

"అవును....ఎందుకో తెలీదు."

"ఎన్నివాహనాలు ఎదురైనాయో చెప్పగలరా?"

"మూడు"

"నాలుగుకాదా?"

"కాదు .... మూడు .... మొదటి వాహనంలో వున్న ఇన్‌స్పెక్టర్ నన్ను చెక్ చేశాడు. ఆ తర్వాత మిగిలిన రెండు వాహనాలు వాళ్ళు కూడా నా కారును ఆపారు."

"థాంక్‌యూ" కారును ఎడమపక్కకు తిప్పాడు నాయక్.

డాక్టర్ అరోరా ఫోర్డుకారు వెళ్ళిపోయింది.

కంట్రోల్ రూమ్‌నించి నాలుగు వాహనాలు బయలుదేరితే డాక్టర్ అరోరాకు మూడే ఎందుకు ఎదురవుతాయి?

యాక్సిలేటర్ మీద కాలును గట్టిగా నొక్కాడు నాయక్. బాణంలా దూకింది ఎంబాసిడర్.

ఆయన మనసులో ఆలోచనలు గజిబిజిగా వున్నాయి....

రెండు నిమిషాలు గడిచాయి.

అక్కడ రోడ్డు బాగా ఎత్తుగావుంది....రోడ్డుకు రెండు వైపులా క్వారీలు వున్నాయి. గుంటలతో బాగా పల్లంలో వుంది ఆ ప్రదేశం....

రోడ్డు ప్రక్కలకు చూస్తూ డ్రయివ్ చేస్తున్నాడాయన. ఇంకొక్క నిముషం తర్వాత సడన్‌బ్రేకుతో కారును ఆపాడు.

పరీక్షగా చూస్తేగానీ తెలీదు రోడ్డుకు కుడివైపుగా వున్న పల్లంలో ఏదో మండుతోందని....

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ'లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి రెండేసి నెలలకొకసారి V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో రెండు నెలలకొకసారి పత్రికల ఖరీదు రు. 30/-లు చెల్లించి కాపీలు పొందవచ్చును. యీ సౌకర్యం కావలసివస్తే మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

ఇంజన్ ఆఫ్‌చేసి కార్లోనించి దిగి రోడ్డు చివరకు నడిచి నిలబడ్డాడు. పెద్ద గుంటలోనించి మంటలు లేస్తున్నాయి. పెట్రోలు వాసన వస్తూంది....

మోటారు వాహనం తగలబడుతోందని గ్రహించాడు నాయక్....

ఆయన మెదడులో అప్పటికే ఒక ఆలోచన జేరి పోయింది.

ఆ మండుతున్న మోటారు వాహనం పోలీసు జీపు అయివుండాలి. అందుకే డాక్టర్ అరోరాకు నాలుగో పోలీసువాహనం ఎదురుపడలేదు.

మళ్ళీ కారుదగ్గిరకు నడిచాడు నాయక్....

చిన్న టార్చ్‌లైటును తీసుకొని రోడ్డు పక్కనేవున్న పల్లంలోకి దిగటం మొదలుపెట్టాడు.

ఆయన కళ్ళముందు కాస్ట్రో కదులుతున్నాడు.

అవును. కాస్ట్రో ప్రతీకారం తీర్చుకొన్నాడు మాట తప్పినందుకు పెనాల్టీ విధించాడు.

పల్లంలోకి వెళ్ళాడు....

గోతికి కొంచెం దూరంలోనే టార్చిలైటు వెలుతురులో బోర్లా పడివున్న కానిస్టేబుల్ శరీరం కనపడింది. టోపీ లేదు. తలమీదనించి నెత్తురు కారుతోంది. కొంచెం దూరంలో ఇంకో కానిస్టేబుల్ శరీరం ఆయనకు కన పడింది....

ఇద్దరిలో ఒక్కడే బతికివున్నాడు.

ఇంకా శ్వాస ఆడుతోంది.

గుంటదగ్గిరకు వెళ్ళాడు.

బోర్లా పడిపోయిన జీపు మండుతోంది.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

విడుదలైనవి !

1. సౌగంధి యద్దనపూడి సులోచనరాణి 25-00
(డైరెక్టు నవల)

2. ఉషశ్రీ రామాయణం (సరళవచనం) 25-00

3. ఉషశ్రీ భారతం ,, 25-00

4. ఉషశ్రీ సుందరకాండ ,, 12-00

5. పదకేళి 9-00
(100 పజిల్స్—ఆఖరున జవాబులతో)

6. ఉద్యోగపరీక్షలు - విజయరహస్యం 7-50
P.V.K. ప్రసాదరావు

7. కార్యాలయ - వాణిజ్యపదకోశము 12-00
R. వెంకటేశ్వరరావు

8. చైతన్యదీపాలు
ఆమూరి వెంకటసీతారామమూర్తి 20-00

9. మనోరథం ద్విభాష్యం రాజేశ్వరరావు 20 00
(కథలు)

అడ్వాన్సులేని ఆర్డర్లు అంగీకరింపబడవు.

పోస్టు ఖర్చులు అదనం

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002.

నాయక్ గుండె మండిపోయింది....

కాస్ట్రోని ప్రాణాలతో వదలకూడదు.

నిముషానికి వాహనాల చప్పుడు వినపడి తలెత్తి చూశాడు.

వరుసగా వచ్చిన మూడు పోలీసు జీపులు నాయక్ ఎంబాసిడర్ పక్కనే ఆగిపోయాయి.

మంట వెలుతుర్లో పల్లంలో నిలబడిన నాయక్‌ని చూసి వాళ్ళు చీకట్లో పల్లంలోకి దిగటం మొదలుపెట్టారు.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page

Regd.no: H/HD-48
PRABHAKAR